
జనబలం


ప్రజలే ప్రభువులు

నవంబర్ 2026

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక









భావప్రకటనా స్వేచ్ఛ Vs శాంతిభద్రతల పరిరక్షణ



ఆందోళనలు అంటే రోడ్లను దిగ్బంధం చేయటం, ఎంతమంది బలవన్మరణాలు వంటి వాటికి పాల్పడితే అంత గొప్ప ఉద్యమం అని.. మన రాజకీయ, పౌర సమాజ నేతల్లో పలువురు ఇప్పటికీ నినాదాలిస్తుంటారు. భావ ప్రకటనా స్వేచ్ఛకి, శాంతిభద్రతలకి మధ్య ఏదో పెద్ద సైద్ధాంతిక ఘర్షణ జరుగుతున్నట్లు చిత్రీకరిస్తుంటారు. ఏ ఇతర దేశంలో యువత రోడ్ల మీదకు వచ్చినా.. భారత్‌లోనూ అలా జెన్ జడ్ వచ్చి తిరగబడాలని పిలుపివ్వటం ఇటీవలికాలంలో ఫ్యాషనైపోయింది. ఇప్పుడు ఫ్రాన్స్ వంతు వచ్చింది. అయితే, ఈ విషయంలో మనకు, ఇతర దేశాలకు పోలిక లేదని, మనం శాంతియుతంగానే నిరసన తెలియచేస్తామని కాక్రోచ్ పార్టీ (సీజేపీ) ప్రారంభకులు అభిజిత్ దీప్కే వివరణ ఇచ్చారు. తమ బృందంలోని కీలక నాయకులను అరెస్ట్ చేసినా ఏమాత్రం హింస చెలరేగలేదని గుర్తుచేశారు. గాంధీ అహింస, అంబేద్కర్ రాజ్యాంగబద్ధత, నెహ్రూ దేశభక్తి వంటి అంశాలను ఉటంకించారు. ఆచరణలో లోపాలున్నా, కనీసం భావజాలపరంగా ఆమాత్రం స్పష్టతనివ్వటం అభినందనీయం. ఇంకొన్ని నెలల్లో దేశమంతా రోడ్లెక్కుతుందని, పెద్ద తిరుగుబాటు వస్తుందని ఇప్పటికీ చెబుతున్న తలపండిన నేతలు, మేధావులు.. జెన్ జడ్ నుండి ఆ ఇంగితజ్ఞానమైనా నేర్చుకోవటం మంచిది! మనకు ఓటు హక్కు ఉన్నా, ఎన్నికల మధ్య భావప్రకటనా స్వేచ్ఛ ద్వారా నిరసన వ్యక్తం చేసే హక్కును ఉపయోగించుకోవద్దని అనటం లేదు. కానీ పబ్లిక్ ఆర్డర్ లేకుండా స్వేచ్ఛ ఎక్కడ్నుంచి వస్తుంది? సమాజంలో శాంతిభద్రతలు, క్రమశిక్షణ లేకుండా ప్రజాస్వామ్యంలో హక్కులు ఎలా సాధ్యం? మన హక్కులు ఎప్పుడూ ఇతరుల పట్ల మన బాధ్యతల నుండి వస్తాయి. అదేవిధంగా, అవతలివారి హక్కులు. కాబట్టి శాంతిభద్రతల పరిరక్షణ.. స్వేచ్ఛకి వ్యతిరేకం కాదు. అరాచకత్వం రాజ్యమేలుతున్నప్పుడు స్వేచ్ఛకు అర్థం ఉండదు. ప్రజాస్వామ్యమూ నిలబడదు. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ఉదంతాల్ని చూశాం- ఆందోళనలు అదుపుతప్పి చిలికిచిలికి గాలివానల్లా అరాచకానికి దారితీసి రాజ్యాంగ వ్యవస్థలు కుప్పకూలటం. రాజ్యాంగసభలో అంబేద్కర్ చెప్పినట్లు, మనకు స్వతంత్రానంతరం అందరికీ సమాన ఓటుహక్కు, భావప్రకటనా స్వేచ్ఛ ఉన్నప్పుడు, ప్రభుత్వాల్ని మనమే ఏర్పాటు చేస్తున్నప్పుడు.. ఆందోళనలు రాజ్యాంగబద్ధంగా ఉండాలి. శాంతియుతంగా ఉండాలి. ఇతరుల స్వేచ్ఛకు ఆటంకం లేకుండా ఉండాలి. వలసకాలంలోలా రాస్తారోకోలు, హర్తాళ్లు, సామూహిక బంద్‌లు వంటివి కాలంచెల్లినవి. రోడ్ల మీద ఆందోళనలతో, హింసాత్మక దాడులతో ఉద్యమాలు ఏం ఫలితాలు సాధించాయి? బ్లాక్‌మెయిల్ సత్యాగ్రహ నిరాహారదీక్షతో అన్నా హజారే ఉద్యమం ఏం సాధించింది? లోక్‌సత్తా పూర్తి రాజ్యాంగబద్ధంగా చేసిన పెట్రోల్ బంకుల్లో తూనికల అక్రమాలపై పోరాటం వల్ల ప్రజలకు రోజుకు రూ.500 కోట్లు ఆదా అవుతోంది. హేతుబద్ధ వాదనలు, సాక్ష్యాలతో హైదరాబాద్ కూకట్‌పల్లిలో చేసిన భవనాల క్రమబద్ధీకరణ ఉద్యమం వల్ల దేశ చరిత్రలో మొదటిసారిగా తీసుకున్న లంచాల్ని ప్రభుత్వోద్యోగులు తిరిగి ఇచ్చేశారు. 2.జి స్పెక్ట్రమ్ విషయంలో లోక్‌సత్తా సుప్రీంకోర్టుకి వెళ్ళటం ద్వారా, 122 లైసెన్సులని రద్దు చేయించి, సహజ వనరుల కేటాయింపులో భవిష్యత్తులో అవినీతి లేకుండా పారదర్శక వేలంపాటలు, పోటీ ద్వారా నిర్ణయాలు చేసే పద్ధతిని ప్రవేశపెట్టటం జరిగింది. ఇవన్నీ విజయాలు కాదా? రాజ్యాంగబద్ధంగా ప్రజాస్వామ్య సంస్కరణలకు కృషి చేస్తున్న లోక్‌సత్తా సాధించినన్ని విజయాల్ని ఏ సంస్థ, ఎన్నికైన పార్టీలు సాధించాయి? 'ఆలోచనాపరులైన కొద్దిమంది చిత్తశుద్ధి గల పౌరుల కృషి మాత్రమే అంతిమంగా ప్రజాస్వామ్యాన్ని సంస్కరిస్తుందని' అమెరికాకు చెందిన సాంస్కృతిక మానవాభివృద్ధి శాస్త్రవేత్త, రచయిత మార్గరెట్ మీడ్ చెప్పిన మాటల్ని రుజువు చేసే ఉద్యమాలవి. 'సర్' ఓటరు జాబితాల ప్రక్షాళనలో లోపాలు, గందరగోళం వాస్తవం. కానీ ఈసీ సహా ఎవరైనా ప్రజలు ఎన్నుకున్న పార్లమెంటుకు జవాబుదారీయే. ఈసీ నిర్ణయాలలో దురుద్దేశాల్ని, చట్టవిరుద్ధ చర్యల్ని కనిపెడితే ఆధారాలతో సుప్రీంకోర్టు చేత విచారణ జరిపించండి, పార్లమెంటులో చర్చించి నిర్ణయం తీసుకోండి. మరో అంశం మీద అభ్యంతరం ఉంటే, సంబంధిత చట్టబద్ధ మార్గాలలో చర్యలు తీసుకోండి. ప్రభుత్వం నచ్చకపోతే ఓటు ద్వారా మార్చండి. అంతేతప్ప, అరాచకత్వం గొప్ప ఆందోళన అనే భ్రమను వ్యాప్తిచేయవద్దు. అది చివరికి పక్షపాత రాజకీయ అధికార క్రీడలో భాగమవుతుంది. ప్రజాస్వామ్యానికే ప్రమాదంగా మారుతుంది. ఐరోపా సహా ఎక్కడైనా, ఎంత సంచలన ఉద్యమాన్నయినా తీసుకోండి- నిజమైన పరిష్కారం చివరికి రాజ్యాంగం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. ప్రజాస్వామ్యంలో నిరసనలు భాగం. కానీ అవి రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్య వ్యవస్థతో సమతూకంతో ఉండాలితప్ప.. ఇతరుల హక్కులకు భంగం కలిగిస్తూ అరాచకత్వానికి దారితీయకూడదు.



-డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

ప్రజలే ప్రభువులు

నవంబర్ 2026

సంపుటి 28 సంచిక 11

జనబలం చందా రుసుము వివరాలు

సంవత్సర చందా	:	రూ. 100.00
మూడు సంవత్సరాలకు చందా	:	రూ. 290.00
ఐదు సంవత్సరాలకు చందా	:	రూ. 475.00
జీవితకాలపు చందా	:	రూ. 1200.00

సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్

జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో పకీభవిస్తున్నట్లు కాదు.

చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కు IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

కార్టూన్ కార్నర్



6 సూపర్ ఎల్‌నినో: నీటిపాఠం..అవకాశం

9 రాజ్యాంగాన్ని కాగితాలకే పరిమితం చేయటం రోడ్లపై ఆందోళనలకు మూలం

12 ప్రమాదకర ఓపీఎస్ డిమాండ్లు.. తెలంగాణ, పీఆర్ ప్రజలు తెలుసుకోవాల్సిన నిజాలు

20 మేధోవాదానికి ఓటు ప్రజాస్వామ్యానికి మంచి పరిణామం

23 తెలంగాణలో 23ఒక్కో రోగి చికిత్స సగటు వ్యయం ప్రయివేటులో రూ. 72,561

25 అపోహలు తొలగించాలి.. పారదర్శకంగా వ్యవహరించాలి

28 'ప్రజా' మేధావి అనగా ఎవరు?

33 ఐఏఎస్ కంటే రాజకీయాలు పరిష్కారమని ఎందుకు భావించారు?

కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యాయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

ఎన్నికల తీర్పుతో అధ్యక్షునికి సవాళ్లు!

సంపాదకీయం

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ ఘన విజయం సాధించడం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు రాజకీయంగా గట్టి ఎదురుదెబ్బ. ఈ ఎన్నికల ఫలితాలు ఆయన అనుసరిస్తున్న ఏకపక్ష, దూకుడు విధానాలపై అమెరికన్ ప్రజలు వ్యక్తం చేసిన అసమ్మతికి ప్రతిబింబంగా నిలుస్తున్నాయి. ఇకపై అధ్యక్షుడు తీసుకునే నిర్ణయాలకు ప్రతినిధుల సభ రూపంలో బలమైన ప్రతిఘటన ఎదురయ్యే అవకాశముంది. అయితే ఈ ఎన్నికల ఫలితాలు అధ్యక్షుడి కార్యనిర్వాహక అధికారాలను నేరుగా పరిమితం చేయకపోయినా, వాటి అమలుపై కాంగ్రెస్ గణనీయమైన ప్రభావం చూపగలదు.

సైనిక వ్యయాలు, దౌత్య సంబంధాలు, అంతర్జాతీయ వాణిజ్యం, ఆర్థిక విధానాలు వంటి కీలక అంశాల్లో అధ్యక్షుడి నిర్ణయాలను ప్రశ్నించే అవకాశం డెమోక్రాట్లకు లభించింది. సెనెట్‌లో డెమోక్రటిక్ పార్టీకి **54** స్థానాలు, రిపబ్లికన్ పార్టీకి **44** స్థానాలు లభించినప్పటికీ, కీలకమైన కొన్ని నిర్ణయాలను అడ్డుకోవడానికి అవసరమైన **60** స్థానాల ఆధిక్యం డెమోక్రాట్లకు దక్కలేదు. దీంతో సెనెట్‌లో రిపబ్లికన్ల ప్రభావం కొనసాగుతుంది. మరోవైపు ప్రతినిధుల సభలో **254** స్థానాలు సాధించిన డెమోక్రటిక్ పార్టీ గతంతో పోలిస్తే గణనీయమైన ఆధిక్యాన్ని సాధించింది. అత్యధిక రాష్ట్రాల్లో గవర్నర్ పదవులను కూడా ఆ పార్టీ కైవసం చేసుకుంది.

అమెరికా రాజ్యాంగ వ్యవస్థలో అధ్యక్షుడికి విస్తృతమైన కార్యనిర్వాహక అధికారాలున్నాయి. కాంగ్రెస్ ఆమోదించిన బిల్లులను వీటో చేసే అధికారం అధ్యక్షుడికి ఉన్నప్పటికీ, అధ్యక్షుడి విధానాలను వివిధ మార్గాల్లో నియంత్రించే అధికారాలు కాంగ్రెస్‌కు ఉన్నాయి. ముఖ్యంగా ఫెడరల్ నిధుల కేటాయింపులు, విదుదలపై నియంత్రణ, ప్రభుత్వ శాఖల పనితీరుపై పర్యవేక్షణ, విచారణలు నిర్వహించడం వంటి అధికారాలు కాంగ్రెస్ చేతిలో ఉంటాయి.

ప్రతినిధుల సభలో ఆధిక్యం సాధించిన డెమోక్రాట్లు వివిధ కమిటీల అధ్యక్ష పదవులను చేపట్టడం ద్వారా ప్రభుత్వ నిర్ణయాలను నిశితంగా పరిశీలించ గలుగుతారు. అధ్యక్షుడి కార్యనిర్వాహక ఉత్తర్వులను నేరుగా రద్దు చేయలేకపోయినా, వాటి అమలుకు అవసరమైన నిధులను నియంత్రించడం, బహిరంగ విచారణలు నిర్వహించడం, ప్రభుత్వ అధికారులను ప్రశ్నించడం ద్వారా ఒత్తిడి తీసుకురాగలరు.కీలకమైన నియామకాలు,న్యాయవ్యవస్థకు సంబంధించిన అంశాల్లోనూ సెనెట్ పాత్రకు కీలక ప్రాధాన్యం ఉంటుంది.

ఇరాన్‌తో యుద్ధం, వెనిజులాలో సైనిక చర్యలు వంటి అంశాలపై డెమోక్రాట్లకు ట్రంప్‌తో భిన్నాభిప్రాయాలున్నాయి. అధ్యక్షుడి నిర్ణయాలపై కాంగ్రెస్ కమిటీలు బహిరంగ విచారణలు, దర్యాప్తులు నిర్వహించగలవు. ఎన్నికల్లో విజయం సాధించిన కొత్త కాంగ్రెస్ జనవరిలో బాధ్యతలు చేపట్టేలోగా, ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచే సైనిక చర్యలకు అధ్యక్షుడు పాల్పడవచ్చని డెమోక్రాట్లు అనుమానిస్తున్నారు. ప్రస్తుతానికి రిపబ్లికన్ల ఆధిపత్యం కొనసాగుతున్నందున, ట్రంప్ ప్రతిపాదించే సైనిక వ్యయాలకు తక్షణమే అడ్డుకట్ట పడకపోవచ్చు.

ఇరాన్‌తో ఒప్పందం కోసం పట్టుబడుతున్న ట్రంప్ భవిష్యత్తులో ఎలాంటి సైనిక నిర్ణయాలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. గల్ఫ్ ప్రాంతంలో ఘర్షణ వాతావరణం దీర్ఘకాలం కొనసాగితే హార్మూజ్, బాబ్ ఎల్ మాండేబ్ జలసంధుల ద్వారా జరిగే అంతర్జాతీయ నౌకా రవాణాకు తీవ్ర ఆటంకాలు ఏర్పడవచ్చు. దాని ప్రభావం ప్రపంచ ఇంధన సరఫరాపై పడటమే కాకుండా, చమురు ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. అందువల్ల ట్రంప్ అనూహ్య నిర్ణయాలు తీసుకునే అవకాశాలపై అంతర్జాతీయంగా ఆందోళన వ్యక్తమవుతోంది. ఆయన దూకుడు, మొండివైఖరి అమెరికన్లకు కొత్త కాకపోయినా, తాజా ఎన్నికల ఫలితాలు వాటికి ప్రజాస్వామ్య పరమైన పరిమితులు విధించగలవన్న సంకేతాలిస్తున్నాయి.

ఇరాన్‌తో యుద్ధాన్ని నిలిపివేయాలని, ఇజ్రాయెల్‌తో అమెరికా సంబంధాలు మరో విధంగా ఉండాలని అమెరికన్లు కోరుకుంటున్నారని, అందుకే ఎన్నికల ఫలితాలు తమకు ప్రతికూలంగా వచ్చాయని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్య గమనించదగినది. ఇజ్రాయెల్‌కు అందించే వార్షిక సహాయంలో నాలుగు బిలియన్ డాలర్ల కోత విధిస్తామని ఎన్నికల సమయంలో అధ్యక్షుడు చేసిన ప్రకటన కూడా ప్రాధాన్యత సంతరించుకుంది.

అయితే డెమోక్రాట్లు కాంగ్రెస్‌లో ఆధిక్యం సాధించినంత మాత్రాన అధ్యక్షుడి విధానాలను పూర్తిగా మార్చగలరని భావించడం సరికాదు. ట్రంప్ విధించిన దిగుమతి సుంకాలు యథావిధిగా కొనసాగడానికి అవకాశం ఉంది. ఫెడరల్ రిజర్వ్ బోర్డులో తనకు అనుకూలమైన వ్యక్తులను నియమించుకోవడం, ప్రస్తుత గవర్నర్లను తొలగించడం వంటి ప్రయత్నాలకు సెనెట్‌లో ప్రతిఘటన ఎదురయ్యే అవకాశం ఉంది. ట్రంప్ వ్యవహారశైలిలోని కొన్ని అంశాలు తమకు కూడా ఆమోదయోగ్యం కావని కొందరు రిపబ్లికన్ నేతలు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలు ఈ పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. చైనా, రష్యా, యూరోపియన్ దేశాలతో అమెరికా అనుసరించాల్సిన దౌత్య విధానాల విషయంలో ప్రధాన పార్టీల మధ్య కొన్ని మౌలిక అంశాల్లో ఏకాభిప్రాయం ఉన్నప్పటికీ, వాటి అమలులో భిన్నాభిప్రాయాలున్నాయి. యూరోప్, జపాన్ దేశాలతో సంబంధాలను మరింత సవ్యంగా కొనసాగించాలని డెమోక్రాట్లు భావిస్తున్నారు. ఉక్రెయిన్ యుద్ధం విషయంలో ట్రంప్ అనుసరిస్తున్న వైఖరిపైనా వారికి బోలెడు అభ్యంతరాలున్నాయి.

ఈ నేపథ్యంలో అధ్యక్షుడి నిర్ణయాలను పూర్తిగా తిరగరాయడం సాధ్యం కాకపోయినా, వాటిపై రాజకీయ, రాజ్యాంగ పరమైన నియంత్రణ సాధించేందుకు డెమోక్రాట్లు ప్రయత్నిస్తారు. ఎదురులేని అధికారాలతో ఏకపక్షంగా వ్యవహరించాలనుకునే అధ్యక్షుడికి, డెమోక్రాట్ల ఆధిపత్యం కలిగిన కాంగ్రెస్ నుంచి ప్రతిఘటన తప్పదు. ఇరు పక్షాలు పట్టుదలకు పోకుండా పరస్పర సంప్రదింపులు, ఇచ్చిపుచ్చుకునే ధోరణితో వ్యవహరించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఎన్నికల ఫలితాల అనంతరం విలేకరులతో మాట్లాడిన ట్రంప్ కూడా డెమోక్రాట్లతో కలిసి పనిచేస్తానని ప్రకటించడం గమనార్హం. పాలనలో ప్రతిష్టంభన ఏర్పడకూడదని, అధికార, ప్రతిపక్ష పార్టీలు భేషజాలకు పోకుండా సహకరించుకోవాలని ఆయన

అభిప్రాయపడ్డారు. యుద్ధాలు, దిగుమతి సుంకాలు, వీసాల విషయంలో తన విధానాలు సరైనవేనని సమర్థించుకుంటూనే, వాటి అమలులో కొంత దూకుడు తగ్గించి ఉండాల్సిందని అంగీకరించడం రాజకీయ పరిస్థితుల్లో వచ్చిన మార్పునకు సంకేతం.

అమెరికా ఎన్నికల ఫలితాలు భారత్‌పై కూడా ప్రభావం చూపే అవకాశముంది. అయితే భారత్-అమెరికా సంబంధాల్లో తక్షణమే పెను మార్పులు చోటుచేసుకుంటాయని భావించలేం. 'అమెరికా ఫస్ట్' విధానం, రక్షణాత్మక వాణిజ్య విధానాల విషయంలో రిపబ్లికన్లు, డెమోక్రాట్ల మధ్య మౌలికంగా పెద్దగా తేడా లేదు. అయితే వాటిని అమలు చేసే పద్ధతుల్లో మాత్రం వ్యత్యాసాలున్నా యి.

ఏకపక్షంగా దిగుమతి సుంకాలు విధించే ట్రంప్ దూకుడుకు కాంగ్రెస్‌లో ఎదురయ్యే ప్రతిఘటన కొంతవరకు భారత్‌కు వెసులుబాటు కల్పించవచ్చు. ఐటీ సేవలు, వ్యవసాయ ఉత్పత్తులు, ఔషధాల ఎగుమతుల విషయంలో ఏకపక్ష ఒత్తిళ్లకు బదులుగా దౌత్యపరమైన చర్చలకు అవకాశం పెరగవచ్చు. వాణిజ్య చర్చల్లో భారత్ ఎదుర్కొంటున్న ఇబ్బందులు కొంతవరకు తగ్గే అవకాశం ఉంది. దీనివల్ల భారతీయ ఎగుమతిదారులకు కొంత ఉపశమనం లభించవచ్చు.

అదే సమయంలో భారత్‌లో మానవ హక్కులు, మైనారిటీల హక్కులు, మత స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య ప్రమాణాలకు సంబంధించిన అంశాలపై డెమోక్రాట్లు మరింత విమర్శనాత్మకంగా వ్యవహరించే అవకాశముంది. ఈ అంశాలు అమెరికా కాంగ్రెస్‌లో చర్చకు రావడం, భారత ప్రభుత్వ విధానాలపై ప్రశ్నలు తలెత్తడం దౌత్యపరంగా భారత్‌కు అసౌకర్యం కలిగించవచ్చు. అందువల్ల వాణిజ్య రంగంలో కొంత వెసులుబాటు లభించినా, మానవ హక్కులు, ప్రజాస్వామ్య ప్రమాణాల విషయంలో అమెరికా నుంచి ఒత్తిడి పెరిగే అవకాశాన్ని కొట్టిపారేయలేం. అమెరికా వీసా విధానాలు భారతీయులకు అత్యంత కీలకమైన అంశం. గతంలో అమెరికా జారీ చేసిన హెచ్-1బీ వీసాల్లో అధిక భాగం భారతీయ నిపుణులకే దక్కేవి. అయితే ట్రంప్ ప్రభుత్వం వీసా నిబంధనలను కఠినతరం చేయడం భారతీయ ఐటీ నిపుణులు, కంపెనీలను తీవ్ర ఆందోళనకు గురిచేసింది.

దరఖాస్తు రుసుముల పెంపు, వీసా ఎంపిక విధానంలో మార్పులు, అదనపు తనిఖీలు, వలసదారులపై కఠిన చర్యలు భార తీయ ఉద్యోగులపై ప్రతికూల ప్రభావం చూపాయి. స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ఒత్తిడి కారణంగా భారతీయ ఐటీ కంపెనీలు అమెరికాలో స్థానికులను, అక్కడి విశ్వవిద్యాలయాల పట్టభద్రులను అధిక వేతనాలతో నియమించుకోవాల్సిన పరిస్థితి ఏర్ప డుతోంది. దీనివల్ల కంపెనీల నిర్వహణ వ్యయాలు, వేతనాల భారం, వీసా రుసుములు, న్యాయపరమైన ఖర్చులు పెరుగుతున్నాయి.

అంతేకాకుండా, గ్రీన్‌కార్డు కేటాయింపుల్లో దేశాలవారీగా అమలవుతున్న ఏడు శాతం పరిమితి కారణంగా భారతీయ దరఖాస్తుదారులు దశాబ్దాల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఈ సమస్యపై కూడా అమెరికా విధానాల్లో మార్పులు రావాలని భారతీ యులు ఆశిస్తున్నారు. రిపబ్లికన్లు, డెమోక్రాట్లు ఇద్దరూ 'బై అమెరికన్, హైర్ అమెరికన్' విధానానికి కట్టుబడి ఉన్నప్పటికీ,వలసదారుల సమస్యపై డెమోక్రాట్లు కొంత ఉదారంగా వ్యవహరించే అవకాశముంది. ముఖ్యంగా సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం (STEM) రంగాల్లో ఉన్నత విద్యను అభ్యసించిన నిపుణులకు మరిన్ని అవకాశాలు కల్పించాలన్న వైఖరికి వారు మొగ్గు చూపవచ్చు. అందువల్ల హెచ్-1బీ వీసాలు, గ్రీన్‌కార్డుల విషయంలో కొంత సానుకూల మార్పు వస్తుందని భారతీయ ఐటీ నిపుణులు ఆశిస్తున్నారు.

చైనా విషయంలో భారత్, అమెరికాల మధ్య కొనసాగుతున్న దీర్ఘకాలిక వ్యూహాత్మక అవగాహనలో పెద్దగా మార్పులు వచ్చే అవకాశాలు లేవు. అమెరికాలో ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా ప్రాబల్యాన్ని నియంత్రించడానికి భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం అవసరమని భావించడం సహజం. క్వాడ్ కూటమి, సంయుక్త రక్షణ సహకారం, సాంకేతిక భాగస్వామ్యం వంటి అంశాలు కొనసాగుతాయి.

అయితే చైనాతో సంబంధాల విషయంలో ట్రంప్ అనుసరిస్తున్న విధానాలకు డెమోక్రాట్లు భిన్నమైన ప్రాధాన్యతలు ఇవ్వవచ్చు. చైనాను ఎదుర్కొనే విషయంలో భారత్‌కు అమెరికా నుంచి లభించే మద్దతు స్వరూపంలో మార్పులు రావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. అందువల్ల అమెరికా ఎన్నికల ఫలితాలను మాత్రమే ఆధారంగా చేసుకుని భారత్‌కు వ్యూహాత్మకంగా భారీ ప్రయో జనాలు కలుగుతాయని ఆశించడం సమంజసం కాదు. అమెరికా ఎన్నికల ఫలితాలు భారత రాజకీయాల్లోనూ చర్చనీయాంశంగా మారడం కొత్తేమీ కాదు. ట్రంప్‌కు ఎదురైన ఎన్నికల పరాజయాన్ని భారత ప్రతిపక్షాలు తమ రాజకీయ వాదనలకు అనుకూలంగా వ్యాఖ్యానిస్తున్నాయి. ఏకపక్ష పాలనా ధోరణులు, విద్వేషపూరిత వాక్చాతుర్యం, అధికార కేంద్రీకరణ ఎల్లకాలం ప్రజల ఆమోదం పొందలేవని చెప్పడానికి ట్రంప్‌ను ఉదాహరణగా చూపుతున్నాయి. గతంలో 'హౌడీ మోదీ', 'నమస్తే ట్రంప్', 'అబ్ కీ బార్ ట్రంప్ కీ సర్కార్' వంటి కార్యక్రమాలు, నినాదాల విషయంలో ప్రధాని మోదీ విమర్శలను ఎదుర్కొన్నారు. ట్రంప్‌తో మోదీకి కనిపించిన వ్యక్తిగత సాన్నిహిత్యాన్ని కూడా ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. విదేశీ నేతలతో వ్యక్తిగత సంబంధాల కంటే దేశాల మధ్య ఉండే వ్యవస్థాగత సంబంధాలు, దీర్ఘకాలిక జాతీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వాలన్న వాదనకు ఈ పరిణామాలు మరింత బలాన్ని చేకూరు స్తున్నాయి.

అమెరికా మధ్యంతర ఎన్నికల తీర్పు ఒక విషయాన్ని స్పష్టం చేస్తోంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎంతటి శక్తిమంతమైన అధ్యక్షుడైనా ప్రజాభిప్రాయానికి, రాజ్యాంగబద్ధమైన సంస్థల నియంత్రణకు అతీతుడు కాదు. అధికార కేంద్రీకరణ, ఏకపక్ష నిర్ణయాలు, దూకుడు విధానాలకు ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏదో ఒక దశలో ప్రతిఘటన ఎదురవుతుంది. అయితే ఎన్నికల ఫలితాలతోనే విధానాలు పూర్తిగా మారిపోవు. వాటిని మార్చగలిగే రాజకీయ సంకల్పం, సంస్థాగత నియంత్రణ, ప్రజాస్వామ్య విలువల పట్ల నిబద్ధత అవసరం.

అంతిమంగా అమెరికా ఎన్నికల తీర్పు ట్రంప్‌కు కేవలం రాజకీయ హెచ్చరిక మాత్రమే కాదు. అధికారాన్ని ప్రజాస్వామ్య పరిధుల్లోనే వినియోగించుకోవాలన్న ప్రజల ఆకాంక్షకు కూడా ప్రతిబింబం. ఈ తీర్పు అమెరికా అంతర్గత రాజకీయాలకే పరిమితం కాకుండా అంతర్జాతీయ దౌత్యం, వాణిజ్యం, వలస విధానాలు, భారత్ వంటి దేశాలతో సంబంధాల పైనా ప్రభావం చూపనున్నది.

డి. సోమసుందర్

సూపర్ ఎల్‌నినో: నీటిపారం..అవకాశం

డాక్టర్ జయప్రకాష్ నారాయణ్



ఈ ఏడాది దేశంలో ఖరీఫ్ వర్షపాతం 13% తగ్గిందని అంచనా. తెలుగు రాష్ట్రాలు, కొన్ని చోట్ల ఇది 18-25% ఉండొచ్చు. ఉత్తర కర్ణాటక వంటి వర్షఛాయ, మెట్టప్రాంతాలు ఇంకా ఇబ్బందుల్ని ఎదుర్కోవచ్చు. తెలంగాణలో 10 లక్షల ఎకరాల్లో వరి ఎండిపోయే అవకాశం ఉంది. 1980లలో మేం కలెక్టర్లుగా పనిచేసేటప్పుడు ఒక ఏడాది వర్షం తగ్గితే.. ధాన్యం, పశుగ్రాసం నుండి తాగునీరు వరకూ ఆందోళన చెందేవారం. నార్మన్ బోర్లాగ్, స్వామినాథన్, ఆలపాటి అప్పారావు, ఎంవీ రావు వంటి శాస్త్రవేత్తలు, సి.సుబ్రహ్మణ్యం, శివరామన్ వంటి నేతలు, అధికారులు చేసిన కృషి వల్ల హరిత విప్లవంతో ఆహార ధాన్యాల కొరత తీరింది. అయినా అంతకుముందు అమెరికా ఆహార ఓడల కోసం ఎదురు చూసిన కష్టాల రీత్యా 5% లోటు వర్షపాతానికీ ఆదుర్దా చెందే వారం. కానీ ఈవేళ స్వతంత్రం వచ్చిన ప్పుడు దేశం మొత్తం పండించిన 5.2 కోట్ల టన్నుల ఆహార ధాన్యాల కంటే మూడు కోట్ల టన్నులు ఎక్కువ మన గోదాముల్లో నిల్వలే ఉన్నాయి. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కి కొనటం, గోడౌన్లలో, ఆరుబయట ఆ పంట ఉత్పత్తుల్ని పడేయటం, వాటిలో కొంత కుళ్లిపోవటం, పంది కొక్కులకి ఆహారంగా మారటం, దొంగ చాటుగా అమ్ముకోవటం జరుగుతోంది. ఇదంతా రైతులపై ఆంక్షలు, వారి పంటల ఎగుమతులపై నిషేధం, 1991లో పారిశ్రామిక రంగంలో తెచ్చిన ఆర్థిక సంస్కరణల్ని వ్యవసాయా నికి వర్తింపచేయకపోవటం వల్ల జరిగిన దారుణ దోపిడీ. రైతు సంఘాల్ని సమీకరించి లోక్‌సత్తా గట్టిగా పోరాటం చేయటం వల్ల ఇప్పుడు పరిస్థితి మారింది. పంట ఉత్పత్తుల్ని దేశ వ్యాప్తంగా ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛ లభించి, రైతుల ఆదాయం పెరిగింది.

ఆ తర్వాత 2011, ఏప్రిల్ 27న వరి రైతుల దుస్థితిని ప్రధానమంత్రికి పరిస్థితి వివరించాక బియ్యం విదేశీ ఎగుమతులూ మొదలయ్యాయి. దీనివల్ల తెలంగాణ, ఏపీ రైతులకే ఎక్కువ లాభం చేకూరింది.కానీ ఇప్పటికీ నిత్యావసర వస్తువుల చట్టం పేరుతో నోరున్నవారి ఓట్ల కోసం రాత్రికి రాత్రి ఎగుమతుల్ని నిషేధిస్తున్నారు. పామాయిల్ మరో ఉదాహరణ. ఒక్కో గెలకి రూ.6 రేటు వచ్చినప్పుడు రైతులే చెట్లను తెగనరకటం గోదావరి జిల్లాల్లో కళ్లారా చూశాక లోక్‌సత్తా చేసిన పోరాటం వల్ల 2017లో దిగుమతి సుంకం విధించారు. ఉక్రెయిన్ యుద్ధంతో తిరిగి తొలగించి, మళ్లీ విధించి, తగ్గించారు. ఇలాంటి అసంబద్ధ విధానాల మధ్య కూడా మన దేశంలో రైతులు గతేడాది రికార్డు స్థాయిలో సుమారు 37.7 కోట్ల టన్నుల ఆహార ధాన్యాల్ని పండించారు. ఈ ఏడాది సూపర్ ఎల్‌నినో వల్ల 30 లక్షల టన్నులు తగ్గుతాయంటున్నారు. అంటే 1%. కాబట్టి ఆహారపరంగా భయపడనక్కర్లేదు.

రెండోది, మన దేశంలో సాగునీటి ప్రాజెక్టుల పట్ల శ్రద్ధ వల్ల సుమారు 60% పంట భూములకు నికర నీటి వసతి అందుబాటులోకొచ్చింది. రెండు పంటలైతే 73-75% ఉన్నట్లు. కానీ నీరు అందుబాటు, ఎప్పుడో కరవు కాలంలో ప్రవేశపెట్టిన ఎంఎస్‌పీ పద్ధతిని ఇంకా కొనసాగించటం, ఉచిత విద్యుత్ వల్ల.. డిమాండ్ తగ్గుతున్న వరి పండించే ఆనవాయితీ నుండి ఇంకా మనం బయటపడలేదు. తెలంగాణలో చిన్న నీటి, ఎత్తిపోతల ఆనకట్టల బదులు భారీ, అసంబద్ధ ప్రాజెక్టుల్ని కట్టటం తీవ్ర అభ్యంతరకరమైనా.. రుతుపవనాలున్న దేశంగా నీటి రిజర్వాయర్లు, బ్యారేజీలు అవసరం. ఈ రకంగా ప్రస్తుతం తెలంగాణలో 62% నికర నీటి వసతి పొలాలకు ఉంది. కానీ ప్రజలు అన్నం తగ్గించి, గుడ్లు, మాంసం, చిరుధాన్యాలు, పప్పులు, కూరగాయలు, పండ్లు, పాలు, పెరుగు వంటివి ఎక్కువ ఉపయోగిస్తున్నా.. నీటి వనరులున్నాయి గదా అని వరి ఎక్కువగా పండిస్తున్నాం. నీరు తాగే, డిమాండ్‌లేని వరి సాగు వద్దన్నవారిని తిట్టిపోస్తున్నాం. దీనివల్ల రాష్ట్రం ఏర్పడినప్పుడు 44 లక్షల



టన్నులున్న వరి ఉత్పత్తి.. గతేడాది 1 కోటీ 75 లక్షలకి చేరింది. 400% పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో పన్నెండేళ్ల క్రితం వరి దిగుబడి 72 లక్షల టన్నులుంటే, ఇప్పుడు 81 లక్షల టన్నులకి పెరిగింది. అంటే 10 శాతం దాకా. ఏపీలో నికర నీటి వసతి ఎక్కువనుకుంటాంగానీ.. రాజస్థాన్‌తో సమానంగా 52% మాత్రమే. అయితే డిమాండ్ ఉన్న పండ్లు, కూరగాయలు, ఇతర హార్టీకల్చర్ దిగుబడి తెలంగాణలో తగ్గగా, ఏపీలో భారీగా పెరిగింది. ఏపీలో 1.4 కోట్ల టన్నుల నుండి 2.8 కోట్ల టన్నులకు, యూపీలో గత పదేళ్లలో 3.3 కోట్ల టన్నుల నుండి 5.3కి, మహారాష్ట్రలో 1.8 నుండి 3.3 కోట్ల టన్నులకు ఉద్యాన దిగుబడి పెరిగింది. తెలంగాణలో 83 లక్షల టన్నుల నుండి 30లక్షలకు తగ్గింది. వ్యవసాయంలోని మరో అంశం విద్యుత్తు. భూగర్భ జలాలు ఎండిపోవటం వల్ల.. తెలంగాణలోని 30 లక్షల బోర్లతో ఉచిత విద్యుత్ వినియోగం పెరగటం తప్ప నీరు రావటం లేదు. దీంతోపాటు, ఇళ్లలోనూ ఫ్యాన్లు, ఏసీల వినియోగం పెరగటంతో.. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గత సంవత్సరం అక్టోబర్‌లో 15,000 మెగావాట్లుండగా, ఈ ఏడాది 20,000 మెగావాట్లకి పెరిగింది. ఇందులో 25-27% రైతుల ఉచిత విద్యుత్ ఖాతాలోకి పోతోంది. మీటర్లు బిగించకపోవటం వల్ల రైతుల పేరుతో ఇతరులు దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. విద్యుత్‌కు యూనిట్ రూ.15 ఇస్తానన్నా మార్కెట్‌లో దొరకటంలేదని ముఖ్యమంత్రి వాపోతున్నారు. మనం కూడా పౌరులుగా ఇళ్లలో విద్యుత్‌ను పొదుపుగా ఉపయోగించుకోవటం వంటి మార్గాల్లో సహకరించాలి.

సూపర్ ఎల్‌నినో ప్రభావిత ఇంకో అంశం తాగునీరు. హైదరాబాద్‌నే తీసుకుందాం. లండన్, టోక్యో వంటి మహానగరాల కంటే ఎక్కువ నీటి సరఫరా జరుగుతోంది. హైదరాబాద్‌కి రోజుకి 260 కోట్ల లీటర్లు. అంటే, తలసరి 210 లీటర్లు. మన అవసరం 135 లీటర్లు. అయినా మంచినీటికి కటకట. లండన్‌లో 135 లీటర్లు, బెర్లిన్‌లో 110, టోక్యోలో 170, డాలస్‌లో 204 లీటర్లు మాత్రమే తలసరి సరఫరా చేస్తున్నారు. ఈ నగరాలన్నిటిలోనూ 24 గంటలూ తాగునీరు అందిస్తున్నారు. హైదరాబాద్‌లో 210 లీటర్లు ఇస్తున్నా, రెండురోజులకోసారి కొద్ది గంటలు వస్తే అదృష్టమనుకునే ప్రాంతాలు చాలా ఉన్నాయి. నగరం నడిబొడ్డున ఉన్న ప్రాంతంలో కూడా మంచినీటికి కటకట. ఇందుకు కారణం, 'మనం మంచినీరు తెస్తున్నాం, పంపిణీ వ్యవస్థను నిర్లక్ష్యం చేశాం. సంపన్నులకీ ఉచితంగా మంచినీరు ఇస్తున్నాం'. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో ఉచితంగా తాగునీరు ఎవరిమ్మన్నారు? మన సొంత సొమ్మయితే అలా ఖర్చు చేస్తామా? ఇది కాక 50% మూసీలో కలిసిపోతోంది. మంచినీరు, మురుగునీరు కలసి ప్రవహిస్తున్నాయి. హైదరాబాద్‌కి అదనంగా 50 మిలియన్ గ్యాలన్లు మంచినీరు తెస్తామని ప్రభుత్వం చెబుతోంది. కానీ అంతకంటే ముఖ్యం తాగునీటి పంపిణీ వ్యవస్థను బాగుచేసి 24 గంటలూ మంచినీరు అందించటం. పైప్‌లలో తాగునీరు నిరంతరం ప్రవహిస్తుంటే, మురుగునీరు కలిసే అవకాశాలు తక్కువ.

పొరుగున ఉన్న చెన్నైకి హైదరాబాద్‌లా గోదావరి, కృష్ణా వంటి నదుల ద్వారా తాగునీటి అవకాశం లేదు. కొన్నేళ్ల క్రితం రైళ్లలో తాగునీరు తెప్పించుకున్నారు. కానీ నీటి నిల్వ, పంపిణీని సమర్థంగా బాగుచేసుకోవటంతో.. ఇప్పుడు మండువేసవిలోనూ మంచినీటి కొరత లేదు. హైదరాబాద్ నగరం కోసం కృష్ణ, గోదావరి నదుల నుంచి రోజూ 260 కోట్ల లీటర్ల నీటిని తోడి తెస్తున్నాం. అయినా నీటిపంపిణీ లోపం వల్ల నీళ్ళ కొరత మనల్ని ఇబ్బంది పెడుతోంది. బెంగళూరు జనాభా హైదరాబాద్ కంటే ఎక్కువ. అయినా ఆ నగరంలో 160 కోట్ల లీటర్ల సరఫరాతో మన కంటే బాగా నీటిని పంపిణీ చేస్తున్నారు. చెన్నైలో దాదాపు హైదరాబాద్‌కి సమానమయిన జనాభా ఉంది. ఆ నగరానికి పెద్ద నదులు, నీటి వనరులు లేవు. రోజూ 120 కోట్ల లీటర్ల నీటిని చెన్నైలో సరఫరా చేస్తు న్నారు. అయినా సంక్షోభం, కొరత లేకుండా నీటిని సరిగ్గా పంపిణీ చెయ్యగలుగుతున్నారు. హైదరాబాద్ నీటి సమస్య ప్రధా నంగా పంపిణీ వ్యవస్థ శిధిలమైపోవటం వల్ల ఉత్పన్నమయింది.

ప్రస్తుత వర్షాభావం రీత్యా రైతులు ఆందోళన చెందకుండా రెండో పంటగా అపరాలు, నూనె గింజలకి లేదా క్రాప్ హాలిడేకి నచ్చచెప్పటం, లాభాలొచ్చేలా మార్కెటింగ్ వ్యవస్థలో తగిన ఏర్పాట్లు, భరోసానిచ్చే ప్రత్యామ్నాయాలు చూపుతూ వరి పంట సాగుని తగ్గించటం, హార్టీకల్చర్, తృణధాన్యాలు వంటి ప్రజారోగ్యానికి మేలుచేసే, డిమాం డున్న పంటలకు ప్రోత్సాహకాలు, పెట్టుబడి వ్యయానికి తగిన రుణసదుపాయాలు, ఉచిత విద్యుత్‌కు మీటర్లు బిగించి బాధ్యత కోసం కొద్దిపాటి రుసుము వసూలు చేయటం వ్యవసాయంలో యుద్ధప్రాతిపదికన చేయాల్సిన పనులు. అధిక వర్షపాతాన్ని ఒడిసిపట్టేలా హేతుబద్ధ ప్రాజెక్టుల్ని పెంచాలి. చెరువులు, ఇతర సంప్రదాయ నీటి వసతుల్ని కాపాడుకోవాలి. పప్పు దినుసులు, పామాయిల్, ఇతర వంటనూనెలపై దిగుమతి సుంకం నిలకడగా కొనసాగించి, ఆ డబ్బు రైతులకే అందించి ఏపీ, తెలంగాణల్లో పెరుగు తున్న సాగును ఇంకా ప్రోత్సహించాలి. ఈవేళ ప్రపంచం లోనే అత్యధికంగా మలేషియా, ఇండొనేషియా నుండి 20-30 బిలియన్ డాలర్ల మేర వంటనూనె దిగుమతి చేసుకుంటున్నాం. ఇలా స్వల్పకాలిక, దీర్ఘకాలిక వ్యూహాలని అనుసరించటం అవసరం.

తెలంగాణకు నీటి సరఫరా చేసే కృష్ణాలో ఈ సీజన్‌లో 72% లోటు, గోదావరిలో 42% లోటు ఏర్పడింది. 460 టీఎంసీల అవసరం ఉండగా, కేవలం 209 టీఎంసీలు ఉన్నాయి. తాగునీరు తొలి ప్రాధాన్యత కాబట్టి ఈ ప్రత్యేక పరిస్థితుల్లో రైతులు కూడా సహకరించాలి. యూరియా బస్తా

“వరి పంట సాగుని తగ్గించటం, హార్టీకల్చర్, తృణధాన్యాలు వంటి ప్రజారోగ్యానికి మేలుచేసే, డిమాండున్న పంటలకు ప్రోత్సాహకాలు, పెట్టుబడి వ్యయానికి తగిన రుణసదుపాయాలు, ఉచిత విద్యుత్‌కు మీటర్లు బిగించి బాధ్యత కోసం కొద్దిపాటి రుసుము వసూలు చేయటం వ్యవసాయంలో యుద్ధప్రాతిపదికన చేయాల్సిన పనులు. అధిక వర్షపాతాన్ని ఒడిసిపట్టేలా హేతుబద్ధ ప్రాజెక్టుల్ని పెంచాలి. చెరువులు, ఇతర సంప్రదాయ నీటి వసతుల్ని కాపాడుకోవాలి. పప్పు దినుసులు, పామాయిల్, ఇతర వంటనూనెలపై దిగుమతి సుంకం నిలకడగా కొనసాగించి, ఆ డబ్బు రైతులకే అందించి ఏపీ, తెలంగాణల్లో పెరుగు తున్న సాగును ఇంకా ప్రోత్సహించాలి. ఈవేళ ప్రపం చంలోనే అత్యధికంగా మలేషియా, ఇండొ నేషియా నుండి 20-30 బిలియన్ డాలర్ల మేర వంటనూనె దిగుమతి చేసుకుంటున్నాం. ఇలా స్వల్పకాలిక, దీర్ఘకాలిక వ్యూహాలని అనుసరించటం అవసరం.”


ఖరీదు రూ.4,600 అయినా రైతులకు ప్రభుత్వం కేవలం రూ.266కి ఇస్తోంది. కాబట్టి, ప్రతిదానికీ ప్రభుత్వాన్ని విమర్శించటం తగదు. మన దేశం ప్రపంచ భూభాగంలో కేవలం 2.5% ఉన్నా, ప్రపంచంలోనే అత్యధికంగా 11-12% సాగుభూమి ఉంది. పుష్కల సూర్యరశ్మి. కాబట్టి, హోర్ముజ్ జలసంధి మూతపడినా, ఎల్‌నినో వచ్చినా విద్యుత్, వంటగ్యాస్ వినియోగానికి భారీ ఆర్థికభారం పడకుండా.. ‘పునరుత్పాదక సౌర ఇంధనం, రైతులకు ఆదాయాన్నిచ్చే కంప్రెస్డ్ బయో గ్యాస్ ఇంధన పంటల సాగు’ వంటి మార్గాలకు వేగంగా మళ్లాలి. సూపర్ ఎల్‌నినోపై పార్టీలకతీతంగా స్పందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన విజ్ఞప్తి రాజ్యాంగ ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనం. ప్రభుత్వాలు, పార్టీలతోపాటు పౌర సమాజం కూడా ఇందుకు పూర్తిగా కలసిరావాలి. ఇప్పుడు సమస్యను పరిష్కరించుకోవటంతోపాటు.. తెలుగు రాష్ట్రాల్లో ఇక ముందు సాగు, తాగు, విద్యుత్ రంగాలలో సమస్యలు లేకుండా, రైతులకు, వినియోగదారులకు, పెట్టుబడులకు, యువత ఉపాధికి దోహదం చేసేలా శాశ్వత, పర్యావరణహిత ఏర్పాట్లకి ఈ సంక్షోభాన్ని అవకాశంగా మలచుకుందాం. ✡

రాజ్యాంగాన్ని కాగితాలకే పరిమితం చేయటం రోడ్లపై ఆందోళనలకు మూలం

-డాక్టర్ జయప్రకాష్ నారాయణ్


మన దేశంలో వివిధ రంగాలకు విస్తరిస్తున్న ఆందోళనలు, వాటి తీరు, జెన్ జడ్ భాగస్వామ్యం.. రాజ్యాంగం అమలును లోతుగా సమీక్షించుకోవాల్సిన ఆవశ్యకతను తెలియ చేస్తున్నాయి.

ఈవేళ మన ప్రధాన రాజకీయ పార్టీలు మొత్తం రాజ్యాంగ స్వరూపంలో రెండు అంశాలనే పట్టించుకుంటున్నాయి. ప్రజల ఓటు నుండి అధికారం వస్తుంది. కాబట్టి ఏదోకరకంగా ఆ ఓటు సంపాదించాలి.. అని మాత్రమే ఆలోచిస్తున్నాయి. ఏ పద్ధతుల్ని అవలంబించాలి, ఏం హామీలిస్తున్నాం, ఆ హామీల అమలు సాధ్యమా పార్టీలకి అనవసరం. కులం, మతం, ప్రాంతం, భాష విభజనలు చేయటానికీ వెనుకాడరు. ఏదోరకంగా ఓట్లు, సీట్లు కావాలంతే. రెండోది, చట్టసభలో మెజారిటీ సంపాదించినవాడు రాజవుతాడు. ఈ రెండు విషయాల్నీ మాత్రం ఆ పార్టీలు పక్కాగా అర్థం చేసుకున్నాయి. వీటిలో తూచ తప్పకుండా రాజ్యాంగాన్ని, స్ఫూర్తిని పాటిస్తున్నాయి. ఓడిపోతే మాత్రం ఈ స్ఫూర్తి కూడా కొరవడుతుంది. ఎన్నికల్ని రిగ్గింగ్ చేశారనే ఆరోపణలు చేయటానికి సంకోచించటం లేదు. కొన్ని పార్టీలు ఎన్నికల ప్రక్రియను కూడా ప్రశ్నిస్తున్నాయి. రాజ్యాంగ విరుద్ధమన్నట్లు మాట్లాడుతున్నాయి. ఎన్నికల సంఘం నియామకంలో ఇప్పటివరకూ లేని వివాదాల్ని సృష్టిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో ఎన్నికల విధులు నిర్వహించేది రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం మాత్రమే, ఢిల్లీలో కూర్చున్న ఈసీ, సీఈసీల పాత్ర పరిమితం; మన రాజ్యవ్యవస్థ సామర్థ్యం బలహీనమైనది అని గుర్తించటానికి బదులు.. 'సర్' ప్రక్రియలో సీఈసీ అసంబద్ధ నిబంధనల్ని, అవగాహనా రాహిత్యాన్ని దేశద్రోహంగా అభివర్ణించటం వంటి ధోరణుల్ని ఇందులో భాగంగానే చూడాలి. ఈవీఎంలపై ఎన్ని ఆరోపణలు చేసినా, వాటిని నిరూపించటానికి ఈసీ అవకాశాలనిచ్చింది. చాలా ఓర్పుతో, విచక్షణతో, పారదర్శకంగా వ్యవహరించటం ద్వారాను, ప్రజల అనుమానాలని బహిరంగంగా నివృత్తి చేయటం ద్వారాను, ఇ.వి.ఎంలని ప్రపంచమంతా ఆహ్వానించేలా ఎన్నికల సంఘం చేయగలిగింది. ఈ రకమయిన ఏర్పాటు వల్ల దేశవిదేశాల ప్రముఖులు కూడా ఇ.వి.ఎంలపైన ఆరోపణలని పట్టించుకోకపోవటం లేదు. ఏ అంశానికి సంబంధించిన ఆరోపణలపైన అయినా ఆ రీతిలో పార్టీలకు, ప్రజలకు పారదర్శకంగా నిరూపించాల్సిన బాధ్యత ఈసీకి ఉంది. ఆ పనిచేయకుండా, ఓటర్ల జాబితా ప్రక్షాళన విషయంలో ఈసీ ఉదాసీనంగా వ్యవహరించటం ఈవేళ సమస్యగా మారిందనటంలో సందేహం లేదు. ఈసీ అయినా, సుప్రీంకోర్టు అయినా ప్రజలకు వారి ప్రతినిధులుండే చట్టసభ పార్లమెంటు ద్వారా జవాబుదారీ అవ్వాల్సిందే. పారదర్శకత, జవాబుదారీ అంశాన్ని ఈసీ విస్మరించటం, రాజ్యాంగాన్ని పలుచన చేయటం ద్వారా కూర్చున్న కొమ్మనే నరుక్కుంటున్నామని పార్టీలు, ప్రజాసంఘాలు గుర్తించకపోవటం వల్ల సమస్య జటిలమైంది.



ప్రజల పేరున రాసిన రాజ్యాంగాన్ని, చట్టాల్ని ఉపయోగించి.. ప్రజల సాధికారత, అధికార వికేంద్రీకరణ, చట్టబద్ధపాలన, పౌర సేవలు, జనం పన్నుల డబ్బుకు తగిన విలువను సమకూర్చటం, వారి జీవితాల్ని మెరుగుపరచటంలో మనం ఘోరంగా విఫలమయ్యాం. ఆ అంశాల్ని వదిలేసి.. అధికారమే పరమావధిగా రాజ్యాంగాన్ని బలహీనపరుస్తున్నారు. రాజకీయ వ్యవస్థ రాజ్యాంగ స్ఫూర్తి, విలువల పట్ల మొద్దుబారిపోయినట్లు వ్యవహరిస్తోంది. అధికార క్రీడలో రాజ్యాంగాన్ని పణంగా పెట్టటంలో పార్టీల మధ్య పెద్ద తేడా లేదు.

నిశితంగా పరిశీలిస్తే, దేశ సుస్థిర మనుగడ, అభివృద్ధిలో మన రాజ్యాంగం అసాధారణ పాత్ర పోషించింది. రకరకాల విభజనలు, వైవిధ్యాలు, ప్రపంచంలోనే ఎక్కడాలేనంత సంక్లిష్ట భిన్నత్వం ఉన్న ఒక ప్రాచీన సమాజంలో అందరినీ కలపటం, భారతదేశ ఐక్యతను సాధించటం, మనమందరం ఒకే ఛత్రం కింద ఉన్నాం అనే భావనను కలిగించటం.. ఆషామాషీ కాదు. అదేవిధంగా నిచ్చెనమెట్ల, వివక్షాపూరిత కుల వ్యవస్థ ఉన్న దేశంలో మనందరికీ ఒకే పౌరసత్వం, సమాన హక్కులు, కలలు



నెరవేర్చుకోవటానికి సమానావకాశాల భరోసాను రాజ్యాంగం అందించింది. సంస్థానాల విలీనం కావచ్చు, రాష్ట్రాల పునర్విభజన కావచ్చు.. కీలక ప్రక్రియల్లో రాజ్యాంగం మనకు మార్గం నిర్దేశించింది. కానీ ఏ లోతైన లక్ష్యం కోసం, ఏ స్ఫూర్తి అమలు కోసం రాజ్యాంగం మొదలైందో అవి రాజకీయ రంగంలో విస్మరణకు గురయ్యాయి.

మన దేశంలో ప్రజాస్వామ్య ఏర్పాటు అలవోకగా జరగటం వల్ల.. ఆ విలువ మనకు అర్థం కావటం లేదు. మన జాతి నిర్మాతలు, రాజ్యాంగ నిర్మాతలు కేవలం 1946లో కూర్చుని 1949లో రాజ్యాంగ రచన పూర్తి చేయలేదు. అంతకుముందు వారు జాతి నిర్మాణం చేశారు. కులం, మతం, ప్రాంతం, భాష, వివిధ రకాల సాంస్కృతిక భావోద్వేగాలతో చీలికలు పేలికలుగా ఉన్న సమాజంలో 'ఒకే దేశం' భావనను తేవటానికి 1860ల నుండి కృషి చేశారు. ముందుగా మధ్యతరగతివారిని చైతన్యపరిచారు. ఆ తర్వాత తిలక్, మహాత్మాగాంధీ ప్రజల్లో జాతీయ భావాన్ని రగిల్చే ఉద్యమాలు నిర్మించారు. రాజ్యాంగ స్ఫూర్తి, నైతికత, సంస్కృతి ప్రజలకు పూర్తిగా అర్థం కాకపోవచ్చు. కానీ మనల్ని మనం పరిపాలించుకునే హక్కు, పుట్టుక నేపథ్యంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛగా జీవించే హక్కు, సమాజంలో ప్రతి ఒక్కరి పట్ల విధిగా గౌరవం, విలువ వంటి భావనలు మనలో ఇంకిపోయాయి. కనీసం గణనీయ సంఖ్యలోని ప్రజల్లో. ఇది మన జాతీయోద్యమ నాయకుల కృషి, విశ్వసనీయతలకు గొప్ప నివాళి! తమ కష్టం, త్యాగం, మేధస్సుతో ప్రజలను ఏకం చేసే సామర్థ్యంతో ప్రజల్లో వారు ఈ నమ్మికను సాధించారు. ఇంత నేపథ్యం ఉంది కాబట్టే.. రాజ్యాంగ నిర్మాణం మనలాంటి సమాజంలో సాధ్యమైంది.

రాజ్యాంగ సభలో ఎన్ని వాదోపవాదాలు జరిగాయి! ఎంత లోతైన తర్జన భర్జనలు చోటు చేసుకున్నాయి!! కానీ అవన్నీ స్నేహపూర్వక చర్చలు. సామరస్య వాతావరణంలో జరిగాయి. ఒకరిపై ఒకరు చేతులు విసురుకోలేదు. ద్వేషం లేదు. అపనమ్మకం లేదు. విభిన్న దృక్పథాల మధ్య సయోధ్యని, ఏకాభిప్రాయాన్ని సాధించారు. అదే, ఈ వేళ పరిస్థితిని చూడండి. రాజ్యాంగ నిర్మాణ స్థాయి అంశాలను అలావుంచితే.. రాజ్యాంగ పద్ధతుల అమలుపై మాటల్లోనే ఎంత గందరగోళం నెలకొంది!

స్వతంత్రం వచ్చిన మొదటి పదిహేనేళ్లపాటు దేశాన్ని ఆర్థికంగా దెబ్బతీశాంగానీ.. రాజ్యాంగ వ్యవస్థల నిర్మాణంలో అద్భుతమనదగ్గ కృషి చేశాం. కాలక్రమంలో వచ్చిన రాజకీయ, ఆర్థిక అనివార్యతలకు, ఆర్థిక సంస్కరణలకు రాజ్యాంగం అవకాశం ఇచ్చింది. మన దేశంలో రాజకీయ గుత్తాధిపత్యం పోయి పలు ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి రావటానికి, ఫెడరలిజం బలపడటానికి రాజ్యాంగ సరళత ఎంతగానో దోహదం చేసింది. కాబట్టి మన రాజ్యాంగం 1950ల వద్దే ఆగిపోలేదు. స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, నిధుల బదిలీకి, సాధికారతతో వ్యవహరించటానికి ఏర్పాట్లను రాజ్యాంగంలో ఏర్పరచకపోవటమనే లోపాన్ని ఇప్పటికీ సరిదిద్దలేకపోవటం, ఫెడరలిజాన్ని మూడో అంచెకు విస్తరించకపోవటం వంటి వైఫల్యాలూ ఉన్నాయి. మౌలిక స్వరూపాన్ని మినహాయించి రాజ్యాంగంలో మీరు దిద్దుబాట్లు చేసుకోవచ్చని కోర్టు చెప్పినా, మనం పెడచెవిన పెట్టాం. 'రాజ్యాంగం పనిచేయటం లేదు, కొత్త రాజ్యాంగం అవసరం' అని చీటికీ మాటికీ అసంబద్ధంగా వాదిస్తూ చర్చను పక్కదోవ పట్టిస్తున్నాం.

అభివృద్ధికి ఆర్థిక క్రమశిక్షణ కావాలి. తమ పన్నుల డబ్బు ఎటుపోతోంది, ఆ డబ్బుతో ఏం జరుగుతోంది, భవిష్యత్తును నిర్మిస్తున్నారా, మొత్తం డబ్బును ఈవేళ్టి తాత్కాలిక అవసరాలకు ఖర్చు చేస్తున్నారా.. అని ప్రజలు తెలుసు కోవటానికి వీలుగా అధికార వికేంద్రీకరణ, పౌర సేవల్ని నాణ్యంగా, సమర్థంగా అందించటం, ముఖ్యంగా మంచి విద్య, ఆరోగ్యం, నాణ్యమైన మౌలిక వసతులు, సొంత కోసం కాకుండా ప్రజల కోసం పనిచేసే అధికార యంత్రాంగం, నిజాయతీ, ప్రజాసేవా తత్పరత, విధాన పరమైన, సాంకేతికతల్ని వినియోగించగల అవగాహన ఉన్న రాజకీయ వ్యవస్థ కావాలి. చెప్పండి, వీటిల్లో ఏ ఒక్కటైనా చేయకుండా రాజ్యాంగంలోని ఏ నిబంధన మిమ్మల్ని అడ్డుకుంది?

పుట్టుక నేపథ్యంతో సంబంధం లేకుండా ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య అందించవద్దని రాజ్యాంగం చెప్పిందా?.. మీరు అందివ్వలేదు! రాజ్యాంగాన్ని తిరగరాయటం విద్యలో,

ఆరోగ్యంలో నాణ్యతను ఏ రకంగా పెంచుతుంది? ఈ రెంటినీ మెరుగుపరచకుండా మీరు కులవివక్షను ఎలా పోగొడతారు? ప్రజాస్వామ్యం చెప్పే సమానత్వం సమా జంలో ఎలా సాధిస్తారు? ఈ వైఫల్యాల్ని సరి చేసుకోవాల్సి సమయంలో ఆ అంశం వదిలేసి వ్యక్తుల చుట్టూ రాజకీయం తిప్పుతున్నాం. నిరసనల పేరుతో ఇతరుల రాజ్యాంగ హక్కు లకు భంగం కలిగిస్తున్నాం. ఆట గాళ్లను మారిస్తే చాలు.. ఆట నియమాలు మార్చనక్కర్లేదు అని ఎమర్జెన్సీ కాలంలో, జనతా హయాంలో చేసిన తప్పునే చేస్తున్నాం.

2026, నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నేను పార్టీలకు, ప్రజాసంఘాలకు విజ్ఞప్తి చేసేది ఒకటే– ప్రతి పౌరునికీ సమానావకాశాలనిచ్చే స్వేచ్ఛ, స్వపరిపాలన, స్థానిక సాధికారత, హక్కుగా పౌర సేవలు, స్వయం దిద్దుబాటు కోసం పోరాడండి. పార్టీలు కొందరు వ్యక్తుల సొంత ఆస్తిగా కాకుండా, అభ్యర్థులను సభ్యులు నిర్ణయిం చటం, ఎన్నికల్లో నిజాయతీ డబ్బును ఖర్చు చేసి, హేతుబద్ధ విధానాలను ప్రతిపాదించేవారు చట్టసభలకు ఎన్నికయ్యే విధంగా దామాషా ఎన్నికల పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక సంస్కరణలు, ప్రజాస్వామ్యం–ఓటు విలువ అర్థమై యువ నాయకత్వం ఎదిగేందుకు పట్టణ ప్రాంతాలతో ప్రారంభించి స్థానిక ప్రభుత్వాలలో నిధులు, అధికారాలతో పాటు ప్రజల భాగస్వామ్యమున్న కమిటీల ఏర్పాటు, సమస్యాత్మక వలసలులేకుండా గ్రామాల మధ్య ఆర్థిక కేంద్రాలుగా చిన్న పట్టణాల అభివృద్ధి, చట్టబద్ధపాలన, పారదర్శకత, జవాబుదారీతనం కోసం కృషి చేయండి. తాత్కాలిక ఉపశమన సంక్షేమానికి – అభివృద్ధికి మధ్య సమతూకం పాటించండి. ఆర్థిక వృద్ధిని సమ్మిళితం చేసి స్వేచ్ఛా మార్కెట్ సంపద సృష్టిలో అందరినీ భాగస్వాములను చేయండి. ఇవన్నీ రాజ్యాంగం చట్రం పరిధిలోనే ఉన్నాయి. వేటికీ రాజ్యాంగం అవరోధం కాదు. మనకు రాజకీయ సంకల్పం ఉండాలేగానీ.. తేలిగ్గా అమలు సాధ్యం.

అంతేగానీ, అధికారం కాపాడుకోవటానికి లేదా అధికారం లోకి రావటానికి.. రాజ్యాంగ సంస్థల్ని బలహీనపరచటం, ఆధారాలులేకుండా వాటిపై ఆరోపణలు చేయటం, పోలీసు యంత్రాంగాన్ని రాజకీయ ప్రత్యర్థులని వేధించటానికి ప్రయోగించటం, చట్టసభల్లో చర్చలు చేయకుండా రోడ్లపై ఆందోళనలు, సుప్రీంకోర్టుకి వెళ్లటానికే ప్రదర్శనలు వంటి వలసకాల పద్ధతుల్ని అవలంబించటం, ఎన్నికైన ప్రభు త్వానికి తాము ప్రత్యామ్నాయమన్నట్లు పార్టీలు, సంస్థలు వ్యవహరించటం వంటి ధోరణులకు ఇకనైనా స్వస్తి పలకాలి. దేశానికి అవసరమైన మౌలికాంశాలపై ఏకాభిప్రాయం సాధించటం, మిగిలిన విధానాల్లో ప్రత్యామ్నాయాలు చూపుతూ రాజకీయ పోరాటాలు రాజ్యాంగబద్ధంగా, అంబేద్కర్ ఆనాడు నిర్దేశించిన స్వతంత్ర ప్రజాస్వామ్య దేశం పంథాలో చేయటం అవసరం. మీడియా కూడా ప్రజా ప్రయోజనాలను దెబ్బతీసే ప్రకటనలు, చర్యలు, నిరాధార ఆరోపణలు, రాజ్యాంగేతర ఆందోళనలకు ప్రాధాన్యత నివ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.

"ఒక ఉదాత్తమయిన రాజ్యాంగాన్ని మన దేశ నిర్మాతలు మనకందించారు. ఈ రాజ్యాంగ మౌలిక స్వరూపం దేశ ప్రయోజనాలని, స్వేచ్ఛని, ఐక్యతని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కీలకం. అవసరాన్ని బట్టి రాజ్యాంగంలో సవ రణలు చేసే వెసులుబాటు ఉంది. ఇప్పటికే 106 సార్లు రాజ్యాంగ సవరణ చేసుకున్నాం. ఇంకా అవసరమయితే, ఏకాభిప్రాయం ఉంటే, రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలగ కుండా మార్పులు చేసుకోవచ్చు. కాని నిజమయిన సమస్య రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా రాజకీయాన్ని, పరిపాల నని నిర్వహించటంలో మనదైన వైఫల్యం. రాజ్యాంగ ఫలాలు సామాన్యులకి దక్కాలంటే వ్యవస్థలో ఉన్న లోపాలని సవరిం చాలి. అంతేగాని, ఇంట్లో ఎలుకలున్నాయని ఇంటిని తగల బెట్టుకోవటం అవివేకం. నిర్దిష్టమయిన సంస్కరణల ద్వారా ప్రజాస్వామ్యాన్ని సార్థకం చేద్దాం. రాజ్యాంగ నిర్మాతల ఆశ యాలని సాధిద్దాం".

✡

స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు లోక్‌సత్తా మద్దతు

ఆంధ్రప్రదేశ్ స్థానిక ప్రభుత్వాల తాజా ఎన్నికల్లో తెలుగుదేశం-జనసేన-బీజేపీ ఎన్డీయే కూటమి అభ్యర్థులకు లోక్‌సత్తా మద్దతు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర లోక్‌సత్తా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విజయనగరంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏపీలో ఆర్థిక క్రమశిక్షణ వంటి అంశాల్లో కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నా, సమ్మిళిత, వేగవంత, సుస్థిరాభివృద్ధి కోసం మద్దతును కొనసాగించాలని నిర్ణయించామన్నారు. సంక్షేమం-అభివృద్ధి మధ్య సమతూకం, అన్ని వర్గాల ప్రజల మధ్యా సామరస్యత కోసం 2024 అసెంబ్లీ ఎన్నికల్లో లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ కూటమికి మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందేనన్నారు. లోక్‌సత్తా ఎప్పటి నుండో కోరుతున్నట్లు, మునిసిపల్, కార్పొరేషన్ చైర్మన్, మేయర్ పదవులకి ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించటం అభినందనీయమన్నారు. మునిసిపల్, పంచాయతీ స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాల్ని కూడా బదిలీ చేయాలన్నారు. ఇందుకోసం లోక్‌సత్తా 1 కోటీ 8 లక్షల సంతకాల ఉద్యమం చేసినప్పుడు ముఖ్యమంత్రిగా చంద్రబాబే ఉన్నారని గుర్తుచేశారు. రాష్ట్ర సూక్ష్మ, చిన్న పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, నిత్యం ప్రజల అభివృద్ధిని కాంక్షించే జేపీ లాంటి గొప్ప వ్యక్తి కూటమి ప్రభుత్వానికి, అభ్యర్థులకు మద్దతు ప్రకటించటం చాలా ఆనందంగా ఉందన్నారు. సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం మేయర్ అభ్యర్థి అవనాపు భార్గవి, విజయ్, అల్లంశెట్టి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వోద్యోగుల భారీ జీతభత్యాలు, ప్రమాదకర ఓపీఎస్ డిమాండ్లు..

తెలంగాణ, ఏపీ ప్రజలు తెలుసుకోవాల్సిన నిజాలు

పెండింగ్ బకాయిల్ని చెల్లించాలని, వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఇటీవల ఉపాధ్యాయులు, ఇతర ప్రభుత్వోద్యోగులు, పెన్షనర్లు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా, తెలంగాణలో పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

-డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

సమాజంలో మిగిలిన శ్రామికుల్లాగే ప్రభుత్వోద్యోగులకు కూడా హక్కులున్నాయి. కాబట్టి శాంతియుతంగా, పరిపాలనకు ఆటంకం లేకుండా, ప్రజలకు ఇబ్బంది లేకుండా వారు తమ డిమాండ్ల కోసం ఆందోళనలు చేపట్టవచ్చు. వారి హక్కు అది. ప్రభుత్వాలు కూడా ఉద్యోగులను మచ్చిక చేసుకునేందుకే ప్రయత్నిస్తుంటాయి.



ఉద్యోగుల సహకారం లేకుండా పరిపాలన జరగదు కాబట్టి. మంచి పాలన, సేవలు, ఆర్థిక ప్రగతి ఉద్యోగ యంత్రాంగం లేకుండా సాధ్యం కావు. అందుచేత ఏ ప్రభుత్వమూ ఉద్యోగులనే పనిముట్లతో ఘర్షణ పెట్టుకోదు. మన దేశంలో ప్రభుత్వోద్యోగుల్ని చాలా ఉదారంగా చూస్తుంటారు. ఉద్యోగులు తమ డిమాండ్లు తెలియచేయటం వంటివి రాష్ట్రాల్లో, జాతీయ స్థాయిలో సాధారణం. ప్రభుత్వాలు ఆర్థిక పరిస్థితిని అంచనావేసుకుని ఒక పరిష్కారానికి తీసుకొస్తుంటారు. కానీ ప్రస్తుత నేపథ్యం అసాధారణమైనది. నేను వాస్తవాల ఆధారంగా చెబుతున్నాను. పరిష్కారాలతో వినమ్రంగా అర్థిస్తున్నాను. తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు, ప్రభుత్వోద్యోగులు, సామాన్య ప్రజలు వీటిని నిశితంగా పరిశీలించి విజ్ఞతతో నిర్ణయాలు తీసుకోవలసిందిగా కోరుతున్నాను.

పరిపాలన ఉన్నది ప్రజల కోసం. ప్రభుత్వం ఉన్నది సర్కార్‌లో ఉన్న అధికారులు, ఉద్యోగులు, నేతల కోసం కాదు. పన్నులు కట్టే సామాన్య ప్రజల కోసం. నిరుపేదలు సైతం, రెక్కాడితేగానీ డొక్కాడనివారు సైతం.. తినే, ఉపయోగించే ప్రతి వస్తువు మీదా కట్టే పన్నులు ఖజానాకి వెళ్తున్నాయి. ఈ డబ్బుతోపాటు.. ఆ ప్రజల పిల్లల భవిష్యత్తును తాకట్టుపెట్టి ఈవేళ్టి అవసరాల కోసం ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయి. రేపొద్దున వారి పిల్లలే ఆ అప్పుల్ని పన్నుల రూపంలో చెల్లించాల్సుంటుంది. కాబట్టి, ప్రభుత్వాలు ఉన్నది ప్రజల కోసం అన్నది ఎప్పుడూ విస్మరించకూడదు.

రెండోది, ప్రభుత్వోద్యోగులు జీతభత్యాలు కోరటంలో తప్పులేదు. మరి అంతే గట్టిగా ఈ ప్రజలకు సేవలూ అందించాలిగా? ఈ దేశంలో ఏ రంగంలో చూసినా కొరతలే. హైదరాబాద్‌నే తీసుకుంటే, మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదల, వర్షం వస్తే వరదనీరు ముంచెత్తకుండా ఏర్పాట్లు, ట్రాఫిక్, చట్టబద్ధపాలన దగ్గర్నుంచి స్కూళ్లలో మన పిల్లలకు అందించే విద్య వరకు ఖర్చు కనిపిస్తోందిగానీ, ఫలితాలనివ్వటం లేదు. ఆ ఫలితాలను ఇవ్వాల్సింది ప్రభుత్వం, ప్రభుత్వోద్యోగులే కదా. మరి ప్రజల డబ్బును జీతభత్యాలుగా అడిగే హక్కు ఎంత ఉందో.. ప్రజలకు సేవలు అందించే బాధ్యతా ప్రభుత్వోద్యోగులకు అంతే ఉండాలిగా? అందుకోసమేగా ఉద్యోగంలో చేరింది. ఈ మౌలికాంశాన్ని అందరూ విస్మరిస్తున్నారు. ఇదేదో ముఖ్యమంత్రిగారు, ఉద్యోగుల మధ్య సమస్య అనుకుంటున్నారు గానీ, సమాజం సమస్య

అని గుర్తించటం లేదు. అందుకే పాఠశాల విద్య ఇంత దిగజారినా, ఎన్నదగిన ఏ దేశంలోనూ లేనిరీతిలో విద్యా ప్రమాణాలు అధ్వాన్నంగా ఉన్నా సరైన చర్చ చేయటం లేదు. సామాన్య ప్రజలు, పన్నులు కట్టే మిగిలినవారు ఏం పాపం చేశారు? వాళ్ల పిల్లలకి ఎందుకు చదువు అందటం లేదు? ప్రభుత్వంలో ఉన్నవారు, సంపన్నులు తమ పిల్లలకు ఇంట్లో ట్యూషన్లు పెట్టిస్తున్నారు. కొందరు తల్లిదండ్రులు చదువుకున్నారు కాబట్టి స్వయంగా బోధిస్తున్నారు. కానీ కొద్దిమంది తంటాలు పడితే సరిపోతుందా? సామాన్య ప్రజల పిల్లలకు విద్య అక్కర్లేదా? మరి ఆ బాధ్యతను ప్రభుత్వం ఎందుకు నెరవేర్చటం లేదు? ప్రజలు గొంతెత్తటంలేదు కాబట్టా? ఎన్నికల్లో డబ్బులిస్తేనో, తాయిలాలిస్తేనో సరిపోతుంది కాబట్టా? కులం, మతం రెచ్చగొడితే సరిపోతుంది కాబట్టా? కాబట్టి ప్రభుత్వోద్యోగులుగానీ, మీడియాగానీ ప్రజల్ని కాలరాసి, ప్రజల హక్కుల్ని కాపాడే బాధ్యతను పట్టించుకోకుండా, మా హక్కుల్ని మాత్రం కాపాడాలి అంటే– ప్రజాస్వామ్యం ఎంతోకాలం నిలవదు.

ప్రభుత్వోద్యోగుల్ని సవినయంగా కోరుతున్నాను. నేను ప్రభుత్వంలో పనిచేశాను. చాలామంది అనుకుంటారు– జేపీ గారికి ప్రభుత్వోద్యోగులంటే కోపం అని. నిజాన్ని నిజాయతీగా, నిష్పాక్షికంగా చెప్పటం అంటే అది ఒకరికి వ్యతిరేకం కాదు. ఈ దేశం పట్ల ప్రేమ. వచ్చేతరం భవిష్యత్తు పట్ల బోలెడంత ఆసక్తి, ఆందోళన. ఇప్పటికే మనం చూస్తున్నాం. మీడియాలోనే కథనాలు వస్తున్నాయి. రిటైరైన ప్రభుత్వోద్యోగులకు పదవీ విరమణ బెనిఫిట్స్ ప్రభుత్వం ఇవ్వలేకపోతోంది. వేలాది కోట్లు బకాయిలు ఉండిపోతున్నాయి. ప్రస్తుతమున్న జీతభత్యాలు, పెన్షన్లనే ప్రభుత్వాలు నిర్వహించలేకపోతున్నాయి. అలవిమాలిన కోర్కెలు మనం కోరితే ఇక పరిస్థితి ఏమిటి? రేపొద్దున ఏం జరిగినా, దేశం అల్లకల్లోలమైనా మా జీతభత్యాలకి, పెన్షన్లకి ఏం ఢోకా ఉండదని ప్రభుత్వోద్యోగులు అనుకుంటుండవచ్చు. అలాంటిదేమీ ఉండదు. ఇప్పటికే చెల్లించలేకపోతున్నారు. పరిస్థితి మరీ చేయిదాటిపోతే, ఆర్థిక వ్యవస్థ నడుము విరిగిపోతే, కూలబడిపోతే ఎవరికీ, ఏ జీతాలూ రావు. మీకు తెలుసోలేదో రాజ్యాంగంలోనే ఆ ఏర్పాటు ఉంది. ఆర్థిక అత్యవసర పరిస్థితిని (ఫైనాన్షియల్ ఎమర్జెన్సీ) ప్రకటించే దాకా వస్తే, ఎవరూ ఏమీ చేయలేరు. అలాంటి నిర్ణయం తీసుకోవాలా, వద్దా అని ఇప్పటికే పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నారు. ఆస్తుల కంటే అప్పులు పెరిగిపోతున్నాయి. అప్పులు తెచ్చిన డబ్బు ఆస్తుల్ని పెంచటం కోసం కాకుండా, రోజువారీ ఖర్చయిపోతోంది. తాత్కాలిక తాయిలాల కోసమో, లంచాలు, కమీషన్ల కోసమో. చివరికి ఏమవుతుంది?.. కాలక్రమేణా అప్పులు పెరిగి, ఉత్పాదకత తగ్గి, పిల్లలు



నష్టపోతారు. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది. ఉద్యోగుల జీతభత్యాల్ని తగ్గించే రాజ్యాంగబద్ధ బాధ్యతను పాటించటం, ఆ అధికారాన్ని, అవకాశాన్ని వినియోగించటం తప్ప మరో మార్గం ఉండదు. ఆ పరిస్థితి తీసుకురాబోకండి.

తెలంగాణ, ఏపీ ప్రభుత్వోద్యోగులకు దేశంలోనే అత్యధిక జీతభత్యాలు

మరో అంశం– దేశం మొత్తంలో ప్రభుత్వోద్యోగులకి అత్యధిక జీతభత్యాలున్నది తెలంగాణ రాష్ట్రంలో. మామూలుగా యూనియన్ ప్రభుత్వోద్యోగులకి ఎక్కువ జీతాలుంటాయి. జాతీయస్థాయిలో విధులు పరిమితం, తక్కువ సంఖ్యలో ఉద్యోగులుంటారు కాబట్టి. పనులు జరిగేది రాష్ట్రాల్లో కాబట్టి, నూటికి 90 మంది రాష్ట్ర ప్రభుత్వ కొలువుల్లో ఉంటారు. ప్రతి ఊళ్లో, మండలంలో రాష్ట్ర పాలనా యంత్రాంగం ఉంటుంది. కానీ తెలంగాణలో యూనియన్ ప్రభుత్వంలో కంటే ఉద్యోగుల జీతభత్యాలు 25–30% ఎక్కువ ఉన్నాయి. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఈ రకంగా లేవు. తెలంగాణ, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే. తెలంగాణ నమూనాను ఏపీ అనుకరించింది కాబట్టి. 2014లో రాష్ట్ర విభజన జరిగినప్పుడు పచ్చగా ఉన్న రాష్ట్రం తెలంగాణ. దేశంలోనే అత్యంత మిగులు ఉన్న రాష్ట్రం. పద్నాలుగవ ఆర్థిక సంఘం వివరాలతో సహా ప్రకటించింది. ఇవాళ తెలంగాణలో హైదరాబాద్‌లాంటి తరగని గని ఉన్నా కూడా, ఇంత సంపద సృష్టి, ఇంతమంది ఇంత కష్టపడుతున్నా కూడా, ఇంత పన్నులు కడుతున్నా కూడా.. నెలనెలా ఖర్చుల కోసం వెతుక్కోవాల్సి వస్తోంది. ముఖ్యమంత్రే చెబుతున్నారు– ప్రభుత్వోద్యోగులు, సిబ్బంది జీతభత్యాలు, పెన్షన్లు, తాత్కాలిక సంక్షేమ పథకాల కోసమే డబ్బంతా ఖర్చయిపోతోంది. ఏం చేయాలో అర్థం కావటం లేదు అని. కాబట్టి మనం ఉద్యోగుల అవసరాల్ని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా తీర్చాలి. కానీ గొంతెమ్మ కోర్కెలు కోరితే, రేపొద్దున భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని గుర్తించాలి. అందునా, ఈ దేశంలో మిగతా రాష్ట్రాలు, జాతీయ స్థాయితో పోలిస్తే 30–40% జీతాలు

తెలంగాణ ప్రభుత్వోద్యోగులకు ఉన్నప్పుడు, అలాంటి డిమాండ్లు రాష్ట్ర భవిష్యత్తుకి చాలా ప్రమాదమవుతుంది. ఈ బిడ్డల భవిష్యత్తు సమస్యగా మారుతుంది. రేపొద్దున డబ్బులు కట్టాల్సింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కాదు, ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ కాదు, వారి పిల్లలు కాదు. ఈ రాష్ట్రంలో వచ్చేతరం యువత. అది మర్చిపోవద్దు.

తెలంగాణలో ఓపీఎస్ పునరుద్ధరణ డిమాండ్

పాత పెన్షన్ విధానం ఎంత ప్రమాదకరమో అవగాహన పెంచేందుకు గతంలోనే లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ మంచి ప్రయత్నం చేసింది. ఓపీఎస్ గురించి కొన్ని విషయాలు స్పష్టంగా అర్థంకావాలి. ప్రపంచంలో ఎన్నదగిన అన్ని దేశాల్లో.. అమెరికా లేదా బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ– ఎక్కడైనా 'ప్రభుత్వం ఎక్కువ, ప్రయివేటు తక్కువ అనుకోవటం ఉండదు'. ఉద్యోగం చేసేటప్పుడే అందరూ జీతం నుండి కొంత డబ్బు వెనకేస్తారు. ప్రభుత్వం లేదా ప్రైవేటు యాజమాన్యం అంత డబ్బు జమ చేస్తుంది. ఉదాహరణకు, అమెరికాలో.. ఉద్యోగి నెలనెలా జీతం నుండి 6.2% వెనకేస్తాడు. అంతే డబ్బును యాజమాన్యం లేదా ప్రభుత్వం ఆ ఖాతాలో వేస్తుంది. ప్రయివేటులో అయితే ఆ సంస్థ యజమాని తమ వాటాగా అందులో జమ చేస్తారు. అంటే మీరు అమెరికాలో ఉద్యోగం చేస్తుంటే, 12.4% ప్రతి నెలా మీ పెన్షన్ ఖాతాలో జమ అవుతుంటుంది. ఈ డబ్బు మొత్తాన్నీ వేరే ఖాతాలో పెడతారు. ఇలా ఉద్యోగి సర్వీసులో ఉన్నంత కాలం ఏ నెలకు ఆ నెల, ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం జమ చేస్తుంటారు. అంటే, ఈవేళ పన్ను కట్టేవారు ఆ డబ్బుని తమ రిటైర్మెంట్ అవసరాల కోసం ఈవేళే జమ చేసేశారు. ఆ డబ్బు నుండే వారికి పెన్షన్ చెల్లిస్తారు. దీనివల్ల, మీ చెల్లింపు భారంతో వచ్చేతరం మీద ఒత్తిడి ఉండదు. పెన్షన్ కోసం ఇప్పుడే మీరు డబ్బును కేటాయించారు కాబట్టి.. మీరు కూడా రిటైరయ్యాక కూడా నిజమైన ఆత్మగౌరవం, సాధికారతతో జీవితాన్ని ఆస్వాదించగలుగుతారు.

పెన్షన్ లక్ష్యం పౌరుల కనీస అవసరాలు తీర్చటం

కొన్ని సందర్భాల్లో పనిచేసేవారు తక్కువ, పెన్షన్ పొందేవారు ఎక్కువ ఉంటారు. అప్పుడు కొద్దిగా ఇబ్బందులుంటాయి. వాటికి కొన్ని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి. కానీ మొత్తం మీద మీరు ఖజానా నుండి డబ్బులు ఉద్యోగుల పెన్షన్ కోసం ఎంత ఖర్చు చేస్తున్నారో, అంత డబ్బూ జమ అవుతోంది. రెండోది– ఆదేశాల్లో, ఈ పెన్షన్ ఇచ్చేది మీరు కోరుకునే సకల సదుపాయాలతో పోషించటానికి కాదు. కనీస అవసరాలు తీర్చటం మాత్రమే పెన్షన్ ప్రధాన ఉద్దేశం. మిగతాది మీరు, మీ కుటుంబం చూసుకుంటుంది.

కొన్ని సందర్భాల్లో పనిచేసేవారు తక్కువ, పెన్షన్ పొందేవారు ఎక్కువ ఉంటారు. అప్పుడు కొద్దిగా ఇబ్బందులుంటాయి. వాటికి కొన్ని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి. కానీ మొత్తం మీద మీరు ఖజానా నుండి డబ్బులు ఉద్యోగుల పెన్షన్ కోసం ఎంత ఖర్చు చేస్తున్నారో, అంత డబ్బూ జమ అవుతోంది. రెండోది– ఆదేశాల్లో, ఈ పెన్షన్ ఇచ్చేది మీరు కోరుకునే సకల సదుపాయాలతో పోషించటానికి కాదు. కనీస అవసరాలు తీర్చటం మాత్రమే పెన్షన్ ప్రధాన ఉద్దేశం. మిగతాది మీరు, మీ కుటుంబం చూసుకుంటుంది.

పొదుపు చేసి బ్యాంకుల్లో దాచుకోవచ్చు, పెట్టుబడులుగా వినియోగించుకోవచ్చు, లేకపోతే స్టాక్స్ కొనుక్కోవచ్చు.. మన జీవితంలోని ఆ విషయాలు మన చేతుల్లో ఉంటాయి. మనకి వచ్చే ఆదాయం వృద్ధాప్యంలో ఆదుకుంటుంది.

అక్కడ నూటికి 23 డాలర్లు.. మన ఓపీఎస్‌లో వందకి రూ.277, 10,000 జీతానికి 70,000 పెన్షన్

ఉదాహరణకు, అమెరికాని తీసుకుంటే, తలసరి ఆదాయం 85,000 డాలర్లు. పెన్షన్ రూపంలో ప్రభుత్వం సంబంధిత నిధి ద్వారా చెల్లించే డబ్బు సగటున సుమారు 17,000 డాలర్లు. అంటే తలసరి ఆదాయంలో నాలుగోవంతు కంటే తక్కువ. 22–23%. ఇందులో మూడు విషయాలు.

1) ఖర్చు పెన్షన్ రూపంలో పరిమితంగా పెడుతున్నారు. మిగతాదంతా ఆ ఉద్యోగులు తమ ఆదాయాల నుంచి పొదుపు చేయటం వంటి మార్గాల ద్వారా సమకూర్చుకునే ఆదాయం. మీ బతుకు మీరు బతుకుతారు. సమాజం మీద, వచ్చే తరం మీద భారం పడటం లేదు 2) ఈ పెన్షన్లు ప్రభుత్వ, ప్రయివేటు తేడా లేకుండా సమాజంలో అందరికీ అందుతున్నాయి. స్టీల్, సుగర్, సాఫ్ట్‌వేర్, తయారీ రంగం.. ఇలా ఏ రంగంలో పనిచేసినా.. అందరికీ పెన్షన్ లభిస్తుంది 3) ఈ పెన్షన్ కోసం ఖర్చు పెట్టే డబ్బుని వచ్చేతరం పన్నుల నుండి తీసుకోకుండా, భవిష్యత్తు అవసరాల కోసం బాధ్యతతో ఈవేళే ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ డబ్బును క్రమంతప్పకుండా కొద్దిమొత్తాల్లో జమ చేస్తున్నారు. ఉద్యోగికి ప్రతి నెలా ప్రభుత్వం లేదా ప్రయివేటు యజమాని తమ వాటాని జమ చేశారు. కానీ మన దేశంలో ప్రభుత్వోద్యోగులు డిమాండ్ చేస్తున్నది ఈ రకమైన న్యాయమైన పద్ధతి కాదు. 2004కు ముందున్న అన్యాయమైన ఓపీఎస్ పద్ధతిని తిరిగి తీసుకురమ్మంటున్నారు.

ఏమిటీ ఆ ఓపీఎస్ పద్ధతి? – మొదటిది, అది వర్తించేది ప్రభుత్వోద్యోగులకు మాత్రమే. అంటే, ఎంతమందికి? దేశం మొత్తంలో పనిచేసే జనాభాలో 3% మాత్రమే ప్రభుత్వోద్యోగులు ఉన్నారు. బాగా అర్థంచేసుకోవాలి. ఆ

మూడు శాతం ప్రభుత్వోద్యోగులకు మాత్రమే చట్టబద్ధంగా పెన్షన్. మిగతావాళ్లు ప్రయివేటు రంగంలో ఎంత కష్టపడుతున్నా, ఏ రంగంలో పనిచేస్తున్నా ఆ పెన్షన్ అందదు. రెండు, పెన్షన్ డబ్బుల్ని ఉద్యోగి, ప్రభుత్వం ముందే జమ చేసి ఆ డబ్బుల నిధి నుండి పెన్షన్ చెల్లించరు. ఖజానాలో ప్రతి సంవత్సరం వచ్చే డబ్బులో నుండి ముందుగా ఏర్పాటు లేదు. ఉద్యోగి, ప్రభుత్వం రూపాయి జమ చేయకుండా, రిటైరయ్యాక మాత్రం పెన్షన్ ఖజానా నుండి తీసుకుంటారు మూడు, అమెరికాలో 85 లక్షల డాలర్ల తలసరి ఆదాయంలో నూటికి 23 డాలర్లు పెన్షన్ ఇస్తుంటే, మన దేశంలో వంద రూపాయల తలసరి ఆదాయానికి రూ.277 పెన్షన్ ఇస్తున్నారు. అంటే.. కేవలం 3% మందికి, ముందుగా నిధికి జమ చేయకుండా, అమెరికా లాంటి సంపన్న దేశంలో కంటే తలసరి ఆదా యానికి అనేక రెట్లు ఎక్కువగా పెన్షన్లు ఇస్తున్నారు. పన్నులు కట్టే, వస్తువుల్ని, సేవల్ని అందిస్తూ సమాజరథాన్ని నడిపించే ప్రజలకు సేవలందించకుండా.. ఆ ప్రజల కంటే అనేకరెట్లు ఎక్కువ స్థాయిలో, అత్యంత ఉదారంగా పెన్షన్లు చెల్లించటం పెరిగి పోతోంది. పది వేల జీతంతో రిటైరైన ప్రభుత్వో ద్యోగుల్లో రూ.70,000 పెన్షన్ తీసుకుంటున్న వారున్నారు. ఇక్కడ ఆంధ్రప్రదేశ్ గణాంకాల్నే ఉదాహరణగా తీసుకుందాం.

ఏపీ ప్రభుత్వ అధ్యయనంలో వెల్లడైన షాకింగ్ నిజాలు

ఏపీలో జగన్మోహన్‌రెడ్డి గారి ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రభుత్వోద్యోగుల జీతభత్యాలు, పెన్షన్లు వగైరాపై సమగ్ర అధ్యయనం చేశారు. అప్పట్లో, అంటే, 3-4 ఏళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం రూ. 1లక్షా 42 వేలు ఉండేది. కానీ ప్రభుత్వోద్యోగుల సగటు పెన్షన్ ఏడాదికి రూ.5 లక్షల 34 వేలు. ఇప్పుడు తలసరి ఆదాయం పెరిగినా, ఆ నిష్పత్తిలో తేడా ఉండదు. ఇందులోని అస మతుల్యతను, అన్యాయాన్ని అర్థం చేసుకోవటానికి పెద్ద తెలివితేటలు అక్కర్లేదు. మన కుటుంబంలో ఏం జరుగు తోందో అర్థం చేసుకుంటే చాలు. తలసరి ఆదాయానికి నాలుగు రెట్లు సగటు పెన్షన్, అదీ 3% మందికి ఉంటే.. ఖజానా కుప్పకూలిపోతుంది.

అమెరికాలో 14-15% ఖర్చుతో 94% మందికి పెన్షన్లు, మన దేశంలో 18% వ్యయంతో 3% ప్రభుత్వోద్యోగులకి

అమెరికా ప్రభుత్వం పెట్టే ఖర్చులో 14-15% పెన్షన్లకు పోతుంది. కానీ ఎవరికి, ఎంతమందికి అందుతుంది? సమాజంలో అందరికీ అందుతుంది. 94% మందికి అందుతుంది. మిగిలిన ఆ కొద్దిశాతం.. చట్టవిరుద్ధంగా ఉన్నవారు, అసంఘటిత రంగంలోనివారు అయివుండవచ్చు. ఆ పెన్షన్ ఖర్చు కూడా ఖజానా నుండి కొత్తగా తీయటంలా.

> **3-4 ఏళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం రూ. 1లక్షా 42 వేలు ఉండేది. కానీ ప్రభుత్వోద్యోగుల సగటు పెన్షన్ ఏడాదికి రూ.5 లక్షల 34 వేలు. ఇప్పుడు తలసరి ఆదాయం పెరిగినా, ఆ నిష్పత్తిలో తేడా ఉండదు. ఇందులోని అస మతుల్యతను, అన్యాయాన్ని అర్థం చేసుకోవటానికి పెద్ద తెలివితేటలు అక్కర్లేదు. మన కుటుంబంలో ఏం జరుగు తోందో అర్థం చేసుకుంటే చాలు. తలసరి ఆదాయానికి నాలుగు రెట్లు సగటు పెన్షన్, అదీ 3% మందికి ఉంటే.. ఖజానా కుప్పకూలిపోతుంది.**

అప్పటికే ఆ డబ్బును అక్కడ జమచేశారు. మన దేశంలో 3% మంది ప్రభుత్వోద్యోగులకి, ఖజానాలో డబ్బు పెట్టకుండా.. ప్రభుత్వ ఖర్చులో 18% పెన్షన్ కోసం ఖర్చు పెడుతున్నాం. ఇదీ నేపథ్యం. ఇది ఉద్యోగులకు, ప్రభు త్వాలకి, సామాన్య ప్రజలకి బాగా అర్థం కావాలి. అంకెలు ఎక్కువగా చెప్పినట్లు అనిపించవచ్చు. కానీ డబ్బంతా అంకెలమయమే గదా! 10కి-100కి, 100కి-1000కి, 1000కి-10,000కి తేడా ఉందిగా, సున్నాలే గదా, అంకెలే గదా అనుకుంటే ఎలా? కాబట్టి, అందరినీ వినమ్రంగా కోరుతున్నాను.

మనందరం కులం, మతం, పార్టీ అని తన్నుకుంటున్నాం. విషయం లోతుకు వెళ్లాలి. మన లాభం, ప్రయోజనం, పిల్లల భవిష్యత్తు ఏమిటి అని ఆలోచించకుండా.. వెంటనే అభి ప్రాయాల్ని ఏర్పరచుకుంటున్నాం. దీనివల్ల గొంతుశోష తప్ప ఉపయోగం లేదు. మన మంచి కావాలంటే.. ఏం కావాలో కొంచెం అర్థం చేసుకోవాలి. ఓపీఎస్ వల్ల ఉన్న కొద్దికీ జీతాలు, పెన్షన్ల భారం పెరిగిపోయి ఖజానా డబ్బుల్లో అత్య ధికం కొద్దిమంది ప్రభుత్వోద్యోగుల పెన్షన్లకే వెళ్తున్నాయి. ఎంత డబ్బు అలా ఖర్చవుతోందో గణాంకాల్ని చూడండి.

చాలా రాష్ట్రాలు మొత్తం ప్రభుత్వం పెట్టే ఖర్చులో అన్ని రకాల ఆదాయాలు, అంటే- సొంత వసూళ్లు, ఢిల్లీ నుండి వచ్చే డబ్బు కూడా కలుపుకుని, 60-70% ఖర్చువుతోంది. కొన్ని రాష్ట్రాల్లో 90-94% జీతభత్యాలు, తాత్కాలికంగా అందించే సంక్షేమానికి వెళ్లిపోతోంది. దాంట్లో సింహభాగం ఉద్యోగుల జీతభత్యాలు. దాంతో ఏమవుతోందీ- యువతకి ఉపాధి వంటివి దేశంలో అతిపెద్ద సమస్యలుగా మారు

తున్నాయి. డిగ్రీ చదువుకున్నాం, పొట్టచేత పట్టుకుని సిద్ధంగా ఉన్నాం, ఉపాధి ఎక్కడ? అని అడిగేవారి సంఖ్య ఏటా పదుల లక్షల్లో పెరిగిపోతోంది. ఉపాధి కల్పించాలంటే, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు కావాలి. కొత్తగా పెట్టుబడి పెట్టేవారు, పారిశ్రామికీకరణ కావాలి. వారికి ప్రోత్సాహం కావాలి. వారు ఆశిస్తున్న మంచి విద్యను, నైపుణ్యాలను యువతకు అందించాలి. ఇవన్నీ లేకుండా మీరు ఎంత అరిచినా, దేవుడ్ని ప్రార్థించినా ఉపాధి అందదు.

ఉపాధి అంటే, పది మందికీ ఉపయోగపడే వస్తువుల్ని ఉత్పత్తి చేస్తూ సమాజానికి మీరు ఎంత ఉపయోగపడితే అంత ఆదాయం లభిస్తుంది. అదీ ఉపాధి. అది చేయకుండా ప్రభుత్వాలు మారొచ్చు, ఓట్లు పడొచ్చుగానీ.. ఉపాధి రాదు. ఆదాయాలు పెరగవు. ప్రభుత్వం ఆ పనిచేయకుండా, అందుకు ఏర్పాట్లు చేయకుండా అప్పు తీసుకొచ్చి పప్పు కూడా తింటే, ఈవేళ్టి అవసరం తీర్చుకుంటే.. రాష్ట్రం, దేశం ఏమవుతాయి?

ఆర్థిక ఎమర్జెన్సీతో జీతాలు కూడా ఇవ్వని పరిస్థితి వద్దు.. ఏపీ గణాంకాల్ని పరిశీలించి తెలంగాణ కూడా సమగ్ర అధ్యయనంతో శ్వేతపత్రం ప్రకటించాలి

తెలంగాణ రాష్ట్రంలో ఈ గణాంకాలపై సమగ్ర అధ్యయనం జరగలేదు. నేను తెలంగాణ ప్రభుత్వానికి బహిరంగంగా వినమ్రంగా విజ్ఞప్తి చేస్తున్నాను. ఏపీలో వైకాపా ప్రభుత్వం ఉన్నప్పుడు, ఈ పెన్షన్ల భారం ఎంతుంది, పాత పెన్షన్ అలాగే కొనసాగిస్తే, తద్వారా ధరల పెరుగుదలను మించి పే రివిజన్లు చేసినప్పుడల్లా భారీగా పెన్షన్లను శక్తికి మించి ఇస్తుంటే ఏం జరుగుతుందో లెక్కల్ని తేల్చటం వల్ల.. ఓపీఎస్ వినాశకర పరిణామాలు అర్థమయ్యాయి. లక్ష, లక్షన్నర నెలనెలా ఉచితంగా ఇస్తానంటే నేనూ తీసుకుంటా. డబ్బు ఎవరికి చేదు? కానీ ఎవరి డబ్బు ఇది? ఎంత ఇవ్వగలం? రేపొద్దున పిల్లల మీద ఎంత భారం పడుతుంది? వాళ్ల బతుకు ఏమవుతుంది? వారి భవిష్యత్తు ఏమవుతుంది?.. ఇవి పట్టించుకోకుండా రేపటి పిల్లల భవిష్యత్తుని సమాధి చేస్తూ పబ్బం గడుపుకుంటున్నాం. అది ధర్మం అవుతుందా? మనందరం బతికేది మన పిల్లల కోసం గదా? మా తరంలో ఎవరినైనా అడగండి, మీ తల్లిదండ్రుల్ని, తాతముత్తాతల్ని అడగండి– మేమంతా బతికేది మా పిల్లల కోసం అనే చెబుతారు. కూడబెట్టి, అవసరాల్ని చంపుకుని, పొదుపు చేసి.. మన కంటే మన పిల్లలు బాగుండాలనే ప్రతి కుటుంబం భావిస్తుంది. ఏపీ ప్రభుత్వం అంచనా వేసినప్పుడు, పాత పెన్షన్‌ని అలాగే కొనసాగిస్తే, అలాంటి భవిష్యత్తును వచ్చే తరాలకి అందించటం అసాధ్యమని తేలింది. అప్పటికే ప్రభుత్వ వ్యయంలో జీతభత్యాలకు,

> **ఏపీలో వైకాపా ప్రభుత్వం ఉన్నప్పుడు, ఈ పెన్షన్ల భారం ఎంతుంది, పాత పెన్షన్ అలాగే కొనసాగిస్తే, తద్వారా ధరల పెరుగుదలను మించి పే రివిజన్లు చేసినప్పుడల్లా భారీగా పెన్షన్లను శక్తికి మించి ఇస్తుంటే ఏం జరుగుతుందో లెక్కల్ని తేల్చటం వల్ల.. ఓపీఎస్ వినాశకర పరిణామాలు అర్థమయ్యాయి.**


వడ్డీలకు 75–85% వెళ్తోంది. ఓపీఎస్ కొనసాగిస్తే, ఆ ఖర్చు 120%కి చేరుతుంది. సంక్షేమం, పరిపాలనకు ఒక్క రూపాయి కూడా ఉండదు. జీతభత్యాల కోసమే 20 రూపాయలు అప్పు తేవాల్సి వస్తోంది. ద్రవ్యలోటు, అంటే అప్పులు కూడా రాష్ట్రం స్థూల ఆదాయంలో (బడ్జెట్‌లో కాదు, జీఎస్‌డీపీలో) 3% దాటకూడదు. కానీ 5–6%కి వచ్చేసింది. కాలక్రమేణా 10–12% అవుతుంది. రాష్ట్ర ఖర్చులో కాకుండా, మొత్తం ఉత్పత్తిలో ఇంత శాతం కేవలం ప్రభుత్వ రోజువారీ నిర్వహణకు అంటే, ఇక భవిష్యత్తు ఉంటుందా? కేవలం ప్రతి సంవత్సరం పెరిగే పాత పెన్షన్ల వల్ల అలా లోటు కూడా పెరుగుతుంటుంది. ఇక కోలుకునే అవకాశం లేదు, రాష్ట్రం కూలిపోయినట్లే.

ఒక రాష్ట్రం అప్పుల భారం సొంత ఆదాయంలో 20% దాటకూడదు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో 50% దాటి పోయింది. ఓపీఎస్ కొనసాగిస్తే ఇది క్రమంగా 200%కి వెళ్తుంది. రాష్ట్ర స్థూల ఉత్పత్తికి రెట్టింపు స్థాయిలో ఇప్పటికే అప్పులు చేశారు. భవిష్యత్తుని కాపాడే ఉద్దేశంతోనే వాజపేయి ప్రభుత్వం చివరి దశలో జస్వంత్‌సింగ్ ఆర్థిక మంత్రిగా ఉండగా అందరినీ ఒప్పించి 2004 నుండి కొత్త పెన్షన్ విధానం ఎన్‌పీఎస్ తీసుకొచ్చారు. అంతకుముందున్నవారికి ఒప్పందం ప్రకారం ఓపీఎస్ వర్తింపచేసినా, ఆ సంవత్సరం నుంచి చేరినవారికి ఎన్‌పీఎస్ అమలవుతుంది. ఎన్‌పీఎస్‌లో ప్రతి నెలా కొంత డబ్బు ఉద్యోగితోపాటు ప్రభుత్వం జమ చేస్తుంది. 2004కి ముందున్న ప్రభుత్వోద్యోగుల రిటైర్‌మెంట్ 2035 నాటికి పూర్తవుతుంది కాబట్టి.. అప్పట్నుంచి ఆ భారం పడదు. కాలక్రమేణా ఓపీఎస్ భారం తగ్గి, యువత భవిష్యత్తు బాగుపడుతుంది. ఈ మార్గసూచీ ప్రకారం ఇన్నాళ్లూ సక్రమంగా వ్యవహరించారు. కాంగ్రెస్ నాయకత్వంలోని యు.పి ప్రభుత్వం కొత్త పెన్షన్ విధానాన్ని సమర్థంగా విస్తరించేందుకు ఏర్పాట్లు చేసింది. ఒక్క పశ్చిమ బెంగాల్ మినహా అన్ని రాష్ట్రాలూ ఎన్‌పీఎస్‌ను స్వీకరించాయి. ఇప్పుడు రాజకీయంగా పార్టీల్ని, ప్రభుత్వాల్ని

భయపెట్టి, ఓపీఎస్‌ను తిరిగి తీసుకురాకపోతే ఎన్నికల్లో తడాఖా చూపిస్తాం అని ప్రభుత్వోద్యోగుల్లో కొంతమంది బెదిరించటంతో.. నేతలు మలేరియా జ్వరం వచ్చినట్లు వణికిపోతున్నారు. వాళ్లదేం పోయింది? తక్షణం నష్టం కనిపించదు. ఆ ప్రభావం తరవాతికాలంలో తెలుస్తుంది. పదేళ్ల తర్వాత దేశం, రాష్ట్రం నాశనమైతే మనకేం కావాలి? ఈ పరిస్థితుల్లో కొన్ని రాష్ట్రాలు వెనక్కి వెళ్తున్నాయి. కానీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ ఇప్పటికీ బాధ్యతతో ఆ పనిచేయకుండా భవిష్యత్తుని కాపాడే ప్రయత్నం చేస్తున్నాయి. ఓపీఎస్ ఆత్మహత్యాసదృశం. రాష్ట్ర, దేశ భవిష్యత్తుని సర్వనాశనం చేస్తుంది. ఈవేళ నాకు, నా కుటుంబానికి ఏమవుతుంది అనుకుంటే– ఉమ్మడిగా అందరి భవిష్యత్తూ సర్వనాశనమవుతుంది.

ప్రభుత్వోద్యోగులకు కొన్ని న్యాయమైన డిమాండ్లున్నాయి. ఉదాహరణకు, మేం పెట్టిన డబ్బు తదనంతరం ఏమవుతుంది? అని. ఆ డబ్బు ఎక్కడికీ పోదు. ఉద్యోగి చనిపోతే కుటుంబ సభ్యులకు వెళ్తుంది. అదేవిధంగా, ఆర్థిక వ్యవస్థ దెబ్బతిని ఫండ్‌లో, స్టాక్ మార్కెట్‌లో డబ్బు తిరిగి రాకపోతే? ఈ భయాలకు సమాధానంగానే ప్రభుత్వం ఇంకో పద్ధతి తీసుకొచ్చింది. యూపీఎస్ (యూనిఫైడ్ పెన్షన్ పథకం). దీనివల్ల ఉద్యోగికి ఏ పరిస్థితుల్లోనూ ఉద్యోగికి చివరి సంవత్సరంలో సగటు జీతంలో 50%కి తగ్గకుండా పెన్షన్ లభిస్తుంది. ఒకవేళ తగ్గితే, ప్రభుత్వమే ఆ లోటు మొత్తాన్ని చెల్లిస్తుంది. చాలావరకూ ఆ అవసరం ఉండదు. కానీ ఒకవేళ అలాంటి ప్రమాదమే వస్తే భరోసాను యూపీఎస్ చట్టబద్ధంగా ఇస్తుంది. తెలంగాణలోనూ ఆ పనిచేయండి. యూపీఎస్ అమలు చేయండి. అంతేగానీ, ఈవేళ్టి పిల్లల భవిష్యత్తుని నాశనం చేస్తూ, రేపు రాష్ట్రానికి భవిష్యత్తులేకుండా తాత్కాలికంగా కొందరు ఉద్యోగులను తృప్తిపరచటం కోసం ప్రభుత్వం పనిచేస్తే.. భవిష్యత్తు సర్వనాశనమవుతుంది.

నేను ఆశావాదిని. నాకు మన భవిష్యత్తు పట్ల, ప్రభుత్వం పట్ల, ఉద్యోగుల పట్ల, సమాజం పట్ల అపార విశ్వాసం ఉంది. అందుకే వినమ్రంగా కోరుతున్నాను. నేను చెప్పినవన్నీ కఠోర వాస్తవాలు. ఒక్కటైనా అబద్ధమేమో పరిశీలించండి. చాలా అధ్యయనం తర్వాత చెబుతున్నాం. లోతైన అధ్యయనం చేశాం. తెలంగాణ కూడా గతంలో ఏపీ చేసినట్లుగా పాత పెన్షన్ పద్ధతిని మళ్లీ తెచ్చినట్లయితే ఏం జరుగుతుందో అధ్యయనం చేయాలి. ఆ శ్వేతపత్రాన్ని బయటపెట్టండి. ఒక నిపుణుల కమిటీతోనో లేదా ప్రామాణిక సంస్థలతోనో అధ్యయనం చేయించండి. ప్రభుత్వోద్యోగులను వినమ్రంగా కోరుతున్నా. ఇంతకుముందే చెప్పా– దుబారా ఖర్చులు, అప్పులు, అనుత్పాదక వ్యయాలు పెరగటం, ఉత్పత్తి, పెట్టుబడులు లేకుండా ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే.. మీ జీతభత్యాలకు కూడా ప్రమాదం ఏర్పడుతుంది. వడ్డీ సంగతి తర్వాత, అసలుకే ముప్పు ఏర్పడుతుంది. రాజ్యాంగంలో ఏర్పాట్లున్నాయి. ఆర్థిక అత్యవసర పరిస్థితిని ప్రకటించే అధికారం, బాధ్యత జాతీయస్థాయి ప్రభుత్వానికి ఉన్నాయి. ఇప్పటికే మీరు చూస్తున్నారు– చాలామందికి రిటైర్మెంట్ ప్రయోజనాలు అందటం లేదు. కాబట్టి, అలవిమాలిన కోర్కెలు కోరి దేశ భవిష్యత్తుని నాశనం చేయవద్దు. ప్రజలకు వ్యతిరేకం కావద్దు.




ప్రభుత్వోద్యోగులకు యూపీఎస్ అమలు చేయండి

రాజకీయ పార్టీలు కచ్చితంగా ఉద్యోగులకు న్యాయం చేయాలి. కానీ ఉద్యోగులకు న్యాయం చేయటమంటే.. సమాజం మొత్తానికీ అన్యాయం చేసి కాదు. ప్రజల ప్రయోజనాలను కాపాడుతూ, పన్నుల డబ్బు పరమార్థం ప్రజల సౌకర్యాలు, అవసరాలను నెరవేర్చటమని గుర్తిస్తూ భవిష్యత్తుకి బాటలు వేయాలి. ఎవరూ చూడరులే, ఎవరికీ తెలియదులే అనే తరహా అన్యాయ ప్రవర్తన ఉండదని నమ్ముతున్నాను. మీరంతా విజ్ఞత గలవారు. రాష్ట్ర భవిష్యత్తు పట్ల బాధ్యత ఉన్నవారు. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోవాల్సినవారు. నిజాయతీగా ఆలోచించి ఒక బృందాన్ని ఏర్పాటు చేసి ప్రామాణిక నివేదికను ప్రజల్లో పెట్టండి. ఉద్యోగుల కోసం యూపీఎస్‌ను అమలు చేయండి.

మీ రాష్ట్ర ఆర్థిక ఆరోగ్యం తెలుసుకుంటున్నారా?

– బండారి ధనుంజయ

ఎవరైనా కాస్త పరిచయస్తులు ఎదురుకాగానే, 'బాగున్నారా?' అని అడుగుతాం. ఆరోగ్యం మనుషులకే కాదు.. రాష్ట్రాలకు, దేశాలకు కూడా ఉంటుంది. రాజ్యవ్యవస్థ ఆరోగ్యం ప్రధానంగా ఆర్థిక రంగానికి సంబంధించి ఉంటుంది. కాబట్టి, మన స్థానిక ప్రజాప్రతినిధుల్ని, ఎమ్మెల్యే, ఎంపీల్ని, ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రధానమంత్రిని 'రాష్ట్ర, దేశ ఆర్థిక ఆరోగ్యం ఎలా ఉంది?' అని అడగటం ఇక నుంచైనా మొదలుపెడదాం. రోజూ మీడియాలో సంబంధిత వార్తల్ని శ్రద్ధగా తెలుసుకుందాం. డబ్బు ఎక్కడ్నుంచి వస్తోంది, అందులో మన పన్నులు, వనరులు, అప్పులు ఎంత, ఏ



రంగానికి ఎంత ఖర్చు చేస్తున్నారు, దానివల్ల అంతిమంగా ప్రజలకు, భవిష్యత్తు తరాలకి లాభమేంటి.. ఇలా ఆర్థిక ఆరోగ్యాన్ని అంచనా వేయాలి.

రాష్ట్రాల ఆర్థిక ఆరోగ్య సూచిక (ఫిస్కల్ హెల్త్ ఇండెక్స్) అనేది దేశంలోని రాష్ట్రాల ఆర్థిక పనితీరును మూల్యాంకనం చేయటానికి నీతి ఆయోగ్ ప్రారంభించిన డేటా ఆధారిత ఫ్రేమ్ వర్క్. దీన్ని ఆర్థిక క్రమశిక్షణ, సుస్థిర అభివృద్ధిని ప్రోత్సహించే సాధనంగా పేర్కొంటారు.

☞ ఇది ఆదాయాల నిర్వహణ, చేసే ఖర్చు నాణ్యత, రుణ స్థిరత్వాన్ని అంచనా వేసే ఉపకరణంలా పనిచేస్తుంది.

☞ ఇది రాష్ట్రాల పనితీరుని అంచనా వేస్తుంది. వాటి బలాలు, బలహీనతలతోపాటు సంస్కరణలకు అవకాశమున్న రంగాలను గుర్తిస్తుంది. ఈ నేపథ్యంలో, ఎంతో కీలకమైనది. ఎందుకంటే, దేశంలోని మొత్తం ప్రభుత్వ వ్యయంలో 60% రాష్ట్రాల నియంత్రణలోనే ఉంటుంది.

☞ 2025లో రాష్ట్రాల ఆర్థిక ఆరోగ్య సూచిక పేరుతో నీతి ఆయోగ్ మొదటి నివేదికను విడుదల చేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో దేశంలోని 18 పెద్ద రాష్ట్రాల్లో ఆర్థిక స్థితిగతులను విశ్లేషిస్తూ దీన్ని తయారుచేసింది.

☞ రెండో వార్షిక నివేదికను 'రాష్ట్రాల ఆర్థిక ఆరోగ్య సూచీ-2026' పేరుతో ఇటీవల విడుదల చేసింది. 2025 నివేదికలో.. ఖర్చుల్లో నాణ్యత, ఆదాయ సమీకరణ, ఆర్థిక వివేచన, రుణ సూచిక, రుణ సుస్థిరత మొదలైన అయిదు అంశాలను పరిగణలోకి తీసుకుని నీతి ఆయోగ్ ఈ నివేదికను తయారు చేసింది. వీటి ఆధారంగానే మొత్తం 18 రాష్ట్రాలను గ్రూప్‌గా చేసి ర్యాంకులు కేటాయించింది. తొలి మూడు స్థానాల్లో ఒడిశా, గోవా, జార్ఖండ్ ఉండగా.. చివరి మూడు స్థానాల్లో పంజాబ్, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ నిలిచాయి.

☞ కాగ్, రిజర్వు బ్యాంక్‌తో పాటు వివిధ సంస్థల నుండి సేకరించిన సమాచారం ఆధారంగా దీన్ని రూపొందిస్తారు.

☞ ప్రతి రాష్ట్రం ప్రజల పేరు మీద చేసే ఖర్చు, ఆదాయాన్ని సమర్థవంతంగా సమీకరించటం.. స్థూల ఆర్థిక స్థిరత్వం, వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని నీతి ఆయోగ్ పేర్కొంది.

ముఖ్యాంశాలు

2026-27 యూనియన్ బడ్జెట్ ప్రకారం 2025 నాటికి దేశ జీడీపీలో ప్రభుత్వ సాధారణ స్థూల రుణం 81.4% ఉన్నట్లు అంచనా.

☞ ఆంధ్రప్రదేశ్ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తిలో రుణ నిల్వ శాతం (జీఎస్‌డీపీ, అప్పుల నిష్పత్తి) 28.3% ఉండగా, 2023-24 నాటికి అది 33 శాతానికి పెరిగింది (ఏపీ బడ్జెట్ 2026-27 ప్రకారం ప్రభుత్వ రుణం 36 శాతానికి చేరింది. బడ్జెట్‌లో చూపని, ప్రభుత్వం విధిగా చెల్లించాల్సిన అప్పులు ఇంకా లక్షా 30 వేల కోట్ల దాకా ఉంటాయని

అంచనా).

☞ తెలంగాణ రాష్ట్ర జీఎస్‌డీపీలో రుణ నిల్వ శాతం 2014-15లో 15.8% ఉండగా, 2023-24 నాటికి అది 27.2 శాతానికి పెరిగింది (ఇక్కడ కూడా అధికారికంగా చూపని అప్పులు పెండింగ్‌లో ఉన్నాయని విశ్లేషకుల అభిప్రాయం).

☞ దీని ప్రకారం యూనియన్‌లో కొంతమేర, అత్యధికంగా రాష్ట్ర ప్రభుత్వాల అప్పుల భారం పెరుగుతూ వస్తోంది.

☞ రాష్ట్ర జీఎస్‌డీపీలో వృద్ధి, వడ్డీ చెల్లింపుల్లో వృద్ధి రేటును తులనాత్మకంగా పరిశీలించి రాష్ట్రాలు ఆ రుణాలు భరించే స్థితిలో ఉన్నాయా, తిరిగి తీర్చగలవా.. అనేది నీతి ఆయోగ్ పరిశీలించి నివేదిక తయారు చేసింది.

రాష్ట్రాల ఆర్థిక ఆరోగ్య సూచిక 2026లో 18 రాష్ట్రాల ర్యాంకులు

రాష్ట్రం	ఎఫ్‌హెచ్‌ఐ స్కోరు	ర్యాంకు	ఖర్చులో నాణ్యత	ఆదాయ సమీకరణ	ఆర్థిక వివేకం	రుణ సూచిక	రుణ స్థిరత్వం
ఒడిశా	73.1	1	71.2	80.3	58.7	95.8	59.5
గోవా	54.7	2	49.5	80.4	45	56.8	41.9
జార్ఖండ్	50.5	3	66.3	37.6	54.4	67.9	26.3
గుజరాత్	49.9	4	48.3	44.8	51.5	74.2	30.2
మహారాష్ట్ర	45	5	36.9	52.7	35.2	76	24.3
ఛత్తీస్‌గఢ్	44.3	6	60.8	48.4	8.4	72.5	31.5
తెలంగాణ	44.3	7	57.1	60.8	30	53.5	20
ఉత్తరప్రదేశ్	41.9	8	50.9	28.1	38.8	60.2	31.7
కర్ణాటక	41.7	9	46.8	43.2	33.1	61.4	24.1
మధ్యప్రదేశ్	37.8	10	60.8	32	35.1	58.9	2.2
హర్యానా	34.5	11	35.8	48	27.3	32.8	28.7
బీహార్	30.9	12	58.3	2.9	27.4	48	17.8
తమిళనాడు	29.8	13	30.5	39.8	21.5	39.1	18.2
రాజస్థాన్	27.6	14	43.7	29.4	11.3	32.1	21.5
కేరళ	24.8	15	4.1	47.8	24	23.3	24.8
పశ్చిమ బెంగాల్	23.8	16	37.4	12.9	22.7	20.1	25.6
ఆంధ్రప్రదేశ్	23.1	17	43.1	21.7	9.9	36.6	4.2
పంజాబ్	12.4	18	8.1	29.8	5.9	2.1	15.9


ఏసీబీ కేసులపై నేరుగా విచారణ ఆదేశాలివ్వండి

అవినీతి నిరోధక శాఖకు చిక్కిన ప్రభుత్వాధికారులను ప్రాసిక్యూషన్ చేసే విషయంలో న్యాయస్థానంలోనే విచారణ కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాసిన లేఖలో కోరారు. తేజ్‌రాం వర్సెస్ స్టేట్ ఆఫ్ రాజస్థాన్ కేసులో సుప్రీంకోర్టు అక్టోబర్ 16న ఇచ్చిన ఆదేశాల ప్రకారం, ఏసీబీ కేసుల ప్రాసిక్యూషన్‌కు ప్రభుత్వ ముందస్తు అనుమతి అవసరంలేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ ఏసీబీ ప్రతి నెలా సగటున 20-25 కేసుల్ని నమోదు చేస్తోందని.. అయితే ప్రాసిక్యూషన్‌కు అనుమతి కోరుతూ ప్రభుత్వానికి నివేదికలు పంపిన తర్వాత ఆయా కేసుల్ని ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కొందరు అధికారులు రెండుసార్లు ఏసీబీ కేసుల్లో దొరికిన ఉదంతాలున్నాయన్నారు. ఏసీబీ ప్రాసిక్యూషన్‌కి అనుమతి కోరిన ప్రతిసారీ.. అవినీతి అధికారులను రక్షించేందుకు సచివాలయంలో ఒక బలమైన వర్గం పనిచేస్తోందన్నారు. 'లంచం డిమాండ్ చేయటం, స్వీకరించటం పూర్తిగా నేరపూరిత చర్య. అవినీతి నిరోధక చట్టం, 1988లోని సెక్షన్ 17-ఎ (2018 సవరణ ప్రకారం) కింద కల్పించిన రక్షణ లేదా ముందస్తు అనుమతి నిబంధనలు ఇలాంటి చర్యలకు వర్తించవు' అని సుప్రీంకోర్టు తాజా తీర్పులో స్పష్టం చేసిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో నిందితులపై ప్రభుత్వ అనుమతి కోసం వేచిచూడకుండా ప్రాసిక్యూషన్ ప్రక్రియను కొనసాగించాలని ఏసీబీకి తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

'మధ్యవాదానికి' ఓటు ప్రజాస్వామ్యానికి మంచి పరిణామం

– డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

నవంబర్ 3న అమెరికాలో జరిగిన మధ్యంతర ఎన్నికలు 'తప్పులు సరిదిద్దుకోవటం'లో ప్రజా స్వామ్యానికున్న సాటిలేని బలాన్ని చాటాయి. ఈ ఎన్నికల్లో ఓడిపోతే అధ్యక్ష పదవేమీ పోదు. కానీ అధ్యక్ష ఎన్నికల తరహాలో ప్రపంచమంతా ఫలితాల కోసం ఉత్కంఠతో ఎదురుచూసింది. మనలో చాలామంది ఆశించినదానికంటే ఎక్కువ మార్పునే అమెరికా ఓటర్లు చూపారు. అమెరికా అధ్యక్షుడి సగం పదవీకాల సమ యంలో ఆ దేశ కాంగ్రెస్‌లో ఉండే రెండు సభలు.. ప్రజా ప్రతినిధుల సభ, సెనెట్‌కు ప్రతి రెండేళ్లకూ ఎన్నికలు జరుగుతాయి. ప్రతినిధుల సభలో మొత్తం 435 సీట్లకు, సెనెట్‌లో 100 స్థానాలలో 35కి ప్రస్తుత ఎన్నికలు జరి గాయి. అధ్యక్షుడు తాననుకున్నది చేయటానికి, కాంగ్రెస్‌లో మెజారిటీ కీలకం. లేకుంటే, విదేశీ విధానాల్లో, రక్షణ, దేశ భద్రత విషయాలలో తప్ప ఎగ్జిక్యూటివ్ ఆదేశాల ఫలితాలు పరిమితంగా ఉంటాయి. ప్రతినిధుల సభలో అధ్యక్షుడు ట్రంప్ పార్టీ రిపబ్లికన్‌లకు ఆధిక్యత ఉండగా, తాజా ఎన్నికల తర్వాత ప్రత్యర్థి డెమోక్రాటిక్ పార్టీ భారీ మెజారిటీ (80–100) సాధించింది. సెనెట్‌లోనూ డెమోక్రాటిక్ పార్టీకి ఆధిక్యం గణనీయంగా పెరిగింది. అంటే, అధ్యక్షుడి రెక్కలు కత్తిరించారు ప్రజలు. అమెరికాలో ప్రభుత్వం అధికారాల విభజన ప్రాతిపదికన నడుస్తుంది. చట్టసభలని రాష్ట్రపతి శాసించలేరు; అలాగే రాష్ట్రపతి చట్టసభలకి లొంగిఉండనక్కర్లేదు; చట్టాలని రాష్ట్రపతి వీటో ద్వారా తిరస్కరించవచ్చు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో ఎలాగైతే తటస్థ రాష్ట్రాల (స్వింగ్ స్టేట్స్)తోపాటు డెమోక్రాటిక్ కంచుకోటల్లో రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్‌కి అనుకూల ఓట్లు వేశారో, ఇప్పుడు అంతకంటే ఎక్కువ తీవ్రతతో వ్యతిరేక ఓటు వేశారు. ఎన్నికల ఫలితాలపై గతంలోలా యాగీ చేయలేనంత బలంగా ప్రజాతీర్పు ఉంది. దీంతో, డెమోక్రాట్లు గెలిచారని ట్రంప్ అంగీకరించారు. ఇరాన్‌పై యుద్ధం తమ కొంపముంచిందని, అయినా చేయక తప్పదని.. అంత రాత్మలో దాచుకున్న నిజాన్ని ట్రూత్‌లో పోస్ట్ చేశారు.



అమెరికా మధ్యంతర ఎన్నికల్లో బ్యాలెట్ పత్రంలో అధ్యక్షుడి పేరు ఉండదు. రెండేళ్లకోసారి జరిగే ప్రతినిధుల సభ ఎన్నికల్లో అధ్యక్షుడు మిగిలిన పదవీకాలాన్ని దృష్టిలో పెట్టుకొని కొంత అసంతృప్తి మాత్రమే ఓటర్లు వ్యక్తం చేస్తుం టారు. సీట్లు స్వల్పంగా తగ్గిస్తుంటారు. కానీ ఇప్పటిలా.. అటు ప్రతినిధుల సభ, ఇటు సెనెట్ రెంటిలోనూ అధికార పార్టీకి భారీ వ్యతిరేకత వ్యక్తమవటం చాలా అరుదు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత 1946, 1994, 2010లో మాత్రమే అలా జరిగింది. 1992లో బిల్ క్లింటన్ ఎన్ని కయ్యాక రెండేళ్లకే ప్రతినిధుల సభతోపాటు సెనెట్‌లోనూ ప్రతిపక్ష రిపబ్లికన్‌లకు ఆధిక్యం ఇవ్వటం ద్వారా ఓటర్లు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. దీన్ని 'గింగ్రిచ్ విప్లవం' అంటారు. అదేవిధంగా 2010లో బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు కూడా మధ్యంతర ఎన్నికల్లో ప్రతి నిధుల సభలో ప్రజాగ్రహం ప్రతిధ్వనించింది. ఇప్పుడు మళ్లీ గింగ్రిచ్ స్థాయి వ్యతిరేకత వచ్చింది. ఈ క్రమంలో.. మనం ట్రంప్ స్టయిల్‌ను, ఆయన సామర్థ్యాన్ని వేర్వేరుగా చూడాలి. తన విధినిర్వహణలో డోనాల్డ్ ట్రంప్ ఒక వినూత్న తరహాని అవలంబించారు. కొన్ని నిర్ణయాలు ఆయన చేసిన హామీల ప్రకారమే ఉండొచ్చు. కానీ ఆ చేసిన తీరు ఒక వర్ధమాన, అపరిపక్వ ప్రజాస్వామ్య దేశాల్లోని ప్రజానీకానికి కూడా ఏవగింపు కలిగేలా చేశారు. సరిహద్దుల్ని కట్టుదిట్టం చేసి అక్రమ వలసల్ని ఆపుతారనే ట్రంప్‌కి చాలామంది సాం

ప్రదాయ డెమోక్రాట్ ఓటర్లు మద్దతిచ్చారు. కానీ దాన్ని క్రూరంగా, మానవ హక్కుల ఉల్లంఘనలా, ఆయా దేశాల్లో ఎన్నికైన ప్రభుత్వాధినేతల్ని అవమానించేలా మార్చి ట్రంప్ వ్యవహరించటం, వాచాలత్వాన్ని ప్రదర్శించటం.. అధిక శాతం అమెరికన్లకు ఆమోదయోగ్యం కాలేదు. అదేవిధంగా, ఇరాన్‌పై జరిపిన యుద్ధం అణ్వాయుధాల వ్యాప్తిని అరికట్టటం కోసమని చెప్పినా, అనుకున్న ప్రయోజనాలు నెరవేరకపోగా ఇంధన సంక్షోభాన్ని కలిగించి డీజిల్, గాసోలిన్ ధరలు పెరిగేట్టు చేసింది.

ట్రంప్ ఊహించని మలుపులు తిరిగినా, ఆ రీతిలో భీకరదాడుల వెనుక ట్రంప్ స్వప్రయోజనాలున్నాయని ప్రజలు భావించారు. అమెరికా విదేశాంగ విధానం ఆధారంగా ఆ దేశ ప్రజలు ఓటు వేయటం ప్రచ్ఛన్న యుద్ధ అణ్వాయుధాల కాలంలో కూడా అరుదు. కానీ ఈసారి సుంకాలు, ఇరాన్ యుద్ధం, పర్యవసానంగా స్థానికంగా ఇంధన ధరలు, ఇతర వ్యయాలు పెరగటం, సగటు అమెరికన్లకు ఉపాధి అవకాశాలు పెరగకపోవటం, వలస విధానం అమలు తీరుతో రైతులు, చిన్న సంస్థలు ఒకలా, పెద్ద సంస్థలు మరోలా మానవ వనరులు దొరక్క ఇబ్బంది పడటం, ఈ మొత్తానికీ అధ్యక్షుడి అరాచక ధోరణే కారణమని భావించి ఓట్లు వేశారు. హిస్పానిక్, ఆసియా అమెరికన్లు పెద్దఎత్తున డెమోక్రాట్లకు ఓటు వేశారు. టెక్సస్, ఓహయో, మైన్, సౌత్ కరోలినా, కన్సస్, అయోవా తదితర కంచుకోట రాష్ట్రాల్లో రిపబ్లికన్ పార్టీ ఓడింది. మహిళా ఆఫ్రో అమెరికన్, లాటిన్ అమెరికన్ తొలిసారిగా గవర్నర్లుగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడి తప్పుడు నిర్ణయాల వల్ల పెరుగుతున్న జీవనవ్యయం, ఆరోగ్య రంగంలో ఒడిదుడుకులపై డెమోక్రాట్లు విస్తృతంగా ప్రచారం చేశారు. ఎంతో వ్యక్తిగత సామర్థ్యం ఉండి అంతకుముందు ఎలాన్ మస్క్‌తో కలిసి ప్రభుత్వోద్యోగ వ్యవస్థ ప్రక్షాళనకు 'డోజ్' (డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ)లో కొంత కాలం పనిచేసి ఓహియో గవర్నర్ పోటీ బరిలో దిగిన భారతీయ సంతతి వ్యాపారవేత్త వివేక్ రామస్వామి తన అనైతిక ప్రచారం వల్ల ఓడిపోవాల్సి వచ్చింది. పేరులోని వివేకాన్ని ప్రదర్శించకుండా తన ప్రత్యర్థి బాల్యంలో ఎదుర్కొన్న లైంగిక దాడుల్ని ట్రంప్‌కి నకలులా ప్రచారాంశం చేసినందుకు ప్రజలు వివేక్‌ని శిక్షించారు. అదే ఒహయో రాష్ట్రంలో ఉప రాష్ట్రపతి జేడీ వాన్స్ ఖాళీ చేసిన సెనేట్ సీట్‌లో కూడా రిపబ్లికన్లు ఓటమి చవిచూశారు. అధ్యక్షుడి పట్ల ఆ రకమైన వ్యతిరేకత యువత, వివిధ వర్గాల ప్రజలు, పట్టణ, కొంతమేర గ్రామీణ ప్రాంతాల నుండి వ్యక్తమవటం పక్షపాతాలతో, సాంస్కృతిక అంశాల ప్రాతిపదికన ముక్కల



యిన అమెరికన్ సమాజంలో అనూహ్యమయిన పరిణామం. ప్రతినిధుల సభలో అంతకుముందున్న ఆధిక్యాన్ని పెంచుకునేందుకు 8 రాష్ట్రాల్లో రిపబ్లికన్‌లకు అనుకూలంగా (జెర్రీ మాండరింగ్) 16 స్థానాలను ట్రంప్ పునర్విభజించగా, ఆ ప్రయత్నం బెడిసికొట్టి కొత్త కాంగ్రెషనల్ సీట్లలో ప్రతి అయిదులో ఒకటి మాత్రమే రిపబ్లికన్లు గెలవగలిగారు. త్వరలో సీట్ల సంఖ్యలో కాలిఫోర్నియాను అధిగమించే అవకాశమున్న టెక్సస్‌లో డెమోక్రాట్లకు ఇంత మెజారిటీ ఇదే మొదటిసారి. టెక్సస్ సెనేట్ ఎన్నికలలో అమెరికా చరిత్రలో అత్యంత ఎక్కువ డబ్బుని రిపబ్లికన్లు ఖర్చు చేసినా ఓటమి పాలయ్యారు. ఈ రకంగా, అమెరికా మధ్యంతర ఎన్నికలు ప్రజాస్వామ్యానికున్న పునరుజ్జీవన శక్తిని చాటాయి. ప్రపంచ ప్రజాస్వామ్యానికి దిక్సూచిలాంటి తమ దేశం అప్రజాస్వామిక, ఆకస్మిక భావోద్వేగ నిర్ణయాల బారిన పడటాన్ని సహించలేని అమెరికన్లను జాతి, మత, తెగ, వర్ణాలకు అతీతంగా ఏకం చేశాయి.

వివిధ వర్గాలు రాజకీయ కక్షలతో గత మూడు దశాబ్దాలుగా విడిపోయినట్లు అమెరికన్ సమాజం కనిపించింది. వారివారి జాతి, గ్రామీణ/ పట్టణ నివాసం, విద్యాస్థాయి, ఒంటి రంగు, మతం, ఏ రాష్ట్రంలో నివాసం – వీటి ప్రాతిపదికన అత్యధిక ప్రజలు ఓటు వెయ్యటం అమెరికాలో రివాజయింది. అలాగే వాస్తవాలు, తర్కంతో సంబంధం లేకుండా తమకి నచ్చిన పార్టీనో, నాయకుణ్ణో నిరంతరం సమర్థించటం, తాము వ్యతిరేకించే పార్టీ/నాయకుణ్ణి ద్వేషించటం ఆనవాయితీ అయింది. ఈ నేపథ్యంలో అన్నివర్గాల అమెరికన్ ప్రజలు తాము ఏ పార్టీకి శాశ్వత ఓటర్లం కాదని, కొన్ని విలువలకి, తమ జీవితంలో బాగోగులకి అనుగుణంగా ఓటుని మార్చుకునే శక్తి ఉందని రుజువు చేశారు. ఇలా ఓటర్లు పరిస్థితులనిబట్టి పార్టీ విధేయత కంటే కొన్ని విలువలు, తమ ఉమ్మడి ప్రయోజనాలకి పెద్దపీట వెయ్యటం ప్రజాస్వామ్యం మనుగడకి, విజయానికి కీలకం.

పార్టీ సభ్యుల ఆమోదంతోనే ట్రంప్ రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి కాగలిగారు. కానీ ట్రంప్‌ని ప్రశ్నించే శక్తి ఇప్పుడు ఆ పార్టీలో దాదాపు కొరవడింది. ఈ మధ్యంతర ఫలితాల తర్వాత రిపబ్లికన్ పార్టీ తిరిగి తన అంతర్గత ప్రజాస్వామ్యాన్ని సమీక్షించుకోవచ్చు. ట్రంప్ నీడ నుండి పలువురు నేతలు బయటపడి ప్రజాస్వామ్యానికి కీలకమైన హేతుబద్ధతతో వ్యవహరించవచ్చు. ట్రంప్ కూడా ఇది తన చివరి పదవీ అవకాశం కాబట్టి.. పేరుప్రతిష్ఠల కోసమైనా ప్రజాస్వామ్య రాజకీయ సంస్కృతిని పెంపొందించుకుని, అధికారాల విభజనను పాటిస్తారని ఆశించవచ్చు.

ఈ ఎన్నికల్లో ఎటువంటి సాంస్కృతిక పోరాటాలూ లేవు. కేవలం అధ్యక్షుడి వ్యవహారశైలి వల్ల రోజువారీ జీవితంలో కష్టాలు పడుతున్నామన్న అంచనాయే ప్రజల ఓటింగ్ సంళిని మార్చింది. డెమోక్రాటిక్ పార్టీ కూడా ఊహలోకాల్లో వర్గాలుగా చీలిపోయి అంతర్గతపోరుతో సతమతమవుతోంది. ట్రంప్ డెమోక్రాట్లతో కలిసి పనిచేస్తానని చెప్పిన మాటను మన్నించకుండా డెమోక్రాట్లు ఏకపక్షంగా, కక్షపూరితంగా వ్యవహరిస్తే, ఈవేళ రిపబ్లికన్లకు పడిన శిక్ష తర్వాత డెమోక్రాట్లకూ పడవచ్చు. అధ్యక్షుడిపై అభియోగాలకు ఆధారాలుంటే చట్టబద్ధంగా శిక్షించే ఏర్పాటు చేయాలి తప్ప, రాజకీయ వేట ప్రారంభిస్తే డెమోక్రాట్లకి కూడా చేదు అనుభవం ఎదురవుతుంది.

డెమోక్రాటిక్ పార్టీకి, అమెరికన్ రాజకీయానికి ఈ ఎన్నికల ఫలితాలతో ఒక మంచి అవకాశం లభించింది. టెక్సాస్, ఓహయో, ఉత్తర, దక్షిణ కరొలైనాలు ఓహయో, జార్జియా లాంటి రాష్ట్రాలలో రిపబ్లికన్లు బలంగా ఉండేవారు. అలాంటి మితవాద రాష్ట్రాలన్నింటిలోను డెమోక్రాటిక్ పార్టీ ఘన విజయం సాధించింది. టెక్సాస్ అమెరికాలో రెండవ పెద్ద రాష్ట్రం. ఆ రాష్ట్రంలో సెనేట్, గవర్నర్, రాష్ట్ర చట్టసభ – అన్నింటిలో డెమోక్రాట్లు భారీ విజయం సాధించారు. అలాగే ఓహయోలో చాలాకాలం తరువాత సెనేటర్, గవర్నర్ ఎన్నికలలో విజయం సాధించారు.


ఫ్లోరిడా అమెరికాలో మూడవ పెద్ద రాష్ట్రం. ఫ్లోరిడాలో గట్టిగా ప్రచారం చేయకపోయినా, గవర్నరు ఎన్నికలో కేవలం 1.3% ఓట్లతో డెమోక్రాట్లు ఓడారు. అంటే అమెరికన్ ప్రజల ఓటు డెమోక్రాటిక్ పార్టీలో వామపక్ష అతివాదులకు అనుకూలంగా పడలేదు; మధ్యేవాద, మితవాదులకి అనుకూలంగా పడింది. కాబట్టి డెమోక్రాటిక్ పార్టీలో మితవాదులు, మధ్యేమార్గాన్ని అనుసరించే వర్గాల వారు బలపడతారు. డెమోక్రాట్లు తమ పార్టీ బలాన్ని పెంచుకోవాలంటే ఈ మధ్యేవాద రాష్ట్రాలలో ప్రజలని ఆకట్టుకోవాలి. ఈ పరిస్థితి డెమోక్రాటిక్ పార్టీ భవిష్యత్తుకి, అమెరికన్ ప్రజాస్వామ్యానికి మంచి పరిణామం. అతివాదం, మితిమీరిన పక్షపాత ధోరణి, ద్వేష రాజకీయం స్థానంలో మితవాదం, మధ్యేమార్గం, ఇతర వర్గాలతో ఇచ్చిపుచ్చుకునే ధోరణి బలపడే అవకాశం ఉంది.

భారత్ విషయానికొస్తే, తమ 250వ స్వాతంత్ర్య ప్రకటన వార్షికోత్సవ చారిత్రక సంవత్సరంలో అమెరికన్లు ఇచ్చిన తీర్పు వల్ల.. ట్రంప్‌తోపాటు తనకూ స్వదేశంలో ఎదురుదెబ్బ నేపథ్యంలో ఇజ్రాయిల్ అధ్యక్షుడు నెతన్యాహూ పశ్చిమాసియా యుద్ధాల్లో వెనక్కి తగ్గే అవకాశం ఉంది. వీసాల విషయంలో కూడా ఊరట లభించవచ్చు. భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందం త్వరలో కుదరవచ్చు. ఇవన్నీ భారత్‌ని ఆర్థికంగా కొంత ఊపిరిపీల్చుకునేలా చేస్తాయి. డెమోక్రాట్ల గెలుపు వల్ల భారత్‌కి అదనంగా ప్రయోజనాలు లేకున్నా.. మెరుగైన విద్య, అవకాశాల కోసం అమెరికా వెళ్లాలనుకుంటున్న మధ్యతరగతి భారతీయులకు ఈ ఫలితాలు భారీ ఉపశమనం. రిపబ్లికన్ అభ్యర్థుల్ని గెలిపిస్తే 5,000 డాలర్ల చెక్ ఇస్తానని ట్రంప్ హామీ ఇవ్వటం, మస్క్ లేజర్ కిరణాల్లా డబ్బును వెదజల్లటం వంటివి ఉన్నా ప్రజలు తమ రోజువారీ జీవితం, భవిష్యత్తు, అమెరికా గొప్పతనానికి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవటం కోసం ఓటు వేశారు. ట్రంప్ అతివాద దూకుడును సహించబోమని 'మధ్యే మార్గానికి' అమెరికన్లు పట్టం గట్టారు. మన దేశంలోనూ ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు అధికారమే లక్ష్యంగా నిందారోపణలు, హేతుబద్ధతలేని విధానాలు, సాక్ష్యాధారాలులేని ఆరోపణలు వంటివి కొనసాగిస్తే, ఉనికిని కోల్పోవాల్సి వస్తుందని గుర్తించాలి. ప్రజాస్వామ్యంలో ఎంత అద్భుతంగా సోషల్ ఇంజినీరింగ్ చేసి ప్రజల్ని విభజించి ఒకరి మీద ఒకరిని సోషల్ మీడియా ద్వారా ఉసిగొల్పి లబ్ధిపొందాలని చూసినా అది తాత్కాలికమేనని.. పెద్దసంఖ్యలోని తటస్థ ఓటర్లు ఏ పార్టీకీ గుత్తాధిపత్యాన్ని అందించరని ఈ ఎన్నికలు రుజువుచేశాయి. ప్రజాస్వామ్యంలో ప్రజాభిప్రాయం అంతిమం మాత్రమే కాదు.. అది నిరంతరం మారుతూ, దేశాన్ని, సమాజాన్ని మెరుగుపరుస్తుంటుంది. అందుకనుగుణమైన సమ్మిళిత, సుస్థిర ఆర్థికాభివృద్ధికి అభ్యర్థుల ఎంపిక దగ్గర్నుంచి సంస్కరణల్ని అమలు చేస్తేనే ఎంత చరిత్ర ఉన్న పార్టీలు, నేతలకైనా భవిష్యత్తు ఉంటుందని ఈ ఎన్నికలు చాటాయి. ప్రపంచంలో ప్రజాస్వామ్యానికి మాతృక లాంటి అమెరికా, అతిపెద్ద ప్రజాస్వామ్యంగా భారత్ ఎంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలో అమెరికా మధ్యంతర ఎన్నికలలో ప్రజల తీర్పు కీలక సమయంలో మనందరికీ గుర్తుచేసింది. ప్రజాస్వామ్యంలో అపశృతుల్ని ప్రజల తీర్పు ద్వారా సరిచేయవచ్చని, ప్రజలవాణి బ్రహ్మవాక్కని, విశ్వాసాన్ని ఈ తీర్పు బలపరచింది.

✡

తెలంగాణలో ఒక్కో రోగి వికిత్స సగటు వ్యయం ప్రయివేటులో రూ.72,561

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో సగటున 70% మంది రోగులు ప్రయివేటు వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. వీరిలో అత్యధికులు జేబులో నుండి వ్యక్తిగత డబ్బును ఖర్చు చేసేవారే. ఆరోగ్యం రాష్ట్రాల జాబితాలోని అంశమని యూనియన్ ప్రభుత్వం ఒక పరిధి దాటి పట్టించుకోవటం లేదు, రాష్ట్రాలు జాతీయ స్థాయి నుండి వచ్చిన నిధులకు తమ వంతు వాటా ఇవ్వకుండా ప్రాథమిక ఆరోగ్యాన్ని మొక్కుబడిగా, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయేవిగా మార్చాయి. ఈ నేపథ్యంలోనే 2014లో రాష్ట్ర విభజన జరిగిన నాటి నుండి రెండు తెలుగు రాష్ట్రాల్లో పెద్దఎత్తున డాక్టర్ల కొరత కొనసాగుతోంది. మార్కెట్‌లో అవసరానికి మించి అనేక మంది ఎంబీబీఎస్‌లు ఉన్నా, ఖరీదైన వైద్యం అవసరం లేకుండా సామాన్య ప్రజలందరికీ నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ అందేలా వారి సేవలను వినియోగించుకునే విధానాన్ని ప్రభుత్వాలు అమలు చేయలేకపోతున్నాయి. ఇటీవల ప్రజల మీద వ్యక్తిగత వ్యయ భారం తగ్గిందని ప్రభుత్వం చెబుతున్నా.. ప్రపంచ సగటు కంటే కూడా ఇప్పటికీ చాలా ఎక్కువగా ఉందని 2025 అధికారిక గణాంకాలు తెలియచేస్తున్నాయి. తెలంగాణలో అనారోగ్యంతో ఓ వ్యక్తి ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకోవటానికి.. సగటున పడే ఆర్థిక భారం రూ.72,561. ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.5,856. 2025-26లో దేశవ్యాప్తంగా 1,39,732 ఇళ్ల నుండి సేకరించిన వివరాల ఆధారంగా యూనియన్ ప్రభుత్వం 'గృహ సామాజిక వినియోగం - ఆర్థిక సర్వే' పేరుతో నివేదికను ఇటీవల విడుదల చేసింది. తెలంగాణలో 17,233 మందిని సర్వే చేశారు.



తెలంగాణ: వెయ్యిలో 35 మంది ఇన్‌పేషెంట్లు

రాష్ట్రంలో ప్రతి వెయ్యి మందిలో సగటున 35 మంది అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 37 మంది పురుషులు, 32 మంది మహిళలు; పట్టణ ప్రాంతాల్లో 41 మంది పురుషులు, 29 మంది స్త్రీలు ఆస్పత్రులకు వెళ్తున్నారు. నాలుగేళ్లలోపు చిన్నారులు 53 మంది, 60 ఏళ్లు పైబడినవారు 100 మంది ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు.

+ తెలంగాణలో చికిత్సకు సగటున ఒక్కో రోగికి ప్రభుత్వ దవాఖానలో రూ.5856 ఖర్చవుతుండగా.. ప్రయివేటు ఆస్పత్రిలో ఏకంగా రూ.72,561 అవుతోంది. పట్టణాల్లోని ప్రయివేటు ఆస్పత్రుల్లో ఇది మరింత పెరిగి రూ.79,783 ఖర్చవుతోంది. జాతీయ సగటును పరిశీలిస్తే.. ప్రభుత్వాస్పత్రిలో రూ.7042, ప్రయివేటులో రూ.56,343 వ్యయమవుతోంది.

జాతీయ స్థాయిలో..

+ నాలుగేళ్లలోపు చిన్నారుల ఆరోగ్యం కోసం వెచ్చించే ఖర్చు ఎక్కువగా ఉంటోంది. 5-29 ఏళ్ల వయసున్నవారికి తక్కువగా.. 60 ఏళ్లు దాటినవారికి మరీ అధికంగా ఉన్నట్లు తేలింది.

+ రోగ నిర్ధారణ వేగంగా జరుగుతోంది. ఇన్ఫెక్షన్ సంబంధిత జబ్బులు తగ్గుముఖం పడుతున్నాయి. కానీ 30 ఏళ్లు దాటినవారిలో రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బులు వంటి అసాంక్రమిక (ఎన్‌సీడీ) వ్యాధుల ముప్పు పెరుగుతోంది.

తెలంగాణ: ఏ వయసు వారిలో ఎలాంటి జబ్బులు..

+ 14 ఏళ్ల లోపు - ఇన్ఫెక్షన్లు, ఊపిరితిత్తుల సంబంధ వ్యాధులు

+ 15-44 ఏళ్లు - మానసిక, నరాల సంబంధిత, గ్యాస్ట్రో ఇంటెస్టినల్ సమస్యలు





+ 30-44 ఏళ్లు - గుండె, జీవనశైలి వ్యాధులు, కండర సంబంధ వ్యాధుల ముప్పు పెరుగుదల
+ 45-59 ఏళ్లు - గుండె, జీవనశైలి వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం, మోకీళ్ల సమస్య, ఊపిరితిత్తుల వ్యాధులు, ఆస్తమా, తలనొప్పి
+ 60 దాటినవారు - గుండె, అధిక రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్, బ్రెయిన్ స్ట్రోక్, చర్మ ఇన్ఫెక్షన్లు, ఇతర రకాల వ్యాధులు.

ఏపీలో ఆస్పత్రి ఖర్చులకు ఏటా జేబు ఖర్చు రూ.39,000

ప్రజల జేబు ఖర్చు ప్రపంచ సగటు కంటే జాతీయ సగటు ఎక్కువ కాగా, జాతీయ సగటు కంటే ఆంధ్రప్రదేశ్ వ్యయం 15% అదనంగా ఉంది. రాష్ట్రంలో అనారోగ్యంతో ఆస్పత్రులలో చేరిన కుటుంబాలు ఏటా సగటున రూ.39,170 సొంత డబ్బు వెచ్చిస్తున్నాయి. జాతీయ సగటు రూ.34,064. ఈ ఖర్చు ప్రభుత్వ ఆస్పత్రులతో పోలిస్తే ప్రయివేటు ఆస్పత్రుల్లో వెయ్యి శాతం ఎక్కువగా ఉంటోంది. దేశవ్యాప్తంగా 9575 గ్రామాలు, 7945 పట్టణ ప్రాంతాల్లో 6,51,440 మంది నుండి సేకరించిన సమాచారంలో భాగంగా.. ఆంధ్రప్రదేశ్‌లో 21-20% మందికి అనారోగ్య సమస్యలున్నాయి. ఇన్ఫెక్షన్లు, రక్తసంబంధ వ్యాధులు, మధుమేహం, థైరాయిడ్, మానసిక, నరాల సంబంధ వ్యాధులు, కళ్లు, చెవి, గుండె, ఊపిరితిత్తులు, జీర్ణకోశం, చర్మం, కండరాలు, మూత్రం, కిడ్నీలకు సంబంధించిన వ్యాధులు, ప్రసూతి సమస్యలు, గాయాల ఆధారంగా ఆరోగ్య సమస్యలను అంచనా వేశారు. ఏపీలో గ్రామీణ ప్రాంతాల్లో 20.1% మంది, పట్టణ ప్రాంతాల్లో 23%పైన పేర్కొన్న ఆరోగ్య సమస్యల వలయంలో చిక్కుకున్నారు.

+ ఈ సమస్యలతో బాధపడుతున్నవారిలో 26.9% మంది ప్రభుత్వ, 69.9% మంది ప్రయివేటు ఆస్పత్రులలో చేరి చికిత్స పొందుతున్నారు. మిగిలిన 3.2% మంది ట్రస్ట్‌లు, స్వచ్ఛంద సంస్థలు అందించే ఆస్పత్రుల ద్వారా సేవలు పొందారు.
+ ఏడాది కాలంలో రాష్ట్రంలో ప్రతి వెయ్యిమందిలో సగటున 35 మంది పురుషులు, 28 మంది మహిళలు ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ఇలాంటివారిలో గ్రామీణ ప్రాంతాల్లో పురుషులు, పట్టణ ప్రాంతాల్లో మహిళల సంఖ్య ఎక్కువగా ఉంటోంది.
+ రాష్ట్రంలో ఆస్పత్రుల్లో వైద్యం కోసం చేసే వ్యయం సగటున ప్రభుత్వాస్పత్రుల్లో రూ.4,982. ధార్మిక ఆస్పత్రుల్లో రూ.18,259, ప్రయివేటులో రూ.58,077. కలిపి సగటున రూ.42,517 మేర ఉంది. ఇది జాతీయ స్థాయిలో నమోదైన సగటు వ్యయం రూ.37,858 కంటే 12.30% ఎక్కువ.
+ ఒకసారి ఆస్పత్రిలో చేరినవారికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో రూ.4,972, ధార్మిక ఆస్పత్రుల్లో చేరినవారు రూ.18,020, ప్రయివేటు ఆస్పత్రుల్లో చేరినవారు రూ.53,303 సొంత జేబు నుండి ఖర్చుచేయాల్సి వస్తోంది. మొత్తంగా చూస్తే, సగటున సొంత జేబు నుంచి రూ.39,170 చెల్లించాల్సి ఉంటోంది. ఇది జాతీయస్థాయి సగటు సొంత వ్యయం కంటే 15% అధికం.
+ వైద్యం కోసం వ్యక్తిగతంగా ప్రజలు ఖర్చు పెట్టే మొత్తం ఆంధ్రప్రదేశ్‌తో పోలిస్తే.. తెలంగాణ (రూ.46,316), తమిళనాడు (రూ.44,535)ల్లో ఎక్కువ ఉండగా, కర్ణాటక (రూ.37,606), కేరళం (రూ.35,338) తక్కువగా ఉంది.

ఏపీ, భారత్‌లో సగటు ఆస్పత్రి వ్యయం, జేబు నుంచి చెల్లించే మొత్తం (రూ.ల్లో)

ఆస్పత్రి	ఆంధ్రప్రదేశ్		దేశవ్యాప్తంగా	
	మొత్తం ఖర్చు	సొంత వ్యయం	మొత్తం ఖర్చు	సొంత వ్యయం
ప్రభుత్వ ఆస్పత్రులు	4,982	4,972	7,042	6,631
ధార్మిక ఆస్పత్రులు	18,259	18,020	43,732	39,530
ప్రయివేటు ఆస్పత్రులు	59,077	53,303	56,343	50,508
మొత్తం	42,517	39,170	37,858	34,064

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరుతో దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల ప్రక్షాళన 2026లో దేశవ్యాప్తంగా మొదలైంది. అప్పటిదాకా ఎన్నికల సంఘంపై అడపాదడపా మాత్రమే రాజకీయ ఆరోపణలు జరుగుతుండేవి. ప్రజాస్వామ్య ప్రక్రియలో కీలకమైన ఎన్నికలు సక్రమంగా జరుగుతూ, అధికార మార్పిడి శాంతియుతంగా జరుగుతున్న అతిపెద్ద దేశంగా; స్వతంత్రం వచ్చిన నాటి నుండి మహిళలు, కులం, మతం అని తేడా లేకుండా చిట్టచివరి పౌరునికి కూడా సమాన ఓటుహక్కునిచ్చిన తొలిదేశంగా భారత్‌కి ఉన్న గుర్తింపుని కాపాడుతున్న రాజ్యాంగ సంస్థగా ఎన్నికల సంస్థను అన్ని పార్టీలూ గౌరవించేవి. ప్రజల్లోనూ మొత్తంగా ఆ నమ్మకం ఉండేది. ముఖ్యంగా ఎన్నికల కమిషనర్‌గా శేషన్ తెలుస్తుంది. ఆ ఉద్యోగులంతా ఆ రాష్ట్రానికి చెందినవారే. అక్కడ అధికారంలో ఉన్న లేదా ఎన్నికల తర్వాత వచ్చే పార్టీ ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేసేవారే. ఈవీఎంలలో అక్రమాలు జరిగాయని, సర్ ప్రక్రియలో ఉద్దేశపూర్వకంగా భారీసంఖ్యలో ఓట్లు తొలగించారని అనటానికి ఆధారాలు లేవు. సరైన సాక్ష్యాలు, హేతుబద్ధతలేని వాదనలతో అలాంటి ఆరోపణలు చేయటం ప్రజాస్వామ్యానికి ప్రమాదం' అని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు హెచ్చరించారు. దేశంలో మొదటిసారిగా ఓటర్ల జాబితాల ప్రక్షాళన చేసి, ఏ విధంగా ఎప్పటికప్పుడు తాజాపరచాలో ఈసీకి తెలియచేసి అమలుచేయించటంలో కీలకమైన లోక్‌సత్తా రాజకీయ ఉద్యమనేతగా జేపీ ఆ హితవు పలికారు. ఆ తర్వాత పశ్చిమ



పనితీరు, ప్రచారం చూశాక.. ఈసీ ఇంకా కఠినంగా ఎందుకు వ్యవహరించటం లేదు? అని రాజకీయాల పట్ల జుగుప్స ఎక్కువగా ఉండే వారు ఆవేశపడుతుండేవారు. ఈవీఎంలు వచ్చాక ఓడిపోయినవారు వాటిపై ఆరోపణలు చేయటం, వాళ్లే మళ్లీ ఈవీఎంల ద్వారా గెలిచాక మౌనం వహించటం కొంత అనుమానాలను ప్రజల్లో సృష్టించినా మొత్తంగా ఆ ఒడిదుడుకుల్నీ భారత్ అధిగమించగలిగింది. కానీ 'సర్' తర్వాత ఈవీఎంలు, ఈసీపై కలిపి చేస్తున్న ఆరోపణలు అనుమానాన్ని పెనుభూతంగా మారుస్తున్నాయి.

బీహార్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈ ప్రక్రియ చేపట్టటం, ఆ ఎన్నికల్లో అధికార జేడీయూ, బీజేపీ కూటమిని ఓడించాలని ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలు పట్టుదలతో ఉండటం, లక్షల సంఖ్యలో ఓట్లను తొలగించటంతో.. సర్ దేశవ్యాప్త చర్చాంశమైంది. 'ఎన్నికల సంఘమంటే ఎన్నికల సమయంలో కేవలం ప్రధాన కమిషనర్, కమిషనర్లు కాదు.. కోట్ల మంది ప్రభుత్వోద్యోగులు, ఇతర యంత్రాంగం, పార్టీల ఏజంట్లు ఉంటారు. కాబట్టి, ఎక్కడ అవకతవక జరిగినా వెంటనే బెంగాల్, తమిళనాడు, కేరళంలో కూడా ఎన్నికల సమయంలో 'సర్'ను అమలు చేశారు. రాజకీయం పోటాపోటీగా ఉండటంతోపాటు, హింసాత్మకంగా కూడా ఉన్న పశ్చిమ బెంగాల్‌లో మళ్లీ బీహార్ స్థాయి వివాదం రేగింది. కేరళం, తమిళనాడులో పెద్ద ఆ విషయాన్ని పార్టీలూ పట్టించుకోలేదు. జూన్ నుండి తెలుగు రాష్ట్రాల్లో మొదలైంది. సర్ పట్ల వ్యతిరేకత లేకున్నా, కొన్ని అనుమానాలున్న పౌరునిగా, హైదరాబాదీ ఓటరుగా ఆ ప్రక్రియను ప్రత్యక్ష అనుభవం నుండి అంచనా వేసి వాస్తవాలు తెలియచెప్పే ప్రయత్నమిది:

✦ లోక్‌సత్తా ఓటరు జాబితాల్లో అవకతవకల్ని గుర్తించాక, ఎన్నికల సంఘం కొత్తపేర్లు చేర్చటం, చనిపోయిన లేదా చిరునామా మారిన వారిని తొలగించటం ప్రక్షాళనను ఆన్‌లైన్‌లో దాదాపు నిరంతరం కొనసాగిస్తోంది. అయినా ఇప్పుడు 'సర్' ద్వారా ఒక్కో రాష్ట్రంలో లక్షల మంది ఓట్లు తొలగించాల్సి వస్తోందంటే.. మన అధికార యంత్రాంగం ప్రత్యేక కార్యక్రమాల్లో, ఈవెంట్ మేనేజ్‌మెంట్లలో తప్ప రోజువారీ, ఏటా చేయాల్సిన బాధ్యతల్లో అంత సమర్థంగా వ్యవహరించటం లేదు.

+ సర్‌కి ప్రధాన ప్రవంతి మీడియా విస్తృత ప్రచారాన్నివ్వటం ద్వారా తన బాధ్యతను సక్రమంగా నెరవేర్చింది. కానీ ఎన్యూమరేషన్ పత్రాలను నిర్ణీత గడువులోగా పంపిణీ చేయటంలో అధికార యంత్రాంగం విఫలమైంది. ఈ రిపోర్ట్ రచయిత ఉంటున్న ముషీరాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో హైదరాబాద్ మొత్తం మీదే అతితక్కువ ఫారాలు పంపిణీ అయ్యాయి. రాజకీయ నాయకుల కార్యాలయాల్లో ఆ ఫారాల్ని ఇచ్చి, బీఎల్ఓలు కాలక్షేపం చేస్తున్నారని పత్రికల్లో, టీవీల్లో వార్తలు వచ్చాయి. ఈ రచయిత ఈఆర్‌వోకి ఫోన్ చేయటంతో బీఎల్‌వో వచ్చారు. మీడియాలో ఇలాంటి కథనాలు వెలువడటంతో.. ఉన్నతస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలోకి వచ్చి కొద్దిమందిపై చర్యలు తీసుకున్నారు. దీంతో చురుగ్గా పంపిణీ జరిగింది. కానీ ఆ బీఎల్‌వోతో మాట్లాడాక అర్థమైందేమంటే.. సర్ ప్రక్రియలో ఫారాలు నింపటం, అవసరమైన పత్రాలకు సంబంధించిన సమాచారం గురించి వారికి కూడా స్పష్టంగా తెలియదు. దురుద్దేశమైతే లేదు. ఒక చట్టపరమైన ప్రక్రియను ప్రజల్లో సులభంగా అమలు చేసేలా రూపకల్పన చేయకపోవటం వల్ల ఈసీ నివారించదగ్గ విమర్శలు ఎదుర్కొంది. ఒకరకంగా, ఈసీ బాధ్యతల్ని కూడా మీడియా నిర్వహించింది.

✦ బీఎల్‌వో ఇచ్చిన ఫారం చూశాక, అందులో ఓటరుగా పూరించాల్సిన కాలమ్స్ అన్నీ హేతుబద్ధంగానే ఉన్నాయి. 2002లో సర్ సమయంలోని ఓటు వివరాలు అడగటం, ఆధార్, పాత ఓటరు ఐడీలో పేర్ల మధ్య స్వల్ప తేడాలున్నా అభ్యంతరం పెట్టటం వంటివి ఉన్నా.. వాటితో సంబంధం లేకుండా ఎన్యూమరేషన్ ఫారం పూర్తి చేసే వెసులుబాటు ఇచ్చారు. అదేవిధంగా, ఏదైనా అనుమానం ఉంటే, సమర్పించాల్సిన పత్రాల జాబితాలో కూడా వీలైనన్ని ఎక్కువ సర్టిఫికెట్లను అనుమతించే ప్రయత్నం చేశారు. కాబట్టి, ఫారంలో ఎటువంటి సమస్యా లేదు. కానీ ఇది ట్రయల్ అండ్ ఎర్రర్ పద్ధతిలో ఒక సర్టిఫికెట్ లేకుంటే అప్పుడు ఇంకో ధ్రువపత్రం సమర్పించమని చెప్పటం, బీఎల్‌వోలకు సరైన శిక్షణ లేకపోవటం, ఇది ఎన్నికల సమయంలోలా ఈవెంట్ కాకపోవటంతో.. వాళ్లు రోజువారీ పనిలో భాగంగా ఉదాసీనంగా వ్యవహరించారు. కానీ ఈసీ బ్యూరోక్రసీ ధోరణితో వ్యవహరించకుండా వాస్తవ పరిస్థితిని అంచనా వేసినట్లయితే బహుశా.. ఎన్యూమరేన్ పత్రాల జారీకి, పరిశీలనకు మళ్లీ మళ్లీ గడువు పొడిగించాల్సిన అవసరం వచ్చేది కాదు. బీఎల్‌వోలు, ఇతర సిబ్బందికి రెండోసారి శిక్షణ ఇవ్వాల్సి వచ్చేది కాదు.

✦ ఇక అన్నిటికంటే ముఖ్యమైన అంశం– ఈసీ పక్షపాత ధోరణి ప్రదర్శిస్తోందన్న ఆరోపణలు. కాక్రోచ్ జనతా పార్టీ, ఇతర పలు సంఘాలు ఇదే ధోరణితో మాట్లాడుతున్నాయి. 'ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఓటు తొలగిస్తే, ఎన్నికల ప్రధానాధికారిని అభిశంసించాలి' అని సీజేపీ మేనిఫెస్టోలో పేర్కొంది. నిజంగా ఢిల్లీలోని ఎన్నికల ప్రధానాధికారికి అంత శక్తి ఉంటే, హైదరాబాద్‌లో ఇన్ని లోపాలు చోటుచేసుకుంటుంటే, విమర్శలు వస్తుంటే, ఎందుకు రాలేకపోయారు? నిస్సహాయంగా ఎందుకు మౌనం వహించారు? ప్రణాళిక, క్షేత్రస్థాయి సమస్యలు, సాంకేతికతల విషయంలో ఈసీ నుండి కొన్ని పొరపాట్లు ఉండొచ్చుగానీ, పక్షపాతం ఉన్నా ప్రదర్శించలేరు. స్థానిక, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు, పార్టీల ఏజంట్లు తప్ప కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి క్షేత్రస్థాయిలో చేయగలిగిందేమీ లేదు. కాకపోతే, కొన్ని జాగ్రత్తలు, సులభతరం చేసే చర్యలు పైన పేర్కొన్నట్లు తీసుకోవచ్చు. ఈసీపై సర్ విషయంలో విమర్శలు పార్టీ రాజకీయాల కోణంలో చేయటం సముచితం కాదన్నది ఈ రచయిత ప్రత్యక్షంగా గమనించి చెబుతున్నది.

అయిదేళ్లకోసారి 'సర్' మేలు

ఎన్నికలు సమీపంలో లేని సమయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో సర్ ప్రక్రియ జరపటం సరైన నిర్ణయమే అయినా, సాధారణ సమయాల్లో, కొంత ఓపిగ్గా ప్రజలకు వివరించాల్సిన అంశాల్లో మన పాలనా యంత్రాంగం వ్యవహరించేతీరు సమస్యగా మారుతున్నందున.. ప్రభుత్వోద్యోగులు ప్రత్యేక సందర్భాల్లోనే కాకుండా, రోజువారీ విధుల్లోనూ మెరుగైన పనితీరు కనబరిచేలా సంస్కరణలు అవసరం. ఇది కొంత దీర్ఘకాల ప్రక్రియ అని అమెరికాలో 'డోజ్' పరిణామాలు కూడా తెలియచేస్తున్న నేపథ్యంలో.. ఓటర్ల జాబితా సవరణలు నిరంతరం జరిగే ప్రక్రియ అయినప్పటికీ, పాతికేళ్లకోసారికాకుండా జేపీ సూచించినట్లు ప్రతి అయిదేళ్లకోసారి 'సర్' ప్రత్యేక సవరణలు చేయటం మంచిది. అదేవిధంగా, పెద్ద సంక్లిష్టతలు లేకుండా.. సులభంగా ప్రక్రియను, ఎన్యూమరేషన్ ఫారంను రూపొందించటం, బీఎల్‌వోలకు పకడ్బందీ శిక్షణనివ్వటం, పారదర్శకంగా, జవాబుదారీతనంతో వారు వ్యవహరించేలా ఏర్పాట్లు చేయటం, ఎన్నికలు లేని సమయంలో కూడా అవకతవకలకు పాల్పడేవారిపై చర్యలు తీసుకునే అధికారాన్ని ఈసీ రాజ్యాంగం పరిధిలోనే ప్రజాస్వామ్యయుతంగా వినియోగించుకోవటం అవసరం.

✦ భారత రాజ్యవ్యవస్థ సామర్థ్యం బలహీనమైనది. పౌరులు కేంద్రంగా సేవలందించేందుకు తమ పనిముట్లుగా ఉద్యోగులను ఉపయోగించుకునే తీసుకొచ్చే సంస్కరణలకు బదులు, అధికారంలో ఉన్నవారు తమ కేంద్రీకృత పాలనకు, ప్రచార ఆర్భాటానికి అనువుగా ఉద్యోగులను నమ్మినబంట్లుగా తయారుచేయటానికి ప్రాధాన్యతనిస్తున్నారు. ఇలాంటి నేపథ్యంలో, 2002 సర్ గురించి వివరాల్ని, ఫారం 6లో పాత వివరాల పత్రాన్ని జతచేయటం వంటి కాలమ్‌లను తొలగించివుంటే మెరుగ్గా ఉండేది. అదేవిధంగా, ఏఐ సాంకేతికతను 'కేంద్రీకరించకుండా' స్థానికంగా అధికారులకు స్వేచ్ఛనివ్వటం, ఏఐని సర్వరోగనివారణిగా ఆ వివరాల్ని నమ్మకుండా సరిచూసుకోవటం, నోటీసులు అందుకున్న

అర్హులైన ఓటర్లు మళ్లీ ఫారం 6 ద్వారా నమోదవ్వాలనే హాస్యాస్పద నిబంధన లేకుండా(ఇప్పుడు సరిదిద్దుకున్నారు) ఆమోదించటం వంటివి చేసి ఉంటే, ప్రజలకు కూడా ఈ ప్రక్రియ హేతుబద్ధంగా అనిపించి స్వచ్ఛందంగా సహకరించేవారు.

✦ ఒకవేళ ఈసీ పాత వివరాలు కావాలనుకుంటే ఇంత సాంకేతికత ఉన్న కాలంలో డిజి లాకర్లు వంటి వాటితో అనుసంధానించివుంటే సరిపోయేది. ఏఐ ఉపయోగించ గలిగినవారికి ఇంతమాత్రం ప్రజాస్వామిక ఇంగితజ్ఞానం కొరవడితే ప్రజలు అగచాట్లు పడతారు.

✦ ఇన్ని చేసినా, డీమానిటైజేషన్ సమయంలోలా అసంఘటిత రంగంలోని సామాన్యులు పనులు మానుకుని బీఎల్‌వోలు, ఏఈఆర్‌వోల చుట్టూ తిరిగినా.. వారి ఉదాసీనత వల్ల చాలాచోట్ల ప్రజలు పడ్డ తిప్పలు అన్నీఇన్నీ కావు. ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలకు భిన్నంగా, పేదలు ఎక్కువగా ఓటు వేసే అభినందనీయ సంస్కృతి ఉన్న మన దేశంలో.. ఓటరు నమోదు ప్రక్రియ వారికి ఉత్సాహాన్నిచ్చేదిగా ఉండాలి తప్ప, వారిని సైతం ఇబ్బంది పెట్టేది కాకూడదు. దీనికితోడు, ఇదేదో పార్టీల వ్యవహారంలా కొందరు అర్హులైన ఓటర్ల పేరు తొలగించమని వారి తరపున నకిలీ ఫారం 7ను సమర్పించటం వంటివి. ఇవన్నీ నివారించదగ్గ కష్టాలు.

✦ స్థానిక చిరునామాలు ఎక్కువగా తెలిసి ప్రజలందరికీ అందుబాటులో ఉండేవి పోస్టాఫీస్‌లు. అందువల్ల ఓటరు జాబితాల సవరణ, సర్ విషయంలో అనుమానాల ఆరోపణలు లేకుండా ఉండాలంటే.. పోస్టాఫీస్‌లను ఓటరు జాబితాల సవరణ కేంద్రాలుగా మార్చాలన్న లోక్‌సత్తా ప్రతిపాదనను అమలు చేయాలి. ఆన్‌లైన్‌తోపాటు.. ఏడాది పొడవునా పోస్టాఫీస్‌లో మార్పులు, చేర్పులకు అవకాశం ఉంటే, వలస వచ్చినవారు కూడా తాత్కాలికంగా అయినా తాము ఉన్న చోటికే సులభంగా చిరునామా మార్చుకుని ఓటుహక్కు వినియోగించు కోగలు గుతారు. ఎవరు ఎక్కడ ఉంటున్నారో పోస్టల్ అధికార వ్యవస్థకు మెరుగ్గా తెలుస్తుంది. అప్పుడు సర్ లాంటి ప్రక్షాళనలు కూడా పారదర్శకత, జవాబుదారీతనంతో చాలా సాధారణ కార్యక్రమాల్లా జరుగుతాయి.

✦ సర్ వల్ల ఓటింగ్ ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం పెరిగింది. గతంతో పోలిస్తే, ఇటీవల పెద్దసంఖ్యలో ఓట్లు వేయటం మంచి పరిణామం. అనర్హులు, అవసరంలేని ఓట్లను తొలగించటం వల్ల కూడా పోలింగ్ శాతం పెరగటానికి మరో కారణం. ఆన్‌లైన్ ఓటింగ్ విధానాన్ని సైతం పారదర్శకంగా, పక్షపాత రాజకీయ విమర్శలకు అవకాశం ఇవ్వకుండా ప్రవేశ పెడితే, పోలింగ్ శాతం ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఓటరు జాబితాలు సాధ్యమైనంత సక్రమంగా ఉండాలన్న లక్ష్యంతో పాటు.. నిజమైన ఓటర్లు అత్యధిక శాతం ఓట్లు వేయటం ప్రజా స్వామ్యంలో మరింత సానుకూల మార్పులకు దోహదం చేస్తుంది. అదే విధంగా ఈసీ.. ఇప్పటికైనా తన అనాలోచిత, ప్రజల్ని అనవసర ఇబ్బందులకు గురిచేస్తున్న చర్యలను పున స్సమీక్షించుకుని పారదర్శకంగా, వికేంద్రీకృత ప్రక్రియ సక్రమంగా అమలయ్యేలా వ్యవహరించాలి. ఎన్డీయేలోని భాగస్వామ్య పక్షాలు సైతం సూచించినట్లు, అపోహలు, అను మానాలకు ప్రజాసేవాభావంతో, బాధ్యతాయుతంగా జవాబులివ్వాలి. సాఫ్ట్‌వేర్‌లో లోపం ఉంటే సరిదిద్దాలి. ఒక రాజ్యాంగ సంస్థగా ఇది ఈసీ బాధ్యత. 2002 సర్ వివరాలు అవసరమై ఉండవచ్చు, కానీ కాలమ్‌ను ఓటర్లు తేలిగ్గా పూరించగలిగేలా అందుబాటులోని ప్రత్యామ్నాయాల్ని చూపకుండా, ఏఐ పర్యవేక్షణ సాఫ్ట్‌వేర్‌కి అప్పచెబితే, అక్షరం తేడా వచ్చిన వారికీ నోటీసులు వచ్చాయి. అదే ఫారం 6 విషయంలో అనవసర, లేనిపోని నిబంధనలు. తన బాధ్యతల్ని ప్రజలకు నివారించదగ్గ భారంగా మార్చటం ఈసీలాంటి రాజ్యాంగ సంస్థ, ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువులాంటి బాధ్యతలున్న సంస్థ చేయాల్సిన పనికాదు. ఎన్నికలు జరిగిన కొన్ని రాష్ట్రాల్లో అనర్హులుగా, అర్హత నిరూపించు కోవాల్సినవారుగా లక్షల మంది ప్రజలు తమ ఓటుహక్కును కోల్పోగా, ఎన్నికల తీర్పు వెలువడ్డాక వారిలో 90 శాతానికిపైగా తిరిగి అర్హులుగా తేలటం వల్ల ఫలితాలు మారే అవకాశం లేదా?

భారతదేశ ప్రజలని ఎంత తిప్పలు పెడితే, ఎన్ని కాగితాలు తనిఖీ చేస్తుంటే అంత పద్ధతులు పాటిస్తారు, క్రమశిక్షణతో వ్యవ హరిస్తారు అనుకోవటం.. ప్రజాస్వామ్యాన్ని అవమానించటం, దూరదృష్టి లేకుండా వ్యవహరించటం. ప్రజల ఇంగితజ్ఞానాన్ని, బాధ్యతను కించపరిచే ఇదే మాటను.. ఎన్‌జేఏసీలాంటి అద్భుత రాజ్యాంగ సవరణ (99)ని కొట్టివేస్తూ సుప్రీంకోర్టు కూడా స్వయంభులా వల్లించింది. ఈసీ ఏమాత్రం సృజనాత్మకత లేకుండా, మూస పద్ధతిలో వ్యవహరించటాన్ని అభిశంసించాలి అనలేంగానీ, ఆమోదించలేం. సర్ ప్రక్రియను సమర్థించిన సుప్రీంకోర్టు కూడా ఈసీ బ్యూరోక్రాటిక్ అసమర్థ వ్యవహారశైలిపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రశ్నల్ని సంధించాల్సి వచ్చింది.

డిజిటల్ పౌరసత్వ గుర్తింపు కార్డు, ఎన్నికల సంస్కరణలకు 'సర్' దారితీయాలి

సుప్రీంకోర్టు జోక్యం లేకుంటే.. 'సర్' విషయంలో ఈసీ మరింత ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కోవాల్సి వచ్చేది. పశ్చిమ బెంగాల్ లాంటి చోట అత్యున్నత న్యాయస్థాన మాజీ న్యాయమూర్తులు పర్యవేక్షించినా సర్‌లో అవకతవకలు ఉద్దేశపూర్వకంగా జరి గాయని ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమైన ఈ ధోరణికి అవకాశమివ్వకుండా.. ఎన్నికల్లో, పార్టీల్లో తగిన రాజ కీయ సంస్కరణల్ని పోలింగ్ బూత్ బయట తీసుకొచ్చేందుకు రాజకీయ వ్యవస్థ, పౌర సమాజం, మీడియా కృషి చేయాలి. ఎలాగూ ఎన్నికల సమయం కాదు కాబట్టి.. కాస్త ఆలస్యమైనా, తెలంగాణ, ఏపీల్లో సర్ ప్రక్రియను భారత ఎన్నికల వ్యవస్థలో, ఏఐ యుగంలో పౌరసత్వ బాధ్యతలను పటిష్ఠం చేసేరీతిలో నిర్వ హించాలి. ✡

'ప్రజా' మేధావి అనగా ఎవరు?

ఇటీవల కొన్ని యూట్యూబ్ ఛానళ్ల వారు, కొందరు మాజీ సివిల్ సర్వెంట్లు, విశ్లేషకుల పేరుతో ఉన్నవారు తదితరులు ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ్‌పై 'సర్' నేపథ్యంలో ఎన్నికల జాబితాల సవరణ; ఆర్థిక క్రమశిక్షణ, సంక్షేమం-అభివృద్ధి మధ్య సమతూకంతో సమ్మిళిత ఆర్థికాభివృద్ధి వంటి అంశాల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి మద్దతివ్వటం; తెలుగుదేశం, జనసేన, కాంగ్రెస్, బీఆర్ఎస్, టీవీకే, డీఎంకే.. ఇలా పార్టీ ఏదైనా ప్రభుత్వాలకు అంశాలవారీగా మద్దతు లేదా కులగణన వంటి అంశాలపై పరిష్కారంతో కూడిన విమర్శ చేయటంపై వ్యక్తిగత దూషణలతో కొన్ని వీడియోలు విడుదల చేశారు. వారిలో కొందరు గౌరవనీయమైన సీనియర్ జర్నలిస్టులు కూడా ఉండటం విచారకరం. ఎన్నికల సంఘాన్ని ఎంపిక చేసే కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎన్నో ఏళ్ల నుండి సభ్యునిగా ఉంటున్నా తొలగించినప్పుడు జేపీ మాట్లాడలేదు.. వంటి వ్యాఖ్యలతో తననుతానే అపహాస్యం చేసుకునేలా కంటెంట్‌ను ఆ జర్నో చదివివినిపించారు. అయ్యా, సీజేఐ ఎప్పుడూ ఆ కమిటీలో శాశ్వత సభ్యుడు కారు. అదేవిధంగా, ఎన్నికల జాబితాల ప్రక్షాళనకు ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో అధ్యయనం ద్వారా ఈసీకి మార్గదర్శనం చేసిందే లోక్‌సత్తా అని ఆయన మర్చిపోయారు. ఎన్నికల వ్యవస్థని సంస్కరించి దామాషా పద్ధతి తేవటంపై లోక్‌సత్తా చేసిన కృషి గురించి ఏ పార్టీని అడిగినా చెబుతారు, కానీ తెలియనట్లు ఆ జర్నలిస్టు మాట్లాడారు. రెండో పరిపాలనా సంస్కరణల సంఘంలో, ఎన్ఏసీలో జేపీ నివేదికల గురించి అవగాహన ఏమాత్రం లేదని అర్థమవుతోంది. ఇక 'కులగణనకి, రిజర్వేషన్లకి సంబంధం లేదు. సర్ విషయంలోనూ సీఈసీ జ్ఞానేష్ కుమార్ మూర్ఖత్వం, తొందరపాటు ఉంది తప్ప, ఉద్దేశపూర్వకంగా తప్పులు చేశారనటానికి ఆధారాలు లేవు, కోటి మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు చేసే పనిలో ఒక్క ఈసీ పక్షపాతంతో చేయగలిగిందేమీ ఉండదు' అని జేపీ చెప్పారు తప్ప.. ఎవరినీ సమర్థించలేదు, విమర్శించలేదు. ఓడిపోయినప్పుడు ఈవీఎంల విషయంలో చంద్రబాబు, జయలలిత, కెప్టెన్ అమరీందర్‌సింగ్ వంటివారు ఆరోపణలు చేసినప్పుడూ జేపీ ఇదే మాట చెప్పారు. 'మనిషి సృష్టించిన ఏ యంత్రాన్నయినా ట్యాంపర్ చేయొచ్చు, కానీ అందుకు అవకాశంలేని పరిస్థితులున్నాయా, లేదా అన్నది మనం చూడాలి. లోపాలుంటే సరిదిద్దుకోవాలి, ప్రత్యామ్నాయాలు పరిశీలించాలి. అంతేతప్ప, ఆధారాలు చూపకుండా రాజ్యాంగ సంస్థల మీద ఆరోపణలు చేయటం ప్రజా స్వామ్యానికి, ఇంత వైవిధ్య భరితమైన, పేదరికం, నాణ్యతలేని విద్య ఉన్న భారత్ లాంటి దేశంలో ప్రమాదం' అని హెచ్చరించారు. ఆ తర్వాత అదే ఈవీఎంల ద్వారా గెలిచాక ఆ నేతలే మాట సవరించుకున్నారు. అసంబద్ధ విమర్శలను మనం స్వీకరించనప్పుడు ఎవరి తిట్లు వారికే చెందుతాయి కాబట్టి.. అంబేద్కర్ పేరుతో పదవుల్లోకొచ్చి,

"ఎన్నికల వ్యవస్థని సంస్కరించి దామాషా పద్ధతి తేవటంపై లోక్‌సత్తా చేసిన కృషి గురించి ఏ పార్టీని అడిగినా చెబుతారు, కానీ తెలియనట్లు ఆ జర్నలిస్టు మాట్లాడారు. రెండో పరిపాలనా సంస్కరణల సంఘంలో, ఎన్ఏసీలో జేపీ నివేదికల గురించి అవగాహన ఏమాత్రం లేదని అర్థమవుతోంది. ఇక 'కులగణనకి, రిజర్వేషన్లకి సంబంధం లేదు. సర్ విషయంలోనూ సీఈసీ జ్ఞానేష్ కుమార్ మూర్ఖత్వం, తొందరపాటు ఉంది తప్ప, ఉద్దేశపూర్వకంగా తప్పులు చేశారనటానికి ఆధారాలు లేవు, కోటి మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు చేసే పనిలో ఒక్క ఈసీ పక్షపాతంతో చేయగలిగిందేమీ ఉండదు' అని జేపీ చెప్పారు తప్ప.. ఎవరినీ సమర్థించలేదు, విమర్శించలేదు.

ఆ తర్వాత సమాజంలో పెత్తనం చెలాయిస్తూ థంబ్‌నెయిల్ చూసి అంబేద్కర్‌నే అవమానించే రీతిలో స్పందించే స్థాయి వారి గురించి ప్రత్యేకించి మాట్లాడనక్కర్లేదు. ఫోర్త్ ఎస్టేట్‌గా ప్రజల క్షేమం కోసం పనిచేయాల్సి ఉన్నా జేపీతో ఇంటర్వ్యూలు చేయనన్న సీనియర్ జర్నలిస్టు పట్ల ఇంకా గౌరవం ఉంది కాబట్టి.. ఆయన నిజాలు తెలుసుకోవాలని కోరుకుందాం. 'మేధావి ముసుగు తొలగింది' అంటూ అంతకుముందు కొన్ని ఛానళ్లలోనూ కొందరు వ్యాఖ్యానించారు. ఇంకొకాయన ఐఏఎస్ అధికారిగా ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా చేశారట. 'సంస్కర్త అంటే త్రిపురనేని రామస్వామి, జేపీ లాంటి వారిని పైనుండి ఎవరో రుద్దారు' అని ఓ ఛానల్‌లో చెప్పారు. సామాజిక సంస్కర్తకి - రాజకీయ, ఎన్నికల, పాలనా, ఆర్థిక సంస్కర్తకి తేడా ఓ రిటైర్డ్ ఐఏఎస్‌కి తెలియకపోవటం విచారకరం. సామాజిక సంస్కరణ రాజకీయ, పాలనా, ఆర్థిక సంస్కరణల్ని వేగవంతం చేయొచ్చుగానీ, వాటితో సరితూగదు. ఈ అంశాన్ని ఇటీవల లోక్‌సత్తా 30వ ఆవిర్భావ సమీక్షలో కూడా జేపీ తెలిపారు. రాజకీయ, పాలనా, ఆర్థిక ప్రజాస్వామ్య సంస్కరణల ద్వారా మార్పు కోసం చేసే కృషి చేయటం ద్వారా మార్పు కాస్త నెమ్మదిగా వచ్చినా సంపూర్ణంగా వస్తుంది కాబట్టి.. సామాజిక

సంస్కరణ పని ఇతర సమాజహితులకు అప్పచెప్పి, మనం రాజకీయ కృషికే పరిమితమవ్వాలని ఉద్దేశపూర్వకంగా నిర్ణయం తీసు కున్నామని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. వారందరి విమర్శలు, తిట్లు పట్ల స్పందించే ఉద్దేశం లేదు గానీ.. ప్రజా మేధావి, సంస్కర్త అనగా ఎవరు? అనే విషయం కొంత ప్రజాజీవితంలో, రాజకీయ, మీడియా వ్యవస్థల్లో చర్చనీ యాంశం కావటం అవసరం అనిపించింది. అందుకోసం ఈ వ్యాసం.

కొన్ని నెలల క్రితం ఒక డిజిటల్ మీడియా సంస్థ విజయవాడలో ఏర్పాటు చేసిన కాంక్లేవ్‌లో ఇంద్రకీలాద్రి ప్రాంతవాసుల్లోని పలువురిలో కరడుగట్టిన కులతత్వంపై జయప్రకాష్ నారాయణ్ కొంత మందలింపు ధోరణితో మాట్లాడారు. దీనిపై ఆత్మవిమర్శ చేసుకోండి తప్ప నొచ్చుకోవద్దని కూడా అదేసమయంలో విజ్ఞప్తి చేశారు. అయినా కొందరు జేపీ చేసిన వ్యాఖ్యలపై వ్యక్తిగతంగా, బహిరంగంగానూ విమర్శలు చేశారు. ఒక పెద్దమనిషి ఓ వీడియో ఛానల్‌కి ఈ అంశం మీద సుదీర్ఘ ఇంటర్వ్యూ ఇచ్చి.. 'జేపీ గురించి మాట్లాడవద్దు అనుకున్న విషయాలు మాట్లాడుతున్నాను' అని కులం కామెంట్‌పై తీవ్ర విమర్శలు చేశారు. అలాంటి విమర్శలు విజయవాడవాసుల నుండి తరచూ రావటం, సదరు వీడియోలో జేపీపై విమర్శలు చేసిన వ్యక్తి అవగాహనారాహిత్యంతో చేసినా కొంత నిజాయతీతో కూడిన ఆవేదన ఉండటం, ఈ మొత్తంలో ప్రజలకు తెలియాల్సిన కొన్ని విషయాలు ఉండటంతో 'జనబలం'లో అప్పట్లోనే ఒక వ్యాసాన్ని సవివర సమాధానంగా ప్రచురించాం.

దీని తర్వాత మరొకాయన ఇదే తరహాలో జేపీ ప్రసంగం మీద వీడియో చేశారు. ఒక జర్నలిస్టుగా, వ్యాపారవేత్తగా బాగా పేరొందిన సదరు వ్యక్తి ఆర్.ఎస్.ఎస్ వందేళ్ల ప్రస్థానం కార్యక్రమంలో జేపీ ప్రశంసల్ని లక్ష్యం గావించుకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వంలో వారికున్న పలుకుబడి ద్వారా కొన్ని రాజకీయ సంస్కరణలు సాధించా లనుకున్న జేపీని బద్నాం చేయాలనుకున్నారు. అందుకోసం కొన్ని విమర్శలు చేశారు. అయితే అవి విశ్లేషణపరంగా అపరిపక్వమైనవి, వాస్తవాలపరంగా అసత్యాలు. ఉదా హరణకి, అవినీతి, కులతత్వం సహా ఓ 30 ప్రజాసమస్యల్ని తీసుకుంటే.. వాటిలో ఏ సమస్య గురించీ జేపీ మాట్లాడ లేదట. 1999లో రాజకీయ నాయకుల నేరచరిత్రుల వివరాలు వెల్లడించటం నేపథ్యంలో ఎన్నికల్లో అభ్యర్థులు తమ ఆస్తిపాస్తులను కూడా ప్రకటించాలనే చట్టం తేవటం దగ్గర్నుంచి దేశంలో అతిపెద్ద అవినీతి కుంభకోణంగా పేరుమోసిన 2జీ స్పెక్ట్రమ్ కేసు సహా అవినీతిపై లోక్‌సత్తా పోరాటం ఏమిటో చెప్పటం చర్వితచరణంలా అనిపిస్తుంది. కులం గురించి అంతకుముందు విజయవాడవాసి చేసిన వీడియోయే నిదర్శనం.

జర్నలిస్టు-వ్యాపార-ఆధ్యాత్మికవేత్త ఆరోపణల్లోని ఇంకో ఉదాహరణ. ఎన్.టి రామారావుపై చంద్రబాబు నేతృత్వంలో తెలుగుదేశంలో కొందరు తిరుగుబాటు చేసినప్పుడు మనస్తాపానికి గురై నిమ్స్ ఆస్పత్రిలో చేరిన రామారావు చేత బలవంతంగా సంతకం జేపీ తీసుకున్నారని చెప్పారు. ఆ సమయంలో ఈ వ్యాస రచయిత కూడా హైదరాబాద్‌లో, మీడియాలోనే ఉన్నారు. ఏ సీనియర్, ఇన్‌ఫ్లుయెన్షియల్ జర్నలిస్టూ ఈ మాట చెప్పలేదు. ఎన్.టి.ఆర్ చివరి ఇంటర్వ్యూ తీసుకున్నవారు కూడా. ఆ సమయంలో గవర్నర్ స్వయంగా నిమ్స్‌కి వెళ్లిన సంగతి అందరికీ తెలుసు. ఇక ప్రొటోకాల్ ప్రకారం ఐఏఎస్ అధికారి హోదాలో జేపీ ఏం చేశారో మనం అడగకూడదు, వారూ చెప్పకూడదు. అయితే ప్రజాజీవితానికి, విధానాలకు సంబంధించి ఎంతైనా తరచి అడగవచ్చు. అదేవిధంగా, ఎన్.టి.ఆర్ పదవి నుండి దిగిపోయాక కూడా అందరి కంటే ఎక్కువగా జేపీనే అభిమానించేవారు. సంక్షోభాన్ని చల్లార్చేందుకు జేపీ చాలా కష్టపడ్డారని లక్ష్మీపార్వతి స్వయంగా ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈ విషయాలేవీ ఆ వీడియో జర్నలిస్టుకి కనీసంగా కూడా తెలియకపోవటంతో.. చెప్పేవాడికి వినేవాడు లోకువ, వినేవాడికి చూసేవాడు లోకువ అన్నట్లు తయారైంది పరిస్థితి.

మేధావి అనే పదం ప్రామాణిక సంస్కృత భాష నుండి ఆవిర్భవించింది. రుగ్వేద కాలం నుండి ఈ పదం వస్తోంది. తెలుగు సహా సుమారు 16 భాషలలో వాడుకలో ఉంది. మేధావికి తొలినాటి, అంటే, వేల ఏళ్లనాటి అర్థానికి.. ప్రస్తుత అర్థానికి కొంత తేడా ఉంది. పదాలు పూర్తి అర్థాన్ని కోల్పోకపోయినా, కొంత దిద్దుబాటుకు గురవటం (సెమాంటిక్ ఛేంజ్) ప్రతి భాషలో సాధారణం. అలా మేధావికి పూర్వకాలంనాటి అర్థం -- తెలివి, గ్రహించే శక్తి, సహజాత సామర్థ్యం, వివేచనతో, విజ్ఞతతో ఆలోచించే శక్తి, దీర్ఘకాలిక దృక్పథం కలగలసిన వ్యక్తి అని. తర్వాతి దశలో సహజాతం, వివేచన తగ్గాయి. ప్రస్తుత దశలో మేధావి అంటే, చాలామేర పరీక్షల్లో ఉన్నత ర్యాంకులు సాధించేవారు, వ్యాపారాల్లో లాభాలు ఆర్జించేవారు, సాంకేతికత వినియోగంలో అగ్రగణ్యులు, ఆటల్లో కొత్త ఎత్తుగడలతో ప్రత్యర్థులను చిత్తుచేసేవారు వంటివారు. వీటిల్లో కొంతమేర సాంకేతికతను మినహాయిస్తే మిగతా అన్ని లక్షణాలూ రుగ్వేద కాలం నాటి నుండి నేటి వరకూ ఉన్నవ్యక్తి డాక్టర్ జేపీ. సాంకేతికత పెద్ద విషయం కాదు. అదే అర్హతయితే, 80 శాతం మందికిపైగా మేధావులు కావాలి. కోడింగ్ అంటే ఏమిటో తెలియకుండా ప్రపంచస్థాయి ఐటీ కంపెనీల్ని నిర్మించిన సీఈఓల ఉదాహరణలు కోకొల్లలు. ఇది సాంకేతికత విలువను తగ్గించటం కాదు. ఆ విద్యను ఎవరైనా నేర్చుకోవచ్చు అని తెలియచెప్పటం వరకే. ఇక జేపీ మేధావి కారు అనే వ్యాఖ్యానం తప్పు అని తేలాక, ఇంకో కామెంట్.. జేపీ అమాయకులు అని. ఒకప్పుడు, వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉండవల్లి అరుణ్ కుమార్ గారు రాజకీయాంశాలతో 'ఈవారం' పేరుతో ఓ వారపత్రిక నడిపారు. అందులో లోక్‌సత్తాను నిశితంగా అనుసరించ టానికి ప్రత్యేకించి ఒక రిపోర్టర్‌ని ప్రత్యేకించి కేటాయిం చారు. లోక్‌సత్తా పైకి నీతులు చెప్పటం తప్ప, ఆచరణలో ఆ భావజాలం సాధ్యం కాదు అని చెప్పటం యాజమాన్యం ఉద్దేశ్యమేమో తెలియదు. అందులో చివరి పేజీ

ఈ రచయితకి జర్నలిజం గురువుగా పనిచేసిన ఒక వ్యంగ్య కవి రాసేవారు. ఆయన్ని కొందరు సీనియర్ ఎడిటర్లు చో రామస్వామి (తుగ్లక్), బుచ్‌వాల్డ్‌తో పోల్చిన సంద ర్భాలున్నాయి. ఆయన ఆ పేజీయే రాసేవారు. ఆ వారం ఈవారంలో జేపీ గురించి కాలమ్ రాశారు. అందులో నాకు గుర్తుండిపోయేలా చెప్పిన రెండు భావాలు -- జేపీ ఒక అమాయక బాలుడు. రెండు, లోక్‌సత్తాను ఒక రాజకీయ పార్టీగా మార్చటం వల్ల ఆయనకు మరే ఐఏఎస్ అధికారికీ లేని పేరుప్రఖ్యాతులు వచ్చాయి. ఇక్కడ రెండోది అప్రస్తుతం కాబట్టి మరో సందర్భంలో మాట్లాడుకుందాం. అమాయక బాలుడు అనే పదం పైన పేర్కొన్న వీడియో ఇంటర్వ్యూలోని జర్నలిస్టు కూడా మేధావి అన్న పదానికి వ్యతిరేకంగా ఉపయోగించారు కాబట్టి.. ఆ అంశానికి పరిమితమవుదాం. జేపీపై ఒక తిట్టులాగా లేదా వ్యంగ్య బాణంలా ఆ పదాన్ని ప్రయోగించానని సదరు జర్నలిస్టు అనుకొని ఉండవచ్చుగానీ, ఇందులో ఏ విధమైన శ్లేషార్థాలకూ అవకాశం లేదు. ఎందుకంటే, తన మనసులో తాను గ్రామంలో 5వ తరగతి చదువుతూ, ఒక పూరిపాకలోని స్కూలుకు వెళు తున్న పిల్లవాడిగానే ఉంటానని జేపీయే తరచూ చెబుతుంటారు. అదీగాక, గొప్ప మేధస్సు, అమాయకత్వం కలగలసి ఉంటాయని గాంధీ బోసినవ్వులు, ఐన్‌స్టీన్ హెయిర్ స్టయిల్ వంటివి తెలియచేస్తుంటాయి. 'రుషి రూపంలో ఉన్న పసిబాలుడు' అని గాంధీ గురించి బ్రిటిష్ వారు 'ప్రాచ్య దేశాల జిత్తులమారి నక్క' అని అభివర్ణించిన రాజగోపాలాచారి అంటుండేవారు. కాబట్టి, స్వచ్ఛతతో కూడిన మేధస్సు మరింత పదునుగా ఉంటుంది. ఇక ఒక సంశయ లాభాన్ని (బెనిఫిట్ ఆఫ్ డౌట్)ను వీడియోలో ఇంటర్వ్యూ ఇచ్చిన జర్నలిస్టుకే ఇద్దాం. మొదటి ప్రయత్నంలోనే, ప్రత్యేక శిక్షణ లేకుండానే ఎంబీబీఎస్, ఐఏఎస్‌కు ఎంపికై, బ్రహ్మాండంగా పేరు తెచ్చుకోవటమే కాకుండా.. స్వతంత్ర భారత చరిత్రలో ఏ అధికారికీ లేని గుర్తింపు సాధించిన జేపీ రాజకీయాల్లో మాత్రం మేధావి కాదు అనే ఉద్దేశంతో బహుశా వారు విమర్శ చేసి ఉండవచ్చు. అదీ పరిశీలిద్దాం.

వీడియో ఇంటర్వ్యూలో ఆ వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టు గతంలో ఒక పత్రిక నడిపారు. పలు సంచలన కథనాలు వెలువరించారు. అందుకు వారు గౌరవానికి అర్హులు. చాట్ జీపీటీ, జెమినై సిరీస్, గ్రోక్ వంటి కృత్రిమ మేధ (ఏఐ) వచ్చాక, ఆ కోణానికి కూడా ప్రాధాన్యత తగ్గింది. ఇక డేటా గురించి చెప్పనక్కర్లేదు. ఏఐ కావలసినంత సరఫరా చేస్తుంది. ఒకప్పుడు పరిశోధిస్తే తప్ప తేలని గణాంకాలు ఈవేళ అలా స్క్రోల్ అవుతున్నాయి ఏఐ ప్రోగ్రామ్‌లలో. ఏఐ మాత్రమే కాదు, గూగుల్ వంటి సెర్చి ఇంజిన్లు కూడా లేనిరోజుల్లో జేపీ లోక్‌సత్తా ఉద్యమాన్ని ప్రారంభించి భావజాలాన్ని అందించారు. ప్రపంచ దేశాల అనుభవాలను, భారతదేశంలో పరిణామాలను అధ్యయనం చేసి అలా అందించటం ఆ కాలంలో ఎంత కష్టమైన పనో వేరే చెప్ప నక్కర్లేదు. అది అసాధారణ అధ్యయనం. కొన్ని పుస్తకాల్ని దేటా, ఇతన వివరాల కోసం లండన్ తదితర విదేశాల నుండి కూడా

గూగుల్ వంటి సెర్చి ఇంజిన్లు కూడా లేనిరోజుల్లో జేపీ లోక్‌సత్తా ఉద్యమాన్ని ప్రారంభించి భావజాలాన్ని అందించారు. ప్రపంచ దేశాల అనుభవాలను, భారతదేశంలో పరిణామాలను అధ్యయనం చేసి అలా అందించటం ఆ కాలంలో ఎంత కష్టమైన పనో వేరే చెప్ప నక్కర్లేదు. అది అసాధారణ అధ్యయనం. కొన్ని పుస్తకాల్ని దేటా, ఇతన వివరాల కోసం లండన్ తదితర విదేశాల నుండి కూడా తెప్పించుకోవాల్సి వచ్చేది. ఈవేళ పరి శోధకులు చేసే కృషిని కూడా నిమిషాల్లో అందిస్తున్న ఏఐ వచ్చాక సైతం ఆ మౌలిక భావాల్లో జేపీలో ఎటువంటి మార్పూ లేదు. అంటే, అంత స్పష్టతను సాంకేతికతతో సంబంధం లేకుండానే సాధించగలిగారు.

ఇక అన్నిటికంటే ముఖ్యమైన అంశం, అత్యాధునిక ఏఐ కూడా చేయలేని అంశం.. పబ్లిక్ పాలసీ తయారుచేయటం. పూర్తి డేటా, వనరులు, సాంకేతికత, తగినంత వ్యవధి, సౌకర్యాలూ ఉన్నా కూడా.. ప్రభుత్వాలు, ఆలోచనాపరులు, చాలా పౌర సమాజ సంస్థలు, నేతలు, రాజకీయ పార్టీలు, చివరికి మీడియాలో సైతం పలువురు చేయలేని పని– వాటన్నిటినీ ఉపయోగించి ఒక విధాన నిర్ణయాన్ని (పబ్లిక్ పాలసీ) రూపొందించటం. రాజ్యాంగ విరుద్ధం కాకుండా, చట్టం పరిధిలో, పరిమిత వనరుల్లో అపరిమిత అవసరాల్ని తీర్చేలా, వివిధ వర్గాల ప్రయోజనాల్ని సమన్వయం చేసేలా, సమాజం సులభంగా అమలు గావించేలా ఒక రాజకీయ విధానాన్ని రూపొందించటం ఎందుకు సాధ్యం కావటం లేదు? కనీసం ఒక రాజ్యాంగ సవరణను తప్పులు లేకుండా డ్రాఫ్ట్ చేయటం ఈవేళ 146 కోట్ల జనాభా ఉన్న దేశంలో సాధ్యం కావటం లేదు. ఆ పనిని జేపీ అద్భుతంగా నెరవేర్చారు. ఈవేళ్టి అవసరాల్ని– భవిష్యత్తు తరాల ప్రయోజనాల్నీ సమన్వయం చేస్తూ ఆచరణసాధ్య విధానాల్ని రూపొందించి, వాటిలో కొన్నిటిని ఒక్క ఎంపీ కూడా లేకుండా సాధించారు. నాలుగు రాజ్యాంగ సవరణల్ని అలా సాధించటం సామాన్యమైన విషయం కాదు. అదేవిధంగా, ప్రధానమంత్రి జాతీయ సలహా మండలి (ఎన్ఏసీ)లో, రెండో పరిపాలనా సంస్కరణల సంఘం (ఏ.ఆర్.సీ)లో మేధావి కాకుండానే సభ్యులయ్యారా? ఇప్పటికీ అమలవుతున్న జాతీయ ఆరోగ్య మిషన్‌ని 2005లో మేధావి కాకుండానే రూపొందించారా? భారతదేశంలో అత్యున్నత

న్యాయ వాదులు సైతం ఎవరి దర్శనం కోసం లక్షల విలువైన సమ యాన్ని సైతం వెచ్చిస్తారో, ఎవరి పేరును గత కొన్ని దశాబ్దాలలో విలువలకు నిదర్శనంగా పేర్కొంటారో.. అటువంటి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వెంకటాచలయ్య హాజరై అభినందించిన ఒకే ఒక్క రాజకీయ సమావేశం లోక్‌సత్తా పార్టీది. మరో ఇద్దరు సుప్రసిద్ధ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేఎస్ వర్మ (మాజీ సీజేఐ), జస్టిస్ కృష్ణ అయ్యర్‌ల ద్వారా ఎంతో ప్రయత్నం చేసి జేపీ రూపొందించిన జాతీయ జ్యుడీషియల్ అపాయింట్ మెంట్స్ కమిషన్ (ఎన్.జె.ఎ.సి)ని పార్లమెంటు దాదాపు ఏకగ్రీవంగా ఆమోదించిందంటే, జేపీ రూపొందించిన లోక్‌పాల్ బిల్లును ప్రధాని పార్లమెంట్‌లో ప్రస్తావించగా ప్రభుత్వం అలాగే చట్టం చేసిందంటే.. మేధస్సు లేకుండా సాధ్యమవుతాయా? గవర్నర్ సంతకం లేకుండా బిల్లుల ఆమోదించినట్లుగా భావించాలని సుప్రీంకోర్టు ధర్మాసనం 2025లో తీర్పు ఇచ్చినప్పుడే అది రాజ్యాంగ విరుద్ధం అని జేపీ తెలిపారు. చివరికి కొన్ని నెలల తర్వాత సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఆ తప్పును సరిదిద్దుకుంది.

ఇక ఇంకో బెనిఫిట్ ఆఫ్ డౌట్ కూడా ఆ జర్నలిస్టుకే ఇద్దాం. రాజకీయాల్ని, ఎన్నికల రాజకీయాల్ని వేరు చేసి చూద్దాం. అలాంటి మేధావి జేపీ తన పార్టీని ఎన్నికల్లో ఎందుకు గెలిపించలేకపోయారో పరిశీలిద్దాం.

జేపీకున్న మేధావి లక్షణాలన్నీ ఒక తత్వవేత్తకుండే లక్షణాలుగా చాలామేర భావించవచ్చు. రాచరిక కాలంలోనే ప్లేటో 'రిపబ్లిక్' అనే పుస్తకం రాశారు. చాలామందికి తెలుసు. అందులో ఆయన -- 'రాజు తత్వవేత్త కావాలి లేదా తత్వవేత్త రాజు కావాలి. అప్పుడే ప్రజలకు మంచి పాలన అందుతుంది' అని రాశారు. కానీ తర్వాతికాలంలో తత్వవేత్త రాజయినా ఆయన మాట ప్రజలు వినరు, అంతేకాదు రాజయ్యాక తత్వవేత్త సర్వాధికారాల వల్ల నిరంకుశుడిగా మారిపోవచ్చు అని కొన్ని ఘటనల నేపథ్యంలో సందేహించి 'చట్టాలు' అని మరో పుస్తకం రాశారు. ఇది చాలా తక్కువమందికి పరిచయం. రాచరికంలో లేదా ఓ నగరానికి పరిమితమైన స్థాయి ప్రజాస్వామ్యంలోనే ఒక మేధావికి అన్ని నియంత్రణలుండేవి. మరి అనేక నగరాలు, మహానగరాలు, పట్టణాలు, ఆరు లక్షల గ్రామాలు, ఆవాస ప్రాంతాలతో సువిశాల దేశ ప్రజాస్వామ్యంలో పరిస్థితి ఏమిటి? ఇదేమీ ఒలింపిక్స్ పోటీ కాదు. ఒక వ్యక్తి కష్టపడి అద్భుత ప్రతిభతో నెగ్గటానికి. మరి ప్రజాస్వామ్యంలో మేధావులు గెలవలేదా? ఇప్పుడు అసలైన ప్రశ్న.

ఇక్కడ సింగపూర్‌ని ఉదాహరణగా చూద్దాం. అమెరికా అధ్యక్షుడిగా జార్జి డబ్ల్యూ బుష్ సీనియర్ ఉన్నప్పుడు ఒకాయన అడిగారట. మీ అభిమాన నాయకుడు ఎవరు? అని. లీ క్వాన్ యూ అని ఆయన తడుముకోకుండా చెప్పారట. సింగపూర్ నిర్మాత లీ. సునిశిత మేధస్సుకి ప్రతీక. ఒకప్పుడు తాగటానికి మంచినీరు కూడా లేని, మురుగు పారుతుండే చిన్న గ్రామాన్ని ప్రపంచంలో ఒక ఆదర్శప్రాయ దేశంగా, ఏ దేశం వారైనా వచ్చి

విమర్శ స్వీకరణ

బుద్ధ భగవానుడు ఓ మర్రిచెట్టు కింద కూర్చుని ఉన్నాడు. కోపంగా ఉన్న ఓ వ్యక్తి ఆయన దగ్గరకు వచ్చి అసభ్యంగా తిట్టటం మొదలుపెట్టాడు.

బుద్ధుడు తనను తిరిగి తిడతాడని భావించాడా వ్యక్తి. కానీ బుద్ధుడి కవళికల్లో వీసమెత్తు మార్పు అయినా లేకపోవటం చూసి ఆశ్చర్యపోయాడు.

అంతేకాదు, అతని ఆగ్రహం పెరిగిపోయింది. మరింత భయంకరంగా తిట్లు లంకించుకున్నాడు.

ఎంత తిట్టినా బుద్ధుడిలో అసలు స్పందనే లేదు. తిట్టి తిట్టి అలసిపోయిన ఆ వ్యక్తి బుద్ధుడినే అడిగాడు. 'నేను నిన్ను అంత దారుణంగా తిట్టాను కదా... నీకసలు కోపమే రాలేదే. నీకు బాధ కలగలేదా?'.

బుద్ధుడు ప్రశాంతంగా బదులిచ్చాడు. 'సోదరా, నీ తిట్లలో ఒక్కటి కూడా నేను స్వీకరించలేదు'.

'కానీ వాటిని నువ్వు విన్నావు కదా' బలహీన స్వరంతో ప్రశ్నించాడా వ్యక్తి.

'నాకు అవసరమే లేని తిట్లను నేను వినాల్సిన అవసరమేముంది?'

ఆ జవాబుతో ఆ వ్యక్తి అయోమయంలో పడిపోయాడు. బుద్ధుడు ప్రశాంతంగా ఇస్తున్న జవాబు అతనికి అర్థమే కాలేదు.

చిరాకుగా ఉన్న ఆ వ్యక్తి ముఖాన్ని చూసి బుద్ధుడు వివరించాడు...

'నీ తిట్లన్నీ నీ దగ్గరే ఉండిపోయాయి'.

'అదెలా? నేను తిట్టినది నిన్నే' ఆ వ్యక్తి గింజుకున్నాడు.

'కావచ్చు కానీ, వాటిలో ఒక్క తిట్టుని కూడా నేను తీసుకోను. నువ్వు ఎవరికైనా కొన్ని డబ్బులిచ్చావనుకో, కానీ వాటిని వాళ్లు తీసుకోలేదనుకో, అప్పుడవి ఎవరి దగ్గర ఉంటాయి?'

'నేను డబ్బులిచ్చిన వ్యక్తి వాటిని తీసుకోకపోతే సహజంగా అవి నా దగ్గరే ఉండిపోతాయి'.

అర్థవంతంగా నవ్వాడు బుద్ధుడు. 'సరిగ్గా చెప్పావు. ఇప్పుడు నీ తిట్ల విషయంలోనూ జరిగినది అదే. నువ్వు వచ్చావు. నీ నోటికి వచ్చిన తిట్లన్నీ తిట్టావు. కానీ వాటిలో ఒక్కటి కూడా నేను తీసుకోలేదు. కాబట్టి అవన్నీ నీ దగ్గరే ఉండిపోయాయి. అలాంటప్పుడు నాకు బాధ ఎందుకు, నీ మీద కోపమెందుకు?'

ఆ వ్యక్తి అవాక్కైపోయాడు. తన ప్రవర్తనకు చాలా సిగ్గుపడిపోయాడు. బుద్ధుడిని క్షమాపణ వేడుకున్నాడు.

హాయిగా జీవించగల సంపన్న దేశంగా మార్చిన ఘనత లీ క్వాన్ యూది. 2025-26లో సింగపూర్ తలసరి జీడీపీ వినిమయ రీత్యా 1.39 లక్షల డాలర్లు. అదే విధంగా ఇజ్రాయిల్, ఇంగ్లండ్, అమెరికా వంటి దేశాల్లో మేధోనేతల గురించి కొన్ని ఉదాహరణలు చెప్పవచ్చు. కానీ ఈ సంఖ్య మొత్తంగా చూస్తే చాలా తక్కువే. ఆ తక్కువ మందిలో జేపీ ఒకరు ఎందుకు కాలేకపోయారు అని అనుకోవచ్చు. ఈ ప్రశ్నకు లీ క్వాన్ యూ చెప్పిన సమాధానం సరైనది. కాలపరీక్షకు తట్టుకుని నిలిచినది. సింగపూర్ తరహాలో భారత్‌లో మార్పు తేగలరా? అని అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ 'ప్రపంచంలో భారత్‌తో పోల్చదగిన దేశం చైనా. జనాభా పరంగా, సాంస్కృతిక వారసత్వ పరంగా. అలాంటి చైనాలోనైనా మార్పు తేవచ్చుగానీ, భారత్‌లో తేవటం చాలా కష్టమని' లీ క్వాన్ యూ అనేవారు. అందుకు కారణం.. ఇన్ని భాషలు, కులాలు, మతాలు, తెగలు, వర్గాలు ఉన్న సంక్లిష్ట దేశం ప్రపంచంలో మరొకటి లేదు. నల్లజాతి నేత బరాక్ ఒబామా కేవలం జేపీ చెప్పిన భావజాలాన్నే చెప్పి అమెరికాలో అత్యంత ఆదరణ గల అధ్యక్షుడిగా పేరొందారు. వర్ణ వివక్ష ఉన్న దేశంలో రెండు సార్లు మంచి మెజారిటీతో ఎన్నికయ్యారు. కేవలం ఒక ఉపన్యాసంతో, కొన్ని నెలల పర్యటనలతో ఒబామా అమెరికాలో ప్రసిద్ధిగాంచారు. అదేవిధంగా, బ్రిటన్‌లో డేవిడ్ కేమెరాన్. కానీ భారత్‌లో అలాంటి ప్రజాస్వామిక పరిణతి, ఆదాయాలు లేకపోగా.. ఒక ప్రాంతంలో చెప్పిన విషయాలు ఇంకో ప్రాంతం వారికి అర్థం కావు. అక్కడి భాష వేరు, యాస వేరు, ఇక్కడి భాష, యాస వేరు. సంస్కృతి, ఆచారాలు వేరు. కులం, మతం, తాతతండ్రులు.. వంటివన్నీ అడిగాక వీలుంటే మనం చెప్పింది వింటారు. వీటిని కొంతమేర ఛేదించగలిగినా, మన ఎన్నికల వ్యవస్థలో రెండు పార్టీలకే అవకాశం. మూడో పార్టీ అధికారంలోకి రావాలంటే, మొదటి రెండు ప్రధాన పార్టీల్లో ఒకటి అదృశ్యం కావాలి. తమిళనాడులో టీవీకే విజయం తరహాలో అలా అరుదుగా జరుగుతుంది.

అరవింద్ కేజ్రీవాల్ భావజాలమంతా లోక్‌సత్తా నుండి తీసుకున్నదే. ఢిల్లీ ఓ పెద్ద మునిసిపాలిటీ లాంటి రాష్ట్రం, ఎక్కువ ఆదాయాలు, మీడియా కేంద్రీకరణ ఉన్న రాష్ట్రం. ఈ విషయం కేజ్రీవాల్ గెలిచినప్పుడు 2014 ప్రాంతంలో చెప్పినా పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు. కానీ ఆప్ మీద గోవా ఎన్నికల్లో డబ్బు కోసం మద్యం కుంభకోణం ఆరోపణలు రావటంతో, అవినీతి వ్యతిరేక ఉద్యమకారుడు కాస్తా అవినీతిపరుడిగా పదవికి రాజీనామా చేయకుండా జైలుకెళ్లి, చివరికి ఆ తర్వాత ఎన్నికల్లో పదవిని కోల్పోయారు. ఇలా ప్రతి ఒక్కరూ ప్రధాన సాంప్రదాయ రాజకీయంలో ఒక విషవలయంలో కొట్టుకుపోతున్నారు, కొందరు వ్యక్తిగతంగా నిజాయతీగా ఉంటున్నారు తప్ప.. మేధావిని గెలిపించి అయిదేళ్లలో దేశంలో సమూల మార్పులు తెచ్చే యోచన అత్యధికుల్లో కొరవడింది. లోక్‌సత్తా ఉద్యమాన్ని, పార్టీని రెండో స్వాతంత్ర్య పోరాటంగా జేపీ చెప్పటాన్ని ఆక్షేపించారు.

భారత్‌లో ఇప్పుడున్న పరిస్థితుల్లో విషవలయంలో భాగమై కొన్ని సీట్లు, అధికారాన్ని పొంది సాధించటం కంటే.. ఏ మార్పులు తెస్తే, మొత్తం వ్యవస్థలో మౌలిక మార్పులు వచ్చి ప్రతి బిడ్డకూ సామర్థ్యం మేర ఎదిగే అవకాశాలు లభిస్తాయో, నివారించదగ్గ బాధలు తొలగుతాయో ఆ మార్పుల కోసం జేపీ కృషి చేస్తున్నారు. ఇది నిజమైన రాజకీయం, పవిత్ర వ్యాసంగం.

> **నిజానికి రాజకీయాల్లో, పాలనలో అసాధారణ నైపుణ్యమున్న మేధావులు అవసరం లేదు. కానీ మౌలిక మార్పులు అవసరమైనప్పుడు మాత్రం వారి అవసరం ఉంటుంది. ప్రజాస్వామ్యాన్ని పౌరులు, సమాజం నిరంతరం అప్రమత్తంగా కాపాడుకుంటుండాలిగానీ.. అంతా సవ్యంగా నడుస్తూ, ప్రజాస్వామ్యం పరిణతితో సాగుతున్నప్పుడు సాధారణ స్థాయి నాయకులు కూడా మంచి ఫలితాలనే సాధిస్తారు. మన దేశానికి ఇంకా ఆ స్థాయి రాలేదు కాబట్టే, జేపీ లాంటి ప్రజా మేధావుల అవసరం కొనసాగుతోంది.**

అసత్యాలకు ఎంత అద్భుత భాష్యం చెప్పినా సత్యం కాలేదు

'ఏకమ్ సత్ .. విప్రా బహుధా వదన్తి' అన్నది ఉపనిషత్ వాక్యం. ఒక సత్యాన్ని విజ్ఞులు ఎన్ని రకాలుగానైనా వివరిస్తూ భాష్యం చెప్పవచ్చు. కానీ అసత్యానికి ఎంత అద్భుతమనిపించే భాష్యం చెప్పినా అది విజ్ఞత అనిపించుకోదు. మహాఅయితే సత్యం సత్యంగా, అసత్యం అసత్యంగా నిగ్గు తేలేంత వరకూ కాస్త హడావుడి సాగుతుంది. విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన,ఆర్థిక క్రమశిక్షణ, నైపుణ్యాలు, చిన్న పట్టణాలతో గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు, ఎన్నికల సంస్కరణలు, రాజకీయ పార్టీల ప్రజాస్వామీకరణ మొదలైన అభివృద్ధి చెందిన భారత్ కి అవసరమైన అంశాల కోసం జేపీ పార్టీలకతీతంగా పోరాడుతున్నారు. వీటిల్లో ఏ ఒక్క అంశం కోసం మాట వరసకు కూడా ప్రయత్నం చేయనివారు ఆయన మేధస్సు మీద వ్యాఖ్యానాలు చేయటం కామన్ సెన్స్ ఉన్నవారెవరూ హర్షించరు.

హేతుబద్ధత, తార్కికత, సాక్ష్యాలు, బహిరంగ చర్చ ప్రమాణాలు వగైరాలను ప్రదర్శించాలి. ఏమైనా సదరు జర్నలిస్టు చేసిన కృషి పట్ల కొంత గౌరవం ఉంది, వారు తప్పును గుర్తిస్తారు అనే ఆశాభావం ఉంది కాబట్టి.. మేధావి, ప్రజాజీవితంలో మేధావి అనే చర్చకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు.

కొసమెరుపు: నిజానికి రాజకీయాల్లో, పాలనలో అసాధారణ నైపుణ్యమున్న మేధావులు అవసరం లేదు. కానీ మౌలిక మార్పులు అవసరమైనప్పుడు మాత్రం వారి అవసరం ఉంటుంది. ప్రజాస్వామ్యాన్ని పౌరులు, సమాజం నిరంతరం అప్రమత్తంగా కాపాడుకుంటుండాలిగానీ.. అంతా సవ్యంగా నడుస్తూ, ప్రజాస్వామ్యం పరిణతితో సాగుతున్నప్పుడు సాధారణ స్థాయి నాయకులు కూడా మంచి ఫలితాలనే సాధిస్తారు. మన దేశానికి ఇంకా ఆ స్థాయి రాలేదు కాబట్టే, జేపీ లాంటి ప్రజా మేధావుల అవసరం కొనసాగుతోంది. ✡

ఐఏఎస్ కంటే రాజకీయాలు పరిష్కారమని దివ్య మిట్టల్ ఎందుకు భావించారు?



వచ్చే నాలుగైదేళ్లలో ప్రపంచవ్యాప్తంగా అనూహ్య మార్పులు వస్తాయని, భవిష్యత్తులో రాబోయే ఉద్యోగాలు ఎలా ఉంటాయో ఎవరూ కచ్చితంగా చెప్పలేకపోతున్నారని, ఎప్పటికప్పుడు నైపుణ్యాలను పెంపొందించుకుంటుండేలా సిద్ధమవ్వాలని 2017లో తెలుగు రాష్ట్రాల సురాజ్య యాత్రలో వివిధ విద్యాసంస్థలు, ఇంజినీరింగ్ కళాశాలల్ని సందర్శించినప్పటి నుండి ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల పర్యటనలో విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, ఉపాధి, స్థానిక ప్రభుత్వాల సాధికారత మొదలైన అంశాలకు సంబంధించి గుర్తించిన సమస్యలను సమగ్ర పరిష్కారాలతో నివేదికగా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుకి అందించారు. 2024లో మళ్లీ అధికారంలోకి వచ్చాకగానీ, వాటి అమలు కొంత మొదలవలేదు. ఇప్పుడు ఏఐ (కృత్రిమ/ఏజంటిక్ ఇంటెలిజెన్స్) ప్రభావం పెరిగాకగానీ, దేశంలోని మిగిలిన రాష్ట్రాలూ ఆ అనిశ్చితి తీవ్రతను గుర్తించలేదు. ఏఐ పర్యవసానాలు ఎలా వుంటాయో సిలికాన్ వేలీని అపారంగా ప్రభావితం చేసిన స్టాన్‌ఫర్డ్ వంటి విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు కూడా చెప్పలేకపోతున్నారు. ఈ రకమైన సాంకేతిక విప్లవంలో మనం ప్రపంచ ప్రభావం నుండి పూర్తిగా వేరుపడి మనుగడ సాగించలేంగానీ.. చాలావరకూ మన ప్రయోజనాల్ని కాపాడుకోగలం. కానీ రాజకీయం మారకుండా ఒక పరిధి దాటి అవాంఛనీయ పరిణామాల పరంపరను నిలువరించలేం. భారత్‌కి ఉన్న ఆర్థికావకాశాలు 21వ శతాబ్దానివి, జనాభాలో అత్యధికంగా ఉన్న యువత జెన్ జడ్, జెన్ ఆల్ఫా తరంవారు కాగా.. రాజకీయాలు మాత్రం 19వ శతాబ్దం, మధ్యయుగాల నాటివి అని లోక్‌సత్తాను ప్రారంభించినప్పుడే జేపీ పేర్కొన్నారు. ఇప్పుడు, 30 ఏళ్ల తర్వాత.. జాతీయ స్థాయిలో, కొన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు ఆర్థిక క్రమశిక్షణ, పెట్టుబడులను ప్రోత్సహించటం వరకు చేస్తుంటే, ఉపాధి అవకాశాలకు పెద్దగా చేయకున్నా ఆకలికేకలు లేకుండా చేస్తుంటే.. అంతమాత్రానికే మనం మెరుగైన పాలనగా భావిస్తున్నాం. కానీ ఏఐ వంటి సాంకేతికతలు గతంలోలా మనకు చేరటానికి సంవత్సరాల తరబడి సమయం పట్టకుండా, కేవలం కొన్ని రోజుల్లోనే రావటంతోపాటు.. ఆర్థిక రంగాన్ని ఊహించని రీతిలో ప్రభావితం చేయనుందనే అంచనాలు వెలువడుతున్నాయి. వేల ఏళ్లుగా మెరుగవుతూ వస్తున్న మానవ సంబంధాల్ని కూడా గణనీయంగా మార్చివేసే అవకాశం ఉంటుందంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తమ ప్రజల భవిష్యత్తుని వరిరక్షించుకోవటానికి కొన్ని దేశాలు సమాజంలో ఆయా రంగాల్లో నిష్ణాతుల్ని, విధాన నిపుణుల్ని, టెక్నోక్రాట్స్‌ని మంత్రి పదవుల్లోకి తీసుకొంటుండగా.. మన వద్ద ఇంకా ఆ పరిస్థితి లేదు. ఒక ఆర్థికవేత్తను ప్రధానిగా నియమించగలిగాం తప్ప.. ప్రత్యక్ష ఎన్నికల్లో గెలిపించలేని పరిస్థితి. 21వ శతాబ్దపు రెండో పాతికేళ్ల దశకు తగ్గ రాజకీయ నాయకత్వం మనకు అవసరం. ఇలాంటి నేపథ్యంలో, ఇటీవల తమిళనాడులో టీవీకే, బీహార్‌లో పీకే, కాక్రోచ్ జనతా పార్టీకి డబ్బు పంచకుండా లభిస్తున్న ప్రజాదరణ కొంత ఆశావహ పరిస్థితుల్ని కల్పిస్తోంది. జేపీ చెప్పినట్లు, మార్పుకి మొలకలు కనిపిస్తున్నాయి. కానీ ఎజెండా ఆ ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చేలా లేదు. లోక్‌సత్తా నుండి కొన్ని మౌలికాంశాల ఎజెండాతో పాటు మెంటారింగ్ కూడా తీసుకున్నా.. ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) ఆచరణలో విఫలమవటం చూశాక, ఆ మొలకలు నిజమైన మార్పుకి దోహదం ఎంతవరకూ దోహదం చేయగలవో వేచిచూడాల్సుంది. వారి కంటే కొంత మెరుగైన ఎజెండాతో, అవగాహనతో, ఐఏఎస్‌కి రాజీనామా చేసి ఉత్తర్‌ప్రదేశ్ నుండి దివ్య మిట్టల్ రాజకీయరంగ ప్రవేశప్రకటన చేశారు. ఆమె స్వస్థలం హర్యానా, ఢిల్లీ ప్రాంతంగా నమోదైనా.. సివిల్ సర్వెంట్‌గా 2013లో ఉత్తరప్రదేశ్ క్యాడర్ నుండి ఎంపికయ్యారు. ఆగస్టు 30, 2026న తన రాజీనామాను ప్రకటించారు. అంతకుముందు నుండి తెలుగు సహా పలు ప్రాంతీయ పత్రికలు కూడా ఆమె ట్విటర్ (ఎక్స్) ఖాతాలోని భావాలను ప్రచురిస్తుండేవి. అవి వ్యక్తిగత వ్యక్తీకరణల్లా కాకుండా.. ఉమ్మడి భవిష్యత్తుకి, సమాజ హితానికి సంబంధించినవి కావటమే అందుకు కారణం.

ఈ దేశంలో కోట్ల మంది జీవితకాల పురస్కారంగా భావించే ఐఏఎస్‌కి తాను ఎందుకు రాజీనామా చేశారో సెప్టెంబర్ 29న విడుదల చేసిన వీడియో ప్రకటనలో దివ్య మిట్టల్ వివరించారు. 'గొంతు వినిపించని ప్రజల మాటలు వినిపించేందుకే' తాను రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. ఐఏఎస్ హోదాలో అది సాధ్యం కానందున, రాజకీయాల్లోకి వస్తున్నట్లు తెలిపారు. ఇందుకు కొన్ని ఉదాహరణల్ని ఆమె ప్రస్తావించారు.

+ భారత ప్రజాస్వామ్య రాజ్యాంగం పౌరులను అత్యున్నత స్థాయిలో నిలబెడుతుంది. కానీ వాస్తవాల్ని చూస్తే.. పౌరులు శాసించే స్థానంలో లేరు, అర్థించే స్థాయిలో ఉన్నారు.

+ రాజకీయాలు వ్యక్తిగత హోదా, పటాటోపం కోసం కాదు. పౌర సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల వరకు కనీసం

గొంతు కూడా వినిపించలేనివారి సాధికారత కోసం. కానీ ఇందుకు విరుద్ధమైన రాజకీయం ఎక్కువగా కొనసాగుతోంది.

+ స్వతంత్రం వచ్చినప్పటి నుండి మంచినీటి సదుపాయానికి నోచుకోని లాహురియాధా అనే కొండప్రాంత గ్రామానికి మీర్జాపుర్ జిల్లా కలెక్టర్‌గా చేస్తున్నప్పుడు ఒక వృద్ధురాలు నా వద్దకు వచ్చారు. పెన్షన్ కోసమో, ఇల్లు కోసమో లేదా మంచినీరు ఇవ్వాలనో అడగటం కోసం వచ్చారనుకున్నాను. కానీ ఆమె తమ ఊరిలో 5వ తరగతి వరకు ఉన్న పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయమని అడగటం నన్ను కదిలించింది. వెంటనే అన్ని రకాల అనుమతులూ ఇచ్చినా, నిధులున్నా, ఇతర వనరుల్ని సమకూర్చినా..మూడేళ్లు గడిచినా ఆ స్కూలు నిర్మాణం మొదలవలేదు (దివ్య మిట్టల్ రాజీనామా సందర్భంగా ఈ విషయం చెప్పటంతో హడావుడిగా ఇటీవల ప్రారంభించారు).

+ నేను యూపీ రెవెన్యూ ప్రత్యేక కార్యదర్శిగా ఉన్నప్పుడు.. ఒక వ్యక్తి ప్రభుత్వ భూమి లీజుకి తీసుకున్న పత్రాలతో వచ్చారు. ఆ డాక్యుమెంట్లని పరిశీలించినప్పుడు, కొన్ని లొసుగులు కన్పించాయి. వెంటనే సంబంధిత అధికారితో మాట్లాడా. దీంతో, వాటిని తయారుచేసిన ఉద్యోగి మీద చర్యలు తీసుకున్నారు. కానీ ఆ వ్యక్తికి లీజును మాత్రం కేటాయించలేదు. ఎందుకని అడిగితే.. పై నుండి ఆదేశాలు అలా ఉన్నాయి అని సమాధానమిచ్చారు. పైన ఉండాల్సింది ప్రజలు కాకుండా ఎవరు? అధికారులు, నేతలా? తనకు రాజ్యాంగ హక్కుగా అందాల్సిన సేవలకు ఒక సామాన్య పౌరుడు ఎందుకు సిఫార్సులు, లంచాలు ఇవ్వటం, అన్నిసార్లు తిరగటం?

+ రాజకీయాల తీరు మారితే తప్ప మన దేశాన్ని మార్చలేం

దివ్య మిట్టల్ అక్టోబర్ 15, 2026న 'జన్ నీతి భారత్' పార్టీని స్థాపించినట్లు ప్రకటించారు. 2027 యూపీ పోల్స్‌లో పోటీ చేస్తామని తెలిపారు. తాను పుట్టింది హర్యానాలో అయినా.. యూపీ తన కర్మభూమి అని, తనను సొంత కూతురిలా ఆదరించిన రాష్ట్రమని, అందువల్ల అక్కడే తన రాజకీయ కలాపాలు ప్రారంభిస్తానని దివ్య మిట్టల్ ప్రకటించారు. సంత్ కబీర్ నగర్, మీర్జాపుర్, దేవరియా మొదలైన జిల్లాల్లో కలెక్టర్‌గా పనిచేయటంతోపాటు.. పలు విభాగాల్లో ఇతర బాధ్యతల్ని ఆమె నిర్వహించారు. సెప్టెంబర్ 23న ఆమె రాజీనామా చేసినప్పుడు, మీర్జాపుర్ ప్రజలు పూలవర్షం కురిపించి తమకు చేతనైన రీతిలో ఆత్మీయతను ప్రదర్శించారు. అలా ప్రజల మన్ననలు పొందిన కలెక్టర్లు గతంతో పోలిస్తే తగ్గుతున్నా ఇప్పటికీ ఈ దేశంలో పలువురు ఉన్నారు. కానీ వారి సేవల్ని కీలక స్థానాల్లో ఉపయోగించుకునే, మొత్తంగా ప్రభుత్వోద్యోగ వ్యవస్థను సమర్థంగా, సమాజ పన్నుల డబ్బును పౌరులు కేంద్రంగా పనిచేయించే రాజకీయ, పాలనా వ్యవస్థే లేదు. అందుకే 1996లో జేపీ ఎఫ్‌డీఆర్‌ని, ఆ తర్వాత లోక్‌సత్తా రాజకీయ ఉద్యమం, పార్టీల్ని ప్రారంభించారు. ఐఏఎస్‌గా దేశ చరిత్రలో ఇప్పటికీ సాటిలేని సేవల్ని అందించినా, తాను చేయగలిగిన, ఈ దేశానికి అవసరమైన మంచిలో కేవలం 30% మాత్రమే చేశానని, వ్యవస్థను మారిస్తే 90% వరకు చేయవచ్చనే అవగాహనతో జేపీ ఉద్యమంగా, పార్టీగా, పౌర సమాజ సంస్థగా రాజకీయ, పాలనా, ఆర్థిక, సామాజిక సంస్కరణల కోసం నిరంతర కృషి చేస్తున్నారు. తన రాజకీయ కార్యాచరణ పౌరుల చుట్టూ పాలన లక్ష్యంగా ఉంటుందని దివ్య మిట్టల్ చెబుతున్నారు. ఇప్పటివరకూ స్వతంత్ర భారతదేశ 80 ఏళ్ల చరిత్ర మొత్తాన్నీ, ప్రతి రంగాన్నీ తాను అధ్యయనం చేయాల్సుందన్నారు.

'ప్రజలే ప్రభువులు' కావాలంటే, యూపీ చేయాల్సింది చాలా ఉంది. విద్య అంటే ఏమిటో తెలియకున్నా, తనకు మంచినీరు వంటి కనీస అవసరాలు లేకున్నా.. పెన్షన్లు వంటివి తాత్కాలిక అవసరాలు, తాయిలాల కోసం కాకుండా హైస్కూలు కోసం ఒక వృద్ధురాలు అడిగిందంటే, ఆ రాష్ట్రంలో శ్రీరాముడో, మరో దేవుడో కొలువుదీరి ఏం ప్రయోజనం? యుగాలు మారినా, సృష్టి అంతమైనా నిలిచివుండే వారణాసి, ఆ పక్కనే ఎప్పుడూ ఎండిపోని గంగానది ఉండి ఏం లాభం? ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య అందించటం ప్రభుత్వ బాధ్యతల్లో కీలకమైనది. అందుకు డబ్బు కూడా ఖర్చు చేస్తున్నారు. అవసరానికి మించి టీచర్లున్నారు. సమాజంలో బోలెడంత డిమాండ్ ఉంది. గొప్ప సాంకేతికత ఉంది. మీర్జాపుర్ అయినా, అయోధ్య అయినా అందరూ తమ పిల్లలకు మంచి చదువును కోరుకుంటున్నారు. అయినా, ఆ డబ్బుని హేతుబద్ధంగా వినియోగించి ఆ పాఠశాల విద్యార్థులకు మంచి చదువు వచ్చేలా చేయటంలో పాలకులు విఫలమవుతున్నారు. ఈ క్రమంలో, ఆమెకు కావలసిన అన్ని రకాల మార్గదర్శకత్వాన్నీ ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా నుండి ప్రత్యక్షంగా, పరోక్షంగా తీసుకోవచ్చు. జేపీ అఫీషియల్ డిజిటల్ ఖాతాల నుండి సమగ్ర సమాచారాన్ని అధ్యయనం చేయవచ్చు. రాజకీయాల్లో గుణాత్మక మార్పుకి మహిళా నాయకత్వం దోహదం చేస్తుందన్న అంచనాల నేపథ్యంలో మహిళా రిజర్వేషన్లను సద్వినియోగం గావించుకోవటానికి ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఇప్పటికే కొన్ని కార్యక్రమాల్ని నిర్వహించింది. వాటిని కొనసాగిస్తుంది. ఆసక్తిగల మహిళలు దివ్య మిట్టల్ లాంటి వారి నుండి కూడా స్ఫూర్తిని పొందవచ్చు, అవగాహనతో వ్యవహరించటం నేర్చుకోవచ్చు. తనకు మద్దతిచ్చేవారు తెలియచేయటం కోసం ఒక వాట్సాప్ నంబర్‌ని ఆమె అందుబాటులోకి తెచ్చారు. ఉమ్మడి అవసరాలకు సంబంధించి మార్పు తేవటం కోసం అవగాహనతో, సంఘటితంగా పనిచేసే క్రమంలో దివ్య మిట్టల్ లాంటివారితో సంధానమై కెరీర్ చూసుకుంటూనే సమాజ హితంలో భాగమవ్వచ్చు. జేపీ లాంటి వారి సోషల్ మీడియా, రచనలు, ప్రసంగ పాఠాల నుండి శిక్షణ పొందవచ్చు. అదే విధంగా, నిధులు, అధికారాలతో స్థానిక ప్రభుత్వాలకు జవాబుదారీతనమున్న సాధికారతనిచ్చి గ్రామాల మధ్య చిన్న పట్టణాలను పర్యావరణహిత ఆర్థికకేంద్రాలుగా అభివృద్ధి చేసి అనుసంధానిస్తే.. ఉపాధితో కూడిన ఆర్థిక వ్యవస్థ పెరగటంతోపాటు, ఇప్పుడున్న మెట్రో యువతకుతోడు సామాన్య ప్రజల నుండి కూడా యువ నాయకత్వం పెద్దఎత్తున రాజకీయాల్లో నాయకత్వం అందించగలుగుతుంది. ✡

కులగణన - రిజర్వేషన్లకు 50% పరిమితి - రాజ్యాంగ సమానత్వం - అంబేద్కర్

నవంబర్ 30, 1948న రాజ్యాంగ సభలో ముసాయిదా ఆర్టికల్ 10 క్లాజ్ 3 (ఇప్పుడు రాజ్యాంగంలో అధికరణం 16 (4))పై చర్చలో 'రిజర్వేషన్ల మినహాయింపు- రాజ్యాంగ సమానత్వం' గురించి జరిగిన చర్చకు రాజ్యాంగ రచనా సంఘం చైర్మన్‌గా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్పష్టమైన సమాధానమిచ్చారు. 'రాజ్యాంగ సమానత్వం మౌలిక సూత్రం (ఫస్ట్ ప్రిన్సిపుల్). కానీ చారిత్రకంగా ప్రభుత్వ హెూదాల్లోకి అవకాశం నిరాకరణకు గురైన అణగారిన సామాజిక వర్గాలకు మినహాయింపు ఉండటం అవసరం. అయితే రిజర్వేషన్ అనే ఈ మినహాయింపు.. సమానత్వమనే రాజ్యాంగ మౌలిక సూత్రాన్ని మింగేయకూడదు. రిజర్వేషన్ ఆఫ్ అపాయింట్‌మెంట్స్, పోస్ట్స్ అనేవి మైనారిటీ ఆఫ్ సీట్స్‌గా మాత్రమే, ఆ పరిమితిలోనే ఉండాలి' అని అంబేద్కర్ పేర్కొన్నారు. ఆరోజు అంబేద్కర్ ఇచ్చిన స్పష్టతనే ఇంద్ర సాహ్ని కేసు (1992)లో సుప్రీంకోర్టు తొమ్మిది మంది న్యాయమూర్తుల ధర్మాసనం ఉటంకించి, రిజర్వేషన్లకు 50% పరిమితిని విధించింది. ఆ తర్వాత 2018లో మరాఠా రిజర్వేషనపై కూడా సుప్రీంకోర్టు అంబేద్కర్ ప్రసంగాన్ని ఉటంకించింది. అదేవిధంగా, ఈ యాభై శాతం పరిధిలో వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వటానికి కులగణన అనేదే అవసరం లేదు. రిజర్వేషన్లలో కొత్త కులాలను చేర్చటం, ఉన్న కులాల్లో కేటగిరి మార్చటం వంటి వాటికి ఇప్పటికే చట్టాలున్నాయి. రిజర్వేషన్లున్న కులాలవారికి అవసరమైన కుల ధ్రువీకరణ పత్రానికీ కులగణన అక్కర్లేదు. కొందరు రిజర్వేషన్లు 69% ఉన్న తమిళనాడులోలా రాజ్యాంగం తొమ్మిదవ షెడ్యూల్‌లోకి చేర్చి బీసీలకు (ఈబీసీ) రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన పెంచాలని సూచిస్తున్నారు. ఆ అంశంపై కూడా విచారణ పెండింగ్‌లో ఉంది. తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చినా సమీక్షించే అధికారం తమకు ఉందని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. ఈడబ్ల్యూసీ (ఆర్థికంగా బలహీన వర్గాలు) రిజర్వేషన్లు సామాజిక వివక్షకు గురైన వారికిచ్చే కోటా పరిధిలోకి రావని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా.. అది సరైన మార్గం కాదు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కాకుండా.. ఆయా కులాల్లో పేదలకు, తల్లిదండ్రులకు చదువులేని, పట్టణ ప్రాంత వాసులతో పోటీపడే అవకాశాలులేని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పోటీ పరీక్షల్లో కొన్ని మార్కులు కలపటం వంటి ప్రత్యామ్నాయాలను అనుసరించాల్సింది. ఈ నేపథ్యంలో, నిమ్న, వెనుకబడిన వర్గాలను కులగణన వంటి రాజకీయ విన్యాసాలతో ఇంకా మోసం చేయకుండా.. రాజ్యాంగ మౌలిక లక్ష్యమైన సమానత్వానికి, అంబేద్కర్ దార్శనికతకు అనుగుణంగా 50% దాటకుండా రిజర్వేషన్లను అమలు చేయటం సరైన విధాన నిర్ణయమవుతుంది. అదేవిధంగా, ఇప్పటికే రిజర్వేషన్ల వల్ల గణనీయంగా లబ్ధిపొందినవారిని క్రీమీలేయర్‌గా మినహాయించి, ఆ అవకాశాలు అదే కులాల్లో, తరగతుల్లో అట్టడుగు వర్గాలకు అందించాలి. కానీ ఏ రకంగా చూసినా రిజర్వేషన్లు తాత్కాలిక ఉపశమనమే తప్ప.. శాశ్వత పరిష్కారం కాదు. నిజమైన పరిష్కారం నాణ్యమైన విద్య, అందులోనూ పాఠశాల విద్యలో ఉంది. స్కూలు విద్యలో అసలు రిజర్వేషనే లేదు. కానీ ఎస్.సి, ఎస్.టి, బి.సిల పిల్లలు ఎక్కువగా చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో పేరుకి ఉచితంగా చదువుని ఇస్తూ, ఒక్కో విద్యార్థి మీద ప్రతి సంవత్సరం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో, చాలా రాష్ట్రాల్లో రూ.1,10,000 దాకా ఖర్చు చేస్తూ కూడా ఎందుకూ పనికిరాని చదువు అందిస్తున్నాం. విద్యాప్రమాణాల్ని ఎలా బాగు చేయాలి, ఎక్కడికెళ్లినా ఉపాధి సంపాదించుకోగల, సాంతంగా సంస్థని స్థాపించి ఇంకొందరికి ఉపాధిని అందించగలిగే నైపుణ్యాలను, పరిష్కార సామర్థ్యాన్ని, సంక్లిష్ట, వినూత్న ఆలోచనా శక్తిని, అనిశ్చిత సమాజంలో నిరంతరం నైపుణ్యాలను మెరుగుపరచుకునే అధ్యయనశీలురుగా తీర్చిదిద్దే విద్యను ఎలా అందించాలి అని ఆలోచించకుండా.. రాజ్యాంగ స్ఫూర్తికి, రాజ్యాంగ నిర్మాత దార్శనికతకు వ్యతిరేకంగా వ్యవహరించటం అణగారిన వర్గాలకు మరింత అన్యాయం చేయటమవుతుంది. అదేవిధంగా, వారి ఉత్పాదక శక్తిని పెంచే మంచి ప్రమాణాల ఆరోగ్యం గురించి మాట్లాడకుండా, ఏ రకంగా వారి ఆదాయాల్ని పెంచగలం? ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ ఉన్నా.. అనారోగ్యం వల్ల జేబులు గుల్ల చేసుకుంటున్నవారిలో అత్యధికులు దళితులు, బీసీలు ఎందుకుంటున్నారని ఆలోచించామా? ఏ ప్రభుత్వాస్పత్రికైనా వెళ్లి గణాంకాలు చూడండి. ఇంకో విషయం, స్థానిక ప్రభుత్వాల స్థాయిలో ఇప్పటికే మహిళలు, బలహీన వర్గాలకు రిజర్వేషన్లు దాదాపు జనాభా ప్రాతిపదికన ఉన్నా, అక్కడ నిధులు, అధికారాలు లేకపోవటం వల్ల నాయకత్వం ఎదగటం లేదు. రిజర్వేషన్లను 50 శాతం దాటి అమలు చేయటం సాధ్యం కాదని తెలిసినా, ప్రచారలబ్ధి పొందేందుకే కులగణన నిర్వహించారని బహిరంగ రహస్యంలా తెలుస్తున్నా, చివరిదాకా ఆశలు రేకెత్తించి రాజకీయ నాటకాన్ని రక్తికట్టించి వివిధ వర్గాలకి మొండిచెయ్యి చూపినా, స్థానిక ప్రభుత్వాల ఎన్నికల్లో 67% దాకా బీసీలు ప్రత్యక్షంగా ఎలా గెలవగలిగారని ఎందుకు ఆలోచించటం లేదు? డబ్బులు వెదజల్లి ఓట్లు కొన్నవారే ఎక్కువగా గెలవ గలుగుతున్నారని ఎందుకు చర్చించటం లేదు? ఇంతా అయ్యాక స్థానిక ప్రభుత్వాలలో ఎన్నికయిన నాయకులకి అధికారాలు, బాధ్యతలు ఇవ్వకుండా ఎందుకు ఉత్సవ విగ్రహాలుగా ఉంచేశారు?- ఇవీ నిజమైన సమస్యలు. దళితులు, ఆదివాసీలు, బీసీలకు అమలు చేయగలిగిన పరిష్కారాలు. ఎజెండాగా మార్చాల్సిన అంశాలు. కాబట్టి.. రాజ్యాంగం చెబుతున్న, అంబేద్కర్, జాతీయోద్యమ నేతలు ఆశించిన సమానత్వ లక్ష్యం మేరకు రిజర్వేషన్లకు 50% పరిధిని గౌరవించటం; రిజర్వేషన్లకు బయట ఉన్న పేదలు, వెనుకబడినవారికి పోటీ పరీక్షల్లో కొన్ని మార్కులు కలపటం వంటి పరిష్కారాల అమలు; నాణ్యమైన పాఠశాల విద్య, ఆరోగ్యాలకు పటిష్ఠ చర్యలు; మహిళలు సహా అణగారిన వర్గాల నుండి పెద్దసంఖ్యలో నాయకత్వం ఎదిగేలా స్థానిక ప్రభుత్వాలకు సాధికారత; ఎన్నికల్లో డబ్బు ఖర్చు అవసరం లేకుండా ప్రస్తుత ఎఫ్‌పీటీపీ ఎన్నికల వ్యవస్థను మార్చి ప్రతి ఓటుకూ విలువ ఉండే దామాషా ఎన్నికల పద్ధతిని తేవటం కోసం పోరాడదాం. కులాల పేరుతో సమాజాన్ని విభజించి, రెచ్చగొట్టటం కాకుండా.. పుట్టుకతో వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలను అందిద్దాం.

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th Nov 2026 Posting Date 15 &16th of every month
Posted at BPC-IV Patrika Channel, Nampally, HYDERABAD-500 001



France in Flames,
Will India be Next?



If undelivered please return to:
LOKSATTA UDYAMA SAMSTHA,
H.NO. 6-3-678,B-106,
PASHA COURT 71, Somajiguda,
Behind TRIBHUVANDAS
JEWELLERS (TBZ),
Hyderabad - 500 082

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS , Hyderabad- 500 082.
Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No : CFC-1 and 2, Survey No: 18, E-City, SEZ, General industrial park, Raviryal & Srinagar village, Maheswaram mandal, Rangareddy district-501359, Telangana.